

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-2-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 13 పేజీలు: 12 వెల: 6.50


రంగంలోకి కొత్త రాఫెల్ విమానాలు

ట్రంప్- నెతన్యాహు కీలక భేటీ

9లో

# మండలికి ఓకే అసెంబ్లీకి 'నో'



## విపక్ష హోదా ఇవ్వనందుకు వైసిపి నిరసన

## మండలిలో పోరాడుతాం: జగన్

**విజయవాడ,ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభలో వైసిపికి చట్టసభల నిబంధనలను అనుసరించి విపక్షహోదా ఇవ్వాల్సి ఉందని మాజీ సీఎం జగన్ అన్నారు.ఇది రాజ్యాంగబద్ధమైన అంశం కాబట్టి ఆ దిశలో ఆందోళన చేస్తున్నామన్నారు.అయితే ఈ విషయంపై ఎందుకు చట్టపరంగా వ్యవహరించాల్సిన వాళ్ళు,ఇతరులు మాట్లాడుతున్నారని ఆయన ప్రశ్నించారు.వ్యవస్థను నాశనం చేస్తున్నారు.ప్రశ్నించే అవకాశం లేకుండా సభలో మనకు విపక్ష హోదా ఇవ్వడం లేదన్నారు.ఏపీ అసెంబ్లీలో వైసీపీకి విపక్ష హోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ.. ఈసారి బడ్జెట్ సమావేశాల్లోనూ గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి హాజరైన జగన్‌ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. బాయ్ కాట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం అసెంబ్లీ బీఏసీ సమావేశానికి కూడా జగన్ హాజరు కాలేదు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో జగన్ భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై వారితో చర్చించారు. అనంతరం కీలక నిర్ణయం ప్రకటించారు. వైఎస్సార్సీపీకి విపక్ష పార్టీ హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా >>2

# కేంద్రం నుంచి మరిన్ని నిధులు



## వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

## ప్రాయోజిత పథకాలకు అదనపు నిధులు సాధించాలి

## గరిష్ట కేటాయింపులతో ప్రణాళికలు

## మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు కూడా అడగాలి

**విజయవాడ, ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర బడ్జెట్‌లో 2026 – 27 ఏపీలో కేటాయించిన రేర్ ఎర్త్ కారిడార్ సహా వివిధ ప్రాజెక్టులను రాష్ట్రంలో ఏర్పాటు చేసే అంశంపై అత్యంత సమన్వయంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులతో పాటు దేశవ్యాప్తంగా ప్రకటించిన వాటిని ఏపీలో ఏర్పాటు చేసుకునే అంశంపై ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసుకుంటూ అదనపు నిధులు సాధించాలని ముఖ్యమంత్రి సూచించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకునేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గత పాలకులు కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు ఖర్చు పెట్టకుండా పథకాలను నిర్వీర్యం చేశారని యుటిలిటీ సర్టిఫికెట్ల విషయంలో సమస్యలు తలెత్తాయన్నారు. ప్రభుత్వ శాఖలు అన్నీ వివిధ పథకాలకు కేటాయించిన నిధుల్ని ఖర్చు చేయగలిగితే అదనపు నిధుల్ని కూడా డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వచ్చే బడ్జెట్‌లోగా గరిష్ట కేటాయింపులు చేసుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు చేశారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన చాలెంజ్ విధానంలోనూ మరికొన్ని నిధులు సాధించుకునేలా కార్యాచరణ చేసుకోవాలన్నారు. కేంద్రం ప్రకటించిన రేర్ ఎర్త్ కారిడార్ ను శ్రీకాకుళం విజయనగరంవిశాఖ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటితో పాటు ఇతర విలువైన ఖనిజాలకు సంబంధించి వ్యాల్యూ చైన్ పరిశ్రమల్ని ఏర్పాటు చేసే ఆలోచన చేయాలన్నారు. ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులోనూ తీరప్రాంతంలో ఉన్న మూలపేట నుంచి దిగువన కృష్ణపట్నం వరకూ ప్రతిపాదన చేయాలన్నారు. కంటైనర్ మాన్యుఫాక్చరింగ్, ఎక్విప్మెంట్ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన ఏర్పాటు చేసుకునేలా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మెగాటెక్స్‌టైల్ పార్కును పలనాడు ప్రాంతంలోనూ, స్పోర్ట్ మాన్యుఫాక్చరింగ్ హబ్ తిరుపతిలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇండియా సెమికండక్టర్ మిషన్ 2.0 లో భాగంగా సెమీ కండక్టర్ డిజైన్ తదితర ప్రాజెక్టులను అమరావతిలో ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వీటితో పాటు రాజధాని ప్రాంతంలోని హెల్త్ సిటీలో బయోడిజైన్, మెడ్ టెక్ పార్క్, బయో ఫార్మా శక్తి మిషన్ లాంటి ఎకోసిస్టం వస్తుందన్నారు. మెడికల్ టూరిజం హీల్ ఇన్ ఏపీ అన్న విధానంలో అమరావతిలో ప్రాజెక్టులు >>2

# బంగ్లా ఎన్నికలు హింసాత్మకం

**ఢాకా, ఫిబ్రవరి 12:** ఏడాదిన్నర నుంచి తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ లో గురువారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ హింసాత్మక సంఘటనల మధ్య జరిగింది. ఈ 13వ సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహ్మద్ యూనస్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేశ రాజధాని ఢాకాలో ఆయన ఓటు వేశారు. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకుంటున్నారు. 2024 ఆగస్టులో విద్యార్థుల ఉద్యమంతో అవామీ లీగ్ నేతృత్వంలోని హసీనా ప్రభుత్వం పడిపోయింది. అప్పటి నుంచి బంగ్లాదేశ్ పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తూ వస్తున్నది. ఇప్పుడు ఈ ఎన్నికలతో ఢాకాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన 1,981 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించడంతో ఈసారి ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), షఫీకుర్ రెహమాన్ నేతృత్వంలోని జమాత్‌ఎఇస్లామీ కూటమి మధ్యే ఉంది. విద్యార్థుల ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా జమాతే కూటమిలో ఉంది. ఈ ఎన్నికలతోపాటు కీలక రాజ్యాంగ సంస్కరణలపైనా రిఫరెండం జరగనుంది. హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ లేకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ పార్టీ జమాత్‌ఎఇస్లామీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వస్తే మైనారిటీలపై దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని హిందువులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.దేశవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఖుల్నా జిల్లాలో జరిగిన ఘర్షణలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత మొహిబుజ్జమాన్ కోచీ మరణించారు.ఈ ఘటనలతో దేశంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఖుల్నాలోని అలియా మదరసా పోలింగ్ కేంద్రం వద్ద బీఎన్‌పీ, జమాత్ ఏఇస్లామీ మద్దతుదారుల మధ్య ఘర్షణజరిగింది. జమాత్‌తరపున ప్రచారం చేస్తున్న మదరసా ప్రిన్సిపాల్‌ను మొహిబుజ్జమాన్ కోచీ అడ్డుకునే ప్రయత్నంలో ఈ మరణం సంభవించింది.



ఢాకాలో ఓటు వేసిన మహ్మద్ యూనస్



# కార్మిక సమ్మె ప్రశాంతం

## నిలిచిన ఉత్పత్తిరంగ కార్యకలాపాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్‌లు, ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌తో వ్యవసాయ రంగానికి తీరని నష్టం వాటిల్లుతోందని, ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్‌శక్తులకే అనుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ దేశవ్యాప్తంగా 13 ట్రేడ్‌యూనియన్లు ఇచ్చిన నిరసన పిలుపు మేరకు ప్రశాంతంగా ముగిసింది. సుమారు 30 కోట్లమందికిపైగా రైతులు, కార్మికులు, ట్రేడ్‌యూనియన్ కార్యకర్తలు పాల్గొన్న ఈ సమ్మె ప్రశాంతంగానే >>2



సంక్రాంతి లక్కీ డ్రా కేసు

# అంబటికి 14 రోజులు రిమాండ్

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి లక్కీ డ్రా కేసులో మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా అంబటి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ. 200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.

# యువతకు ఉద్యోగాలే లక్ష్యం

## ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉపాధి కల్పన

## విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99పైసలకు భూములు

## ఎంఒయులు కుదుర్చుకొన్న కంపెనీలు చాలా ఉన్నాయి: మంత్రి లోకేష్

## పరిశ్రమలకు భూకేటాయింపులపై మండలిలో వాడివేడి చర్చ



గురువారం శాసనమండలిలో బొత్స సత్యనారాయణ, మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం. ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా సిద్ధమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పరిశ్రమలకు 99 పైసలకే భూ కేటాయింపులపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. వైసీపీ సభ్యుల ఆరోపణలకు మంత్రి ధీటుగా సమాధానం ఇచ్చారు. గత 20 నెలల కాలంలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలకు 99 పైసలకు కేటాయించిన భూముల వివరాలు, కుదుర్చుకున్న ఎంవోయూలు, పరిశ్రమల వారీగా భూముల కేటాయింపులు, ధరల వివరాలపై శాసన మండలిలో వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, డా.పండుల రవీంద్రబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5 కంపెనీలకు 99 పైసలకు భూమి కేటాయించాం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు 99 పైసలకే మొత్తం భూములు కేటాయించాం. ఏయే కంపెనీ ఎన్ని ఉద్యోగాలు కల్పించనుందో కూడా ప్రభుత్వ సమాధానంలో పొందుపర్చాం. కాగ్నిజెంట్ కు భూమి కేటాయించినప్పుడు 8వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. కానీ భూమిపూజ సమయంలో 25వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడం జరిగింది. ఎనర్జీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఐఎన్ఐ, ఐటీ అండ్ కామర్స్, ఏపీసీఆర్డీయే, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్, టెక్స్ టైల్, ఎడ్యుకేషన్, హెల్త్ పాలసీల కింద ఆయా సంస్థలకు భూములు కేటాయించడం జరిగింది. ఐదు కంపెనీలకు మాత్రమే 99 >>2

# విద్యాసంస్థల్లో వసతుల ప్రతిపాదనలు

## త్వరలో పనులు పూర్తి: మంత్రి లోకేశ్

**విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో వసతుల కోసం ఆర్థికశాఖ ప్రతిపాదనలు పంపామని త్వరలోనే పనులు పూర్తిచేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అక్కడి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. దీనికి మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ప్రతిపాదన లేదని ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తిరుపతిలో భక్తుల రాక పెరిగినందున తాగునీరు మరింత అవసరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు అందించే విషయాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. దీనికి మంత్రి నిమ్మల రామానాయుడు సమాధాన >>2

# విపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేరా?



## మీడియాతో కౌన్సిల్ విపక్షనేత బొత్స

**విజయవాడ,ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనమండలిలో ప్రతిపక్ష పార్టీ అడుగుతున్న ప్రశ్నలకు కనీస సమాధానం కూడా చెప్పలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు 99 పైసలకే భూములు కేటాయిస్తున్న అంశంపై శాసనమండలిలో ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కీలక అంశాలపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్పష్టత ఇవ్వకుండా తప్పించుకుంటోందని ఆరోపించారు.వైఎస్సార్ హయాంలోనే విశాఖపట్నంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశామని, అప్పుడే ఆదానీ డేటా సెంటర్ కూడా రాష్ట్రానికి వచ్చిందని గుర్తుచేశారు. అలాంటప్పుడు ఇప్పుడు కూటమి ప్రభుత్వం 99 పైసలకే భూములు ఇస్తామంటూ కంపెనీలకు లాలూచీ పడటం వెనుక ఏం ఉందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు వేల కోట్ల విలువైన భూములు కబ్జా చేశారన్న ఆరోపణలపై కూడా ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదని అన్నారు.ఒకవైపు 5 వేల కోట్ల భూములున్నాయన్న విమర్శలు వస్తే, గీతం సంస్థ మాత్రం వెయ్యి కోట్ల భూములే తమ వద్ద ఉన్నాయని చెబుతోందని, అసలు నిజం ఏంటో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. పెన్షన్ల అంశంపై ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి సమాధానం లేదని, గవర్నర్ ప్రసంగం సందర్భంగా అధికారపార్టీ సభ్యులు డప్పులు కొట్టడం తప్ప ప్రజల సమస్యలపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, వాస్తవంగా అందరికీ అందించిందా అని ప్రశ్నిస్తే మోనం వహించిందని >>2



# చట్టసభలపై చులకన వద్దు

## సభ్యులకు సూచించిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టసభలంటే చులకన భావం కలగకూడదని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభలో వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాలు రెండవ రోజుకు చేరుకున్నాయి.ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభ 5వ బడ్జెట్ సమావేశాల తొలిరోజే సభలో భావోద్వేగ వాతావరణం నెలకొనడం ఆవేదన కలిగించిందని స్పీకరు అన్నారు. నిన్న గవర్నర్ ప్రసంగం సమయంలో చోటుచేసుకున్న పరిణామాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సభ్యుల ప్రవర్తన వల్ల సభా గౌరవం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. యువతకు, విద్యార్థులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో లోకేష్ మాక్ అసెంబ్లీ అనే కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు లభించిందని, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం దీన్ని ప్రశంసించారని స్పీకర్ గుర్తుచేశారు. 'నిన్న గవర్నర్ >>2

# తెలుగు భాషపై ప్రత్యేక చర్చ జరపండి

## స్పీకర్‌కు వినతిపత్రం ఇచ్చిన అధికార భాషా సంఘం అధ్యక్షుడు

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఒక రోజంతా తెలుగు భాషా అమలు తెలుగు భాషాభివృద్ధి అనే అంశంపై సభ్యులందరితో ప్రత్యేక చర్చ నిర్వహించాలని మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షులు పి. త్రివిక్రమరావు (విక్రమ్‌పూల) కోరారు. గురువారం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో చింతకాయల అయ్యన్నపాత్రుడుని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రివిక్రమరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శాసనసభా పతిగా అయ్యన్నపాత్రుడు ఎంతో హుందగా, ప్రజాస్వామ్య విలువలతో సభను నడిపిస్తున్న తీరు ఒక నూతన అధ్యాయమని ప్రశంసించారు. తెలుగు భాషాభిమానిగా మాతృభాష పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ఒక రోజును తెలుగు భాషా అంశంపై చర్చకు కేటాయించి, సభలో సభ్యులు అందించే విలువైనసలహాలను పరిగణనలోకి తీసుకుని,వాటిని అమలుచేసేలా రాష్ట్ర >>2

13-2Pg2exHNWMJQE 2_13-2Pg2exHNWMJQE.qxd 13/Feb/26 12:13 AM Page 1





గురువారం తిరువూరు నియోజకవర్గ సమస్యలపై సిఎం చంద్రబాబుకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి

# అన్ని సమస్యలను పరిష్కరించుకుందాం: సిఎం చంద్రబాబు

## సిఎంను కలిసిన తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** సమస్యలపై మీ తపన,ఆందోళన నాకు తెలుసు, అన్నింటిని పరిష్కరించుకుందామని సీఎం చంద్రబాబు తిరువూరు ఎంఎల్ఏ కొలకపూడి శ్రీనివాసరావుతో వ్యాఖ్యానించారు.వివాదస్పద అంశాలకు దూరంగా ఉండండి. ఏ అంశమైన తన దృష్టికి తేవాలన్నారు. తిరువూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలు, అభివృద్ధి అవసరాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి, త్వరలోనే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుని కలిసి, తిరువూరు నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను వివరించారు.ముఖ్యంగా గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వంతెన నిర్మాణానికి అవసరమైన నిధుల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వంతెన నిర్మాణం పూర్తయితే తిరువూరు ప్రాంత ప్రజలకు రాకపోకలు మరింత సులభమవుతాయని, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, విద్యార్థుల ప్రయాణాలకు, అత్యవసర సేవలకు కీలకంగా మారుతుందని ఎమ్మెల్యే వివరించారు. అలాగే నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన అంశాలను కూడా సమగ్రంగా వివరించారు. ఈ అంశాలపై స్పందించిన ముఖ్యమంత్రి, తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వినగడప కట్టలేరు వంతెనతో పాటు ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు త్వరలో మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు దశలవారీగా పరిష్కరించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం భరోసా ఇచ్చారు.

# యువతకు ఉద్యోగాలే లక్ష్యం

>> పైసలకు భూములు కేటాయించాం.

**పరిశ్రమలకు భూములు కేటాయింపుపై వాడీవేడి చర్చ..**

విశాఖలో కోట్లాది రూపాయల విలువైన భూములను 99 పైసలకే ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, ఇతర వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారా లోకేష్ ధీటుగా సమాధానం ఇచ్చారు. మంత్రి స్పందిస్తూ.. హైదరాబాద్ లో రహేజా మైండ్ స్పేస్ కు ఆనాడు 97 ఎకరాలను చంద్రబాబు గారు కేటాయించారు. వారు 21 బిల్డింగ్ ల ద్వారా 10వేల మిలియన్ స్క్వేర్ ఫీట్ నిర్మాణం చేశారు. నేడు ఒక్క మైండ్ స్పేస్ లోనే ఐటీ రంగంలో లక్ష మంది పనిచేస్తున్నారు. అనేక ప్రముఖ కంపెనీలు అక్కడ కొలువుదీరాయి. రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు జీసీసీలకు అవసరమైన భవనాలు నిర్మించి అద్దెకు ఇవ్వడం జరుగుతుంది. వారు ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తారు. వారికి పారదర్శకంగా భూములు కేటాయించాం. బెంగళూరులో ఏఎన్ ఎస్ఆర్ సంస్థ నిర్మించిన జీసీసీ సెంటర్ ను నేను స్వయంగా చూశా. ఈ ఒక్క కంపెనీ 150 జీసీసీలను నిర్మించడం జరిగింది. సుమారు లక్షా 40వేల మంది ఆయా జీసీసీల్లో పనిచేస్తున్నారు. భూముల కేటాయింపు విషయంలో ప్రతి కంపెనీని అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, మంత్రుల సంఘం క్షుణ్ణంగా సమీక్షించడం జరుగుతుంది. అనంతరం కేబినెట్ ఆమోదంతో భూములను కేటా యించడం జరుగుతుందన్నారు.గతంలో 99 పైసలకే వేరే కంపెనీకి భూమి ఇచ్చారని ఆరోపించారు. నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేస్తే పారిపోయారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూములు ఇస్తున్నాం తప్పే ఆయారాం గయారాం కంపెనీలకు ఇచ్చేందుకు మేం సిద్ధంగా లేం. అంతకుముందు వైసీపీ సభ్యుల తీరును మంత్రి అచ్చెన్నాయుడు తప్పుబట్టారు. పరిశ్రమ లకు భూముల కేటాయింపులపై చర్చకు సిద్ధమని, ప్రశ్నోత్తరాలు గంటలోనే ముగించాలని నిర్ణయం తీసుకున్నందున బీఏసీలో చర్చించి ఈ అంశంపై లఘు చర్చ చేపట్టాలని చెప్పారు. ప్రశ్నకు సంబంధం లేనివి అడగడం వల్ల సమయం వృధా అవుతోందన్నారు.

**భూముల కేటాయింపు విషయంలో వైసీపీ పిల్‌పై కోర్టు మొట్టికాయలు వేసింది:** మంత్రి లోకేష్ సమాధానం సమాధానం పట్ల వైసీపీ సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. టీసీఎస్, కాగ్నిజెంట్, మదర్సన్, రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలకు భూములు ఇవ్వకూడదా అంటూ ప్రశ్నించారు. భూముల కేటాయింపుపై వైసీపీనే కోర్టులో పిల్ వేయించారని, కోర్టు కూడా మొట్టికాయలు వేసిందన్నారు. విశాఖలో రహేజా రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకే 27.1 ఎకరాలను ఎలా కేటాయిస్తారని వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి 99 పైసలకే భూములు కట్టబెట్టాలని ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ సభ్యుల ఆరోపణలను మంత్రి లోకేష్ ధీటుగా తిప్పికొట్టారు. తాము 5 కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావించినందున ఆధారాలు బయట పెట్టాలని, ఆరోపణలు చేసి బయటకు వెళ్లడం కాదని సవాల్ చేశారు. లేనిపక్షంలో తమ ప్రకటనను ఉపసంహరించుకోవాలని మంత్రి లోకేష్ పట్టుబట్టారు. ఉర్సాకు తాము ఎలాంటి భూములు కేటాయించలేదని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే పరిశ్రమలకు తక్కువ రేటుకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఉర్సా విషయంలో వైసీపీ సభ్యుల ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు.

**లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి:** వైసీపీ సభ్యుల అరుపులు నేపథ్యంలో మంత్రి లోకేష్ కలుగచేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు వినేందుకు ఓపిక పడితే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం. వైసీపీ సభ్యులు ఎందుకు అరుస్తున్నారు. సమాధానం చెప్పాలా, వద్దా? నేడు దేశానికి వస్తున్న రూ.100 పెట్టుబడుల్లో 25.3 రూపాయలు ఏపీకి వస్తున్నాయన్నారు. వైసీపీ సభ్యులు అరుపులపై స్పందిస్తూ.. లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి. టీం 11 తయారైంది. దీనిపైనా చర్చిద్దామా? 2014 నుంచి 2019 వరకు వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో చూశాం. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచింది. అమర్ రాజాను రాష్ట్రం నుంచి తరిమేశారు. ఆర్సెల్లార్ మిట్టల్ ఎక్కడికీ వెళ్లలేదు. వైసీపీ సభ్యులు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదు. 50వేల ఐటీ ఉద్యోగాలు రావడం వల్ల సిటీలో డైరెక్ట్ గా సుమారు బిలియన్ డాలర్లు ప్రతి ఏడాది ఆ ఎకానమీకి వస్తుంది. మా లక్ష్యం 5 లక్షల ఐటీ ఉద్యోగాలు. తద్వారా 10 బిలియన్ డాలర్ల మేర ఎకనామిక్ యాక్టివిటీస్ విశాఖలో జరగాలనేది మా లక్ష్యం.

**భూముల కేటాయింపుల విషయంలో కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు:**

వైసీపీ సభ్యులు ఎందుకు వాకౌట్ చేశారో అర్థం కాలేదు. బొత్స గారికి అదొక ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వచ్చి ఆ తలుపు నుంచి వెళతారు. మేం చాలా పారదర్శకంగా భూ కేటాయింపులు చేశాం. వారి దగ్గర నుంచి ఏం తీసుకున్నారని ఆరోపించారు. నన్ను విమర్శించాలనుకుంటే ఒక్క విషయంలో విమర్శించవచ్చు. నేను బాంబే హౌస్‌కు వెళ్లాను. టాటా సన్స్ ఛైర్మన్ చంద్ర గారు ఒకసారి కలవాలని చెప్పారు. నేను బాంబే హౌస్ కు వెళ్లాను. బాంబే హౌస్ లో కప్ టీ ఇచ్చారు. నన్ను విమర్శించాలనుకంటే కప్ టీ గురించి విమర్శించవచ్చు. నో ప్రాబ్లమ్. కాగ్నిజెంట్ విషయంలో కూడా నన్ను విమర్శించవచ్చు. వాళ్లు నాకు ఓ కప్ కేక్ ఇచ్చారు. దావోస్ లో వారి ఆఫీసుకు వెళ్లినప్పుడు ఆ రోజు నా పుట్టినరోజు. వారు మర్యాదపూర్వకంగా కప్ కేక్ లో క్యాండిల్ పెట్టి నాతో బ్లో చేయించారు. సింపుల్. అంతేగానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఉద్యోగాలు కల్పించాలనేది మా లక్ష్యం. మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు.

ఒక్క కియా పరిశ్రమ వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయి. క్లస్టర్ విధానంలో మేం ముందుకు వెళ్తున్నాం. మేం ప్రతి పరిశ్రమను గ్రౌండింగ్ చేస్తాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా నేను సిద్ధమని సవాల్ చేశారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని చెప్పారు.



గురువారం డిసిఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎమ్మెల్సీ నాగబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

# డిసిఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలకృష్ణ

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** డిప్యూటీ సీఎం పేషీలో పవన్‌కల్యాణ్‌తో భేటీ బాలకృష్ణ అయ్యారు.అసెంబ్లీలో నందమూరి బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ ఆత్మీయంగా పలుకరించుకున్నారు.తమ్ముడు పంచాయతీ రాజ్‌వ్య వస్థలో మంచి మార్పులు తెస్తున్నావంటూ పవన్ అభినందించారు. పవన్‌కల్యాణ్‌ను ఆయనను తన ఛాంబర్‌లోకి తీసుకొనివెళ్ళారు.ఈ సందర్భంగాబాలకృష్ణ హిందూపురం ప్రజాసమస్యలపై పవన్‌కల్యాణ్‌తో చర్చలు జరిపారు. హిందుపురంలో గ్రామీణాభివృద్ధికి సహకరించాలని పవన్‌ను కోరారు.తన నియోజ కవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పనులకు సంబంధించి పలు అంశాలను వివరిస్తూ వినతి పత్రం అందజేసారు.గిద్దలూరు నియోజకవర్గ సమస్యలపై పవన్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పవన్‌కల్యాణ్‌ను ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు కలుసుకున్నారు.

# మండలికి ఓకే

>> అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా దూరంగా ఉండాలని జగన్ నిర్ణయించారు. అయితే అసెంబ్లీలో మాత్రమే విపక్ష హోదా ఇవ్వడం లేదు కాబట్టి ఎప్పటిలాగే ఈసారి కూడా శాసనసభకు మాత్రమే ఎమ్మెల్యేలు హాజరుకాకూడదని నిర్ణయించారు. దీంతో మండలికి మాత్రం వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు హాజరుకాబోతున్నారు. ఈ సందర్భంగా శాసనమండలిలో గట్టిగా పోరాడాలని ఎమ్మెల్సీలకు జగన్ దిశానిర్దేశం చేశారు.కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయంగా మారిందని, ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడి చేస్తున్నారని జగన్ వారికి తెలిపారు. రూ.5 వేల కోట్ల విలువైన భూమి 54 ఎకరాలు గీతమ్ వర్సిటీకి ఇచ్చేశారని, ఏ ముఖ్యమంత్రీ తన సొంత బంధువులకు ఎవరూ ఇలా ఇచ్చుకోలేదన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కొత్త నినాదం వినిపిస్తోందని, అదే క్యాష్.. సూట్‌కేసు.. రాజేష్.. లోకేష్. అన్నారు. ఈ అంశాలన్నింటిపైనా సభలో గట్టిగా గొంతు వినిపించాలని ఎమ్మెల్సీలకు సూచించారు. కళ్లు మూసి తెరిచేలోపు మూడేళ్లు గడుస్తాయని, వచ్చేది మన ప్రభుత్వమేనన్నారు. ఇప్పుడు కష్టపడి పని చేస్తున్న వారందరికీ, తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పనితీరు ఆధారంగా మీకు మీ పదవులు తిరిగి వస్తాయి కూడా అన్నారు. అలాగే ఇంతకన్నా మంచి పదవులు కూడా దక్కే అవకాశం మీకు ఉందన్నారు.

# కేంద్రం నుంచి మరిన్ని నిధులు

>> చేపట్టాలన్నారు. హిందుపురంలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీని ప్రతిపాదించాలన్నారు. తిరుపతిని టూరిజం డెస్టినేషన్ కింద అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. కేంద్రం మంజూరు చేసిన 1000 ఎలక్ట్రిక్ బస్సులను సద్వినియోగం చేసుకుని మరిన్ని ఇబస్సులను సాధించేలా ప్రణాళిక చేయాలన్నారు. కొబ్బరి, కోకో, కాజు, కాఫీ పంటలకు ఎక్కువ నిధులను సాధించుకునే అవకాశం ఉందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులను కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు ఆస్కారం ఉందన్నారు.



గురువారం న్యూఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్‌కు వినతిపత్రం అందచేస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

# బెంగళూరు- కడప రైల్వే మార్గం ఏర్పాటు చేయండి

## కేంద్ర మంత్రిని కోరిన రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి

## సానుకూలంగా స్పందించిన అశ్విని వైష్ణవ్

## మంత్రి వెంట ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్

**విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** బెంగళూరు నుంచి కడప వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఢిల్లీలో సమావేశమై కోరారు. ఈ భేటీలో ఎంపి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షుడు సాయి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు–కడప రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే సాధ్యం అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఈ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

**కడప విమానాశ్రయం నుంచి విమాన సేవల విస్తరణపైనా:** కడప విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల సేవలను పెంపొందించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకుసాగుతున్న క్రమంలో, కడప విమానాశ్రయం ద్వారా కడప జిల్లాకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పిస్తే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, వ్యాపార, పర్యాటక రంగాల పురోగతికి దోహదపడుతుందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.

**ఎపిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం**

ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జాతీయ యువజన వ్యవహారాలు, ఎస్ఏఐ జాయింట్ సెక్రెటరీ వినీల్ కృష్ణతో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాయచోటి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన నిధులు, ఖేలో ఇండియా పథకం కింద ప్రతిపాదనల ఆమోదం, అలాగే ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రశ్రేణి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు నిధుల మంజూరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# వైకాంగ్రెస్ పాలనలో విశాఖకు ఒక్క కంపెనీ అయినా తెచ్చారా? : మంత్రి లోకేశ్

**విజయవాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిది:** రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదని వైకాపా కుట్రలు చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. కంపెనీల పేరిట రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పనంగా భూములను కట్టబెట్టారంటూ వైకాపా సభ్యులు చేసిన ఆరోపణలను లోకేశ్ తిప్పికొట్టారు. క్రెడిబులిటీ ఉన్న ఐదు సంస్థలకే 99 పైసల చొప్పున భూములు కేటాయించామని, ఆధారాలు లేకుండా విమర్శలు చేస్తే సహించబోమని లోకేశ్ చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల 18 నెలల్లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆర్సెలార్ మిత్తల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు రానుందని దీనికి భూములు కేటాయించామని మంత్రి లోకేశ్ అన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలకు భూములు ఇవ్వడం తప్పా? అని నిలదీశారు. వైకాపా పాలనలో విశాఖకు కనీసం ఒక్క కంపెనీ అయినా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు.

# కార్మిక సమ్మె ప్రశాంతం

>> ముగిసింది. ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌లో రైతులు, చిన్న వ్యాపారాలు, కార్మికుల హక్కులు, శ్రేయస్సును కాలరాచేదిగా ఉందని నాయకులు ఆరోపించారు. పార్లమెంటులో కూడా ప్రజాప్రతినిధులు, విపక్ష ఎంపిలు ప్రభుత్వం వెంటనే ఈ డీల్‌ను రద్దుచేసి ప్రధాని నరేంద్రమోడీ ట్రంప్‌నకు లొంగిపోయారంటూ నినాదాలుచేసారు. ఒకరోజు సమ్మెకారణంగా ఉత్పత్తిరంగ కార్యకలాపాలు కుంటుపడ్డాయి. మోడీ చేపట్టిన సంస్కరణల అజెండాను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఏడాదిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఎన్డీయే సర్కారు పనిచేస్తోందని ఆరోపించారు. రైతు నేత హన్నన్ మొల్లామాట్లాడుతూ ఇటీవల ట్రేడ్ ఒప్పందాలు న్యూజిలాండ్, యూరోప్, అమెరికాలతో జరిగిన ఒప్పందాలు భారత్‌లోని వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని, స్థానిక మార్కెట్లలోకి అమెరికా ఉత్పత్తులు ఇకపై వెల్లువలా వచ్చిపడతాయని, దీనివల్ల దేశీయ ఉత్పత్తులకు గండం ఏర్పడుతుందని ఆరోపించారు. అమెరికాతో జరిగిన ఒప్పందం వల్ల భారత్‌లోనిసన్నచిన్నకారు రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. అమెరికా కారుచౌకవనయవసాయ ఉత్పత్తుల భారత్‌లోకి డంప్‌చేస్తారని, వీటివల్ల చిన్న వ్యాపారాలు, చిరువ్యాపారులకు తీరనినష్టం ఏర్పడుటుందని ఆలిండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ నేత అమర్‌జీత్‌కౌర్ విమర్శించారు. దేశవ్యాప్తంగా కూడా కీలక రాష్ట్రాల్లో ఈసమ్మె కొనసాగింది. ఆటోకార్మికులు కూడా రోడ్లపైకి వచ్చి క్యాబ్‌లు, ఆటోలను నిలిపివేసారు. కొన్ని చోట్లప్రభుత్వ పరిధిలోని ఆర్టీసీ సర్వీసులు మధ్యాహ్నం వరకూ నిలిచిపోయాయి. తదనంతరం తగుమాత్రంలోనే సర్వీసులను నడపాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

# విద్యాసంస్థల్లో వసతుల ప్రతిపాదనలు

>> మిచ్చారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లు నీటిసరఫరాలను పెంచుతామని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గంలో లోచర్ల శివదావలస ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే బేబినాయన ప్రశ్నించగా వైకాపా హయాంలో టెంబర్లు రద్దు చేసి పనులు నిలిపివేశారని మంత్రి రామానాయుడు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగుల బదిలీపై పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ప్రశ్నించారు. దీనికి మంత్రి సంధ్యారాణి సమాధానం చెప్పారు. వైకాపా ప్రభుత్వం హయాంలో కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోనందువల్ల సమస్యలు వచ్చాయన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# భారత ఆర్థిక వ్యవస్థకు బడ్జెట్ ఊతం

## రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** పెరుగుతున్న వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం కలిసి సాధించబడుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు 2026-27 కేంద్ర బడ్జెట్ ఊతమిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గురువారం రాజ్యసభలో విత్త మంత్రి మాట్లాడుతూ, ఇదొక 'గోల్డిలాక్స్ మూమెంట్' ఇది అవకాశం కాదు, నిరంతర ప్రయత్నం, జాగ్రత్తగా ప్రణాళిక, సకాలంలో విధాన చర్య ఫలితంగా ఉందని అన్నారు. "జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, భారతదేశ వాస్తవ జిడిపి వృద్ధి 2025-26 సంవత్సరానికి 7.4 శాతంగా అంచనా వేయబడింది, అయితే నామమాత్రపు వృద్ధి దాదాపు 8 శాతంగా అంచనా వేయబడింది" అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. "అదే సమయంలో, వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం దాదాపు 2 శాతానికి తగ్గిపోయింది. నియంత్రణలో ఉంది" అని ఆమె పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలో ఒక ప్రధాన సూత్రంగా మిగిలిపోయిందని ఆర్థిక మంత్రి సీతారామన్ పునరుద్ఘాటించారు. "బడ్జెట్ దేశీయ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించడం, ఇంధన భద్రతను నిర్ధారించడంపై దృష్టి పెడుతుంది, అదే సమయంలో పౌరులు వారి స్వంత జీవితాలలో స్వావలంబన చెందడానికి కూడా సహాయపడుతుంది" అని ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. "జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడం, ఉపాధిని సృష్టించడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, గృహ కొనుగోలు శక్తిని పెంచడం లక్ష్యంగా ఉన్న చర్యలు ఈ విధానంలో భాగం" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. మానవ మూలధనాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలను వివరిస్తూ, రాబోయే ఐదు సంవత్సరాలలో ఒక లక్ష అనుబంధ ఆరోగ్య నిపుణులను సృష్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆర్థిక మంత్రి అన్నారు. "ప్రస్తుత సంవత్సరంలో దీని కోసం రూ.1,000 కోట్లు వెచ్చిస్తాం. ఈ చర్య ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తుంది. వైద్య పర్యాటక వృద్ధికి తోడ్పడుతుంది" అని మంత్రి పేర్కొన్నారు. ఉన్నత స్థాయి విద్య నుండి ఉపాధి, సంస్థ స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. 2047 నాటికి ప్రపంచ సేవల మార్కెట్‌లో 10 శాతం వాటాను ఆక్రమించాలనే లక్ష్యంతో, సేవల రంగానికి భారతదేశ యువతను సిద్ధం చేయడంపై ఈ కమిటీ దృష్టి సారిస్తుందని వివరించారు.

# ప్రత్యేక చర్చ జరపండి

>> ప్రభుత్వానికి నివేదించాలని ఆయన స్పీకర్‌ను కోరారు. అదేవిధంగా, మీ నేతృత్వంలో సాగే సభా కార్యక్రమాల్లో ప్రతి సభ్యుడూ తప్పనిసరిగా తెలుగు మాట్లాడేలా స్థిర నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# చట్టసభలపై చులకన వద్దు

>> ప్రసంగిస్తున్నప్పుడు సభలో జరిగిన దృశ్యాలు నన్ను కలచివేశాయి. సభ్యులు నినాదాలు చేస్తూ, కాగితాలు చింపి వేయడం వంటి చర్యలు అత్యంత బాధాకరం' అని స్పీకర్ అన్నారు. వేలాది మంది పోటీ పడితే కేవలం 175 మందికి మాత్రమే దక్కే అరుదైన గౌరవం ఈ సభలో సభ్యులుగా ఉండటం అని, ఆ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200లకు పైగా విద్యాసంస్థల నుండి విద్యార్థులు అసెంబ్లీని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారని స్పీకర్ తెలిపారు. "మనం చేసే పనులను చూసి ఆ పసిపిల్లలు ఏం నేర్చుకుంటారు? చట్టసభలంటే వారికి చులకన భావం ఏర్పడితే దాన్ని మనం మళ్ళీ మార్చలేము" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సభా గౌరవాన్ని పెంచలేకపోయినా పర్వాలేదు కానీ, దిగజార్చే హక్కు మాత్రం ఎవరికీ లేదని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజలు మన ప్రతి కదలికను గమనిస్తున్నారని, సభ్యులందరూ ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరుతూ స్పీకర్ తన ప్రసంగాన్ని ముగించారు.

## వారం - వర్జ్యం

13-02-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
ఏకాదశి మ.2.23
మూల సా.4.09
వర్జ్యం : రా.2.35-4.19
దు.ఉ.8.54-9.40
2) మ.12.45-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ విషయములో ఇతరుల జోక్యము అధికమౌతుంది. పోటీ పరీక్షలలో పాల్గొంటారు.ప్రతిష్టను నిలబెట్టుకుంటారు.

**వృషభం:** ఓర్పు బాగా అవసరము. విదేశీ వస్తువులు ఆకర్షణల నుండి బయట పడుటకు జాగ్రత్తను వహించండి.

**మిథునం:** చికాకులు ఉన్నప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించగలుగుతారు. ఋణయత్నము ఫలిస్తుంది. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** అస్తవ్యస్తంగా ఉన్న చాలా వ్యవహారాలను మీ ప్రతిభతో అనుకూలంగా మలచుకుంటారు. వస్త్రలాభం.

**సింహం:** విలువైన పత్రములు డాక్యుమెంట్స్ మొదలైన వాటితో జాగ్రత్త అవసరం. విదేశీయానయత్నాలు ఫలిస్తాయి.

**కన్య:** విలువైన వస్తువుల కొనుగోలు విషయాలలో తగిన శ్రద్ధ చూపవడం చెప్పదగినది. శుభవార్తలు అందుకుంటారు.

**తుల:** మిమ్మలను మోసం చేసే ప్రయత్నాలు ఫలించవు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** నేర్పుతో ముఖ్యులవద్ద గుర్తింపు పొందుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. వస్తు కొనుగోలు.

**ధనుస్సు:** కొంతమేర జాగ్రత్తలు అవసరం. భాగస్వామ్య వ్యాపారాలలో జాగ్రత్తలు అవసరం. సోదరుల కలయిక.

**మకరం:** పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కోర్టుకేసుల నుండి బయటపడతారు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** ఆత్మీయవర్గానికి ధన సహాయం చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మీనం:** విధి నిర్వహణలో పై అధికారుల ప్రశంసలు అందుకుంటారు. వాహనాల విషయంలో జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# విపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేరా?

>> చెప్పారు. తల్లికి వందనం డబ్బులు పూర్తిగా తల్లుల ఖాతాల్లో జమ కాలేదని, చాలా మంది ఖాతాల్లో ఏడెనిమిది వేల రూపాయలే వచ్చాయని పేర్కొన్నారు. తాము చెప్పిన విషయాలు అవాస్తవమని ప్రభుత్వం నిరూపిస్తే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు. 15 సంవత్సరాల పాటు తాను కూడా మంత్రిగా పనిచేశానని, వివరాలు లేకుండా ఏ అంశాన్నీ ప్రతిపక్షం ప్రశ్నించదని అన్నారు. ప్రభుత్వం కావాలంటే అధికారులతో విచారణ చేయించుకుని తాము చెప్పింది అసత్యమని నిరూపించాలని సవాల్ విసిరారు.

ఈ సమావేశాలు ముగిసేలోపు తల్లికి వందనం బకాయిలను పూర్తిగా చెల్లించాలని, ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలను కనీసం పరిగణలోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. కొత్తగా ఒక్క వితంతు పెన్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని, గతంలో వైసిపి పాలనలో ఏడాదికి రెండు సార్లు కొత్త పెన్షన్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. శాసనమండలిలో తాను లేవనెత్తిన ప్రతి అంశానికి కట్టుబడి ఉన్నానని ఆయన సమాధానం చెప్పారు.

13-02Pg3exHMNWJQERT 3_13-02Pg3exHMNWJQERT.qxd 12/Feb/26 11:57 PM Page 1



### సార్వత్రిక సమ్మెతో

# తిరుపతిలో కదం తొక్కిన కార్మికులు




**తిరుపతి,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా తిరుపతిలో కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. ఈ సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు గురువారం ఉదయం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడనుండి రైల్వే స్టేషన్ ,కర్నాలవీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు మీదుగా పాత మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మిక చట్టాలను రక్షి ంచాలని... నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని.. మోడీ నిరంకుశ విధానాలపై కార్మికులు నినదించారు. బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రకాష్ బాబు మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ పాలకులు ఆమోదించిన కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ కాలరాస్తున్నారని విమర్శించారు. 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోర్టులుగా మార్చడం దారుణం అన్నారు. మోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నేడు సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కార్మికులు రోడ్లపైకి వచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే దేశంలో మొట్టమొదటిసారిగా పాండిచ్చేరిలో కార్మిక నాయకుడు సుబ్బయ్య నేతృత్వంలో ఎనిమిది గంటల పని విధానానికి పోరాడి సాధించారని అన్నారు.

నేడు రైతాంగం దివాలా తీస్తోందని రైతులు కార్మికులను కేంద్రం కట్టు బానిసలుగా చూస్తోందని విమర్శించారు. రాజ్యాం గాన్ని అంచలంచలుగా తగ్గించి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో గాంధీని తొలగించారని, స్వాతంత్ర సమరయోధుల పేర్లు కనబడకుండా చేసి ఘాడ్సే లాంటి వారిని తెర ముందుకు తీసుకువస్తున్నారని విమర్శించారు. డేరా బాబా లాంటివారు అరెస్టు అయితే వెంటనే బెయిల్ మంజూరు అవుతుందని..

వరవరరావు లాంటివారు అరెస్టు అయితే బెయిల్ రాదని ఎద్దేవా చేశారు. సిఐటి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికృష్ణ ,,ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ , మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ,ఏఐటీయూసీ నాయకులు ఎన్ డి. రవి, శివ, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, సిఐటియు నాయకులు జయచంద్ర, వేణుగోపాల్, ఐఎఫ్టియు నాయకులు వెంకటరత్నం, ఐ ఎన్ టి యు సి నాయకులు రత్నకుమార్, వైయస్సార్సిపి టి యు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేరిట బెదరింపు లేఖలపై కేసు నమోదు

**గుంటూరు ఫిబ్రవరి 12 ప్రభాత వార్త ప్రతినిధి :** ఏపీలో నలుగురు మంత్రులకు మావోయిస్టుల పేరిట బెదిరింపు లేఖలు రావడం తీవ్ర కలకలం రేపింది. మంత్రులు కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్‌కు ఈ లేఖలు వచ్చాయి.మీ జీవితం ప్రమాదంలో వుందని, మీతోపాటు మీ కుటుంబ సభ్యుల పైన త్వరలోనే దాడి జరుగుతుందని, 7981777325 ఫోన్ నంబర్ ఈ లేఖల్లో ఉంది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం చిరునామాతో లేఖలు పంపారు. ఈ అంశంపై ఏపీ అసెంబ్లీ లాబీ వద్ద బుధవారం మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ.. తనతోపాటు ముగ్గురు మంత్రులకు పోస్టు ద్వారా లేఖలు వచ్చినట్టు చెప్పారు. మావోయిస్టుల పేరిట వచ్చిన లేఖలు చూసి కుటుంబసభ్యులు ఆందోళన చెందినట్టు వెల్లడించారు. వ్యక్తిగతంగా, శాఖపరంగా తాము ఎలాంటి తప్పులు చేయలేదని పేర్కొన్నారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. అయితే ఈ బెదిరింపు లేఖపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో మంత్రి దుర్గేశ్ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు పై తుళ్ళూరు పోలీసులు 37/2026 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో మంత్రులకు బెదిరింపు లేఖలు రావడం చర్చనీయాంశమైంది.

# శ్రీశైల మల్లన్న చెంత భక్త జనసందోహం

# నల్లమల్ల నడకదారులన్నీ శివ నామస్మరణం



నడక దారుల్లో వస్తున్న భక్తులు

**శ్రీశైలంప్రాజెక్టు,ఫిబ్రవరి12,ప్రభాతవార్త** శివ నామస్మరణం నల్లమల్ల నడక మార్గం అంతా మారుమ్రోగుతుంది. ఓం నమ:శివయా, ఓం నమ:శివయా అంటూ జనసంద్రం శ్రీశైలం మల్లన్న చెంతకు తండోపా తండాలుగా భక్త జనసందోహం తరలివస్తున్నారు. భక్తి పారవశ్యంతో అలరారుతోంది. శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను కనువిందు చేసే విధంగా పుష్పాలతో ముస్తాబు చేసారు. చికటి పడితే మల్లన్న క్షేత్రం విధ్యుత్ కాంతులతో మిరుమిట్లు గోలుపుతుంది. నల్లమల్ల నడకదారులన్ని శివ నామస్మరణంతో ప్రజ్వరిల్లుతున్నాయి. ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. హార హార మహాదేవా శంభో శంకరా అన్న నినాదంతో పరుగుపరుగున క్షేత్రంకు చేరుకుంటున్నారు. నడక దారి మార్గలన్ని భక్తుల కోలహాలంతో కనువిందు చేస్తున్నాయి. ఈ నడక దారులన్ని దాతలచే అన్నప్రసాద వితరణ జరుగుతుంటే, దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన వైద్యశిబిరాలు, ఉచిత మంచీనీరు, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసింది. మండుటేండను సైతం లెక్కచేయకుండా వెంకటాపురం నుండి నట్టడవి మొట్ల మార్గన మల్లన్నను మనస్సులో స్మరించుకుంటూ కైలాసద్వారం వద్దకు చేరుకుంటున్నారు. అక్కడికి చేరుకున్న భక్తులకు సేద తీరేందుకు చలువ పందిళ్లు, అన్నప్రసాద వితరణ, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, అత్యవసర సమయాలకు అంబులేన్స్‌లు తదితర వంటివి ఏర్పాట్లు గావించారు. ఈ నడక దారులన్ని చిన్న, పెద్ద, ముసలి, ముతక అనే తేడా లేకుండా మల్లన్న నీ దర్శన భాగ్యం కోరకు తరలివస్తున్నామని నీ చెంతకు చేరుకోగానే మమ్మల్ని పిల్లపాపాలతో చల్లగా దీవించుస్వామి అంటూ వేడుకుంటున్నారు. మల్లన్న వద్దకు చేరుకున్న భక్తాదులకు సలక సౌకర్యాలను ఏర్పాటు చేసి అనువైన దర్శన భాగ్యం కల్పించడం దేవస్థానం తీసుకోంది. శ్రీశైలక్షేత్రం నలుచేరుగుల భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి. శివ మాలలో వచ్చిన స్వాములు శివదీక్ష శిబిరాలకు చేరుకోని ఇరుముడిని సమర్పిస్తున్నారు. శివస్వాములకు తగిన సమయంలో దర్శనం కల్పిస్తుండడంతో వారు పునితులౌవుతున్నారు. ఈక్రమంలోనే మరికొందరు భక్తులు పాతళగంగకు చేరుకోని పుణ్యస్నానాలు అచరించి తమ మ్రొక్కులను తీర్చుకుంటున్నారు. దర్శనం క్యూలైన్లన్ని భక్త సంద్రంతో కిటకిటాలాడు తున్నాయి.



# దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయొద్దు: సిపిఐ నారాయణ

**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీజరిగిన మాట వాస్తవమేనని, ఆ దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ జాతీయనేత డాక్టర్ కె.నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పాపంలో తప్పుచేసిన అధికారులను, పాత ఇఒను వదిలేయకూడదని చెప్పారు. రాజకీయ లబ్ధికోసమే అధికార, ప్రతిపక్షపార్టీలు లడ్డూ విషయంపై రాద్దాంతం చేస్తున్నాయని, దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజకీయ లబ్ధికోసం కోట్లాదిమంది భక్తులను మనోవేదనకు గురి చేయొద్దని ఆయన కోరారు. ఇందుకు సంబంధించి ఈ కేసులో సుప్రీంకోర్టు విచారణ చేస్తోందని, ఈ సమయంలో రాజకీయ నేతలు లడ్డూపై మాట్లాడటం ఆపేయాలని సూచించారు. ఎవరిరాజకీయాల కోసం వాళ్ళు కావాలంటే కొట్టుకోండని, అయితే దేవుడిని మాత్రం లాగొద్దని ,లడ్డూ వివాదంపై అనవసర చర్చ ఆపి భక్తుల మనోభావాలను కాపాడండి అని నారాయణ ఘాటుగా స్పందించారు. కల్తీ ప్రసాదంతో సిఎం చంద్రబాబునాయుడు స్వామి ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గత ఐదేళ్ళలో రసాయనాలతో తయారైన కల్తీ నెయ్యితో లడ్డూల తయారుచేయించారని ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రసవత్తరంగా సాగిన ప్రశ్నోత్తరాలు

## పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటి ప్రతిపాదన లేదన్న మంత్రి లోకేష్

**విజయవాడ.ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం రెండో రోజు ప్రారంభమయ్యాయి. సభలో పలు ఆసక్తికర అంశాలు చోటు చేసుకున్నాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ కార్యక్రమం రసవత్తరంగా సాగింది. పుట్టపర్తిలో ఐఐటీ ఏర్పాటుపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రశ్న లేవనెత్తారు. ఒంగోలు ఐఐటీ తాత్కాలిక క్యాంపస్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇడుపులపాయ, ఒంగోలు మధ్య విద్యార్థులు తిరగాల్సి వస్తోందని, ఇది తీవ్ర ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. పుట్టపర్తిలో ఐఐటీ ఏర్పాటు ప్రతిపాదన లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో అక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సభలో ప్రస్తావించారు. సరైన అనుమతులు లేకుండానే కొందరు కాలేజీలు పెడుతున్నారని ఎమ్మెల్యే బత్తుల ఆరోపించారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధామిస్తూ.. అక్రమాలపై వివరాలు తెలియజేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏయే కాలేజీలకు అనుమతులు ఇచ్చారనే దానిపై తన దృష్టికి తీసుకురావాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌పై తప్పుడు కుల ధ్రువీకరణ ఆరోపణలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. పుత్తూరు పురపాలక సంస్థ ఛైర్మన్‌ను ఇప్పటికే తొలగించినట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భాను ప్రకాశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో అదరికీ తెలుసని.. తప్పుడు సర్టిఫికెట్లతో పదవులు పొందారని తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక వ్యవస్థలను కూడా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రిజర్వ్ స్థానాలను కూడా గత ప్రభుత్వం కాజేసిందని ఆరోపిస్తూ.. దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారా అని ఎమ్మెల్యే భాను ప్రకాశ్ ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారాయణ సమాధానం ఇస్తూ.. జీవో 135లో అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. సభ్యులు అడిగినట్లు అదనపు చర్యలు ఏమి తీసుకోవచ్చో పరిశీలిస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని పాయకాపురం ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ ఇంటర్మీడియట్ కాలేజీని డిగ్రీ కాలేజీ వరకు అప్ గ్రేడ్ చేయాలి. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే మొదటిసారి ప్రవేశ పెట్టడం జరిగింది. సుమారు రూ.15కోట్ల వ్యయంతో అదనపు బిల్డింగ్ నిర్మాణం ఖర్చు చేయడం ద్వారా డిగ్రీ కాలేజి పూర్తి అవుతుంది. ఎందుకంటే అనేకమంది పేదలు, ఆటో కార్మికులు, తాపీ కూలీలు ఈ నియోజవర్గంలో ఉన్నారు. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేదు. ఆడపిల్లలు డిగ్రీ కాలేజీలో చదువుకోసం నగరంలోని వేరొక ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తున్నది. చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇంటర్మీడియట్ కాలేజీ విద్యార్థులు ఆదుకోవడానికి, కాలేజీ చుట్టూతా ప్రహరీ గోడ, మిగిలిన వాటి నిమిత్తం మంత్రి లోకేష్ 20లక్షలు కేటాయించగా, సంవత్సరం పొడువునా ఆ గోడ నిర్మాణం జరిగి ఇటీవల పూర్తి చేశారు. ప్రక్కన బీసీ సంక్షేమ హాస్టల్ ఉంది. హాస్టల్కు కూడా నిధులు కేటాయించాలి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో తీవ్రంగా నెలకొన్న సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ శాసనసభలో జీరో అవర్ సందర్భంగా గళం విప్పారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ పరిధిలోని వత్సవాయి, వీర్లపాడు, నందిగామ మండలాలకు చెందిన వేలాది ఎకరాల భూములు పూర్తిగా ఈ కాల్వపైనే ఆధారపడి ఉన్నాయని, అయితే అవసరమైన స్థాయిలో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ సామర్థ్యం 1350 క్యూసెక్కులు కాగా,

ప్రస్తుతం కేవలం 900 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో బోనకల్లు మం డలం దాటిన తర్వాత కాల్వలో నీరు ముందుకు వెళ్లడం లేదని, వత్సవాయి మండలానికి 30 క్యూసెక్కులకు మించి నీరు రావడం లేదని తెలిపారు.

# టిడిపి ఎమ్మెల్యే కొలకపూడికి పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు

**విజయవాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌తో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశమయ్యారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో ఆయన మాట్లాడారు. కొలికపూడి వ్యవహార శైలిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలుగా ఆయనకు పల్లా తీవ్ర హెచ్చరికలు చేశారు. పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తించి ప్రవర్తించాలని హితవు పలికారు. పార్టీ క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేందుకు సీఎం సిద్ధంగా లేరన్నారు. ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తే పార్టీ ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వంచే పట్టువస్త్రాల సమర్పణ



**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి 12, ప్రభాత వార్త.** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం నాడు సాయంకాలం రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి శ్రీస్వామిఅమ్మ వార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సమర్పణ కార్యక్రమంలో దేవదాయ కమిషనరు, కె. రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.ఎస్. చంద్రశేఖర ఆజాద్ , ధర్మకర్తల అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు వారు పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమములో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద వస్త్ర సమర్పణ సంకల్పం, వస్త్రాలకు పూజాదికాలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రి మరియు స్థానిక శాసనసభ్యుల మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి ప్రదక్షిణ పూర్వకంగా స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కాగా ఎంతో చారిత్రక ప్రసిద్ధి పొందిన శ్రీశైలక్షేత్రంలో ఎందరో చక్రవర్తులు, రాజులు, రాజకుటుంబీకులు మొదలైన వారు ఆయా ఉత్సవ సందర్భాలలో శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించేవారని ప్రతీతి. ఈ సంప్రదాయాన్ని అనుసరించే రాష్ట్ర ప్రభుత్వం ఏటా మహాశివరాత్రి మరియు దసరా మహోత్సవాలలోనూ శ్రీ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను అనవాయితీగా సమర్పిస్తోంది.

# ఎమ్మెల్యేలతో మంత్రి లోకేష్ డిన్నర్ మీటింగ్‌లు

**విజయవాడ,ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీ బలోపేతం విషయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ వినూత్న పంథా ఎంచుకున్నారు. పార్టీని గ్రౌండ్ లెవల్ నుంచి బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ..ఎమ్మెల్యేలు, క్యాడర్‌కు మరింత దగ్గరయ్యేలా డిన్నర్ మీటింగ్స్‌కు శ్రీకారం చుట్టారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా..ఆత్మీయ వాతావరణంలో ప్రతి రోజూ ఏడుగురు ఎమ్మెల్యేలతో భోజనం చేస్తూ..వారి మనోగతాలు తెలుసుకుంటున్నారు. ఈ నిర్ణయం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సమావేశాల్లో ప్రధానంగా నియోజకవర్గాల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యేలను ఆరా తీస్తున్నారు నారా లోకేష్. జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూ, వారి వ్యక్తిగత యోగక్షేమాలతో పాటు స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్య ఏదైనా ఉంటే వెంటనే పరిష్కరించేలా అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. కేవలం ఆఫీసు గోడల మధ్య కాకుండా, డైనింగ్ టేబుల్‌పై సాగే చర్చల వల్ల ఎమ్మెల్యేలతో ఎమోషనల్ బాండింగ్ ఏర్పడుతుందని లోకేష్ భావిస్తున్నారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిపై లోకేష్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. అనుభవం లేక కొంతమంది చేస్తున్న చిన్నపాటి పొరపాట్లను సరిదిద్దేందుకు ఈ వేదికను వాడుకుంటున్నారు. వార్నింగ్, గదమాయింపులు కాకుండా.. ఓ ఫ్రెండ్‌లా, ఓ మెంటార్‌లా పాలనపై అవగాహన కల్పిస్తున్నారు. హైకమాండ్‌కు, యువ ఎమ్మెల్యేలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడం ద్వారా పార్టీకి క్రమశిక్షణ కలిగిన నాయకత్వాన్ని అందించడమే ఈ సమావేశాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. టెక్నాలజీని వాడుకుంటూ డాష్ బోర్డుల ద్వారా డెవలప్‌మెంట్‌ను పర్యవేక్షించడమే కాదు.. క్షేత్రస్థాయిలో మనుషులతో మమేకమవ్వడం తన శైలి అని లోకేష్ నిరూపిస్తున్నారు. సీనియర్లకు సముచిత గౌరవం ఇస్తూనే, యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్న తీరు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని కలిగిస్తోంది. ఈ డిన్నర్ మీటింగ్స్ ద్వారా ఆయన వేస్తున్న అడుగులు అటు పార్టీ ఐక్యతను, ఇటు ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# తిరుమల సమాచారం

## తిరుమలనుండి శ్రీనివాసమంగాపురానికి లక్ష్మీకాసులహారం



**తిరుమల, ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామిబ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి గరుడ సేవలో స్వామివారికి అలంకరించేందుకు లక్ష్మీకాసుల హారం ఊరేగింపు జరిగింది. గురువారం మధ్యాహ్నం శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభాయాత్ర టిటిడి పరిపాలనా భవనం వద్ద నుండి వైభవంగా ప్రారంభమైంది. టిటిడి అదనపు ఇఒ తలపై కాసులహారం పెట్టుకుని తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, టిటిడి జెఇఒలు వి. వీరబ్రహ్మం, డాక్టర్ ఎ. శరత్, సివిఎస్ఒ కే. వి. మురళీకృష్ణ పాల్గొన్నారు. టిటిడి స్థానిక ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న క్రమంలో తిరుమల శ్రీవారి ఆలయం నుంచి గరుడసేవకుకల్యాణ వేంకటేశ్వరస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన లక్ష్మీకాసుల హారాన్ని అలంకరించేందుకు ఊరేగింపుగా తీసుకెళుతున్నట్టు తెలిపారు. టిటిడి నుండి దాదాపు 6.40 కోట్లు రూపాయలు విలువగల నాలుగుకిలోల డైమండ్ మోపుగల ఆరు పేటల బంగారు యజ్ఞోపవీతము స్వామి వారికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, పనబాక లక్ష్మీ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఇఒవరలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అధికార నందివాహనంపై సోమస్కందుడు



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి అధికార నందివాహనంపై కపిలేశ్వరుడు భక్తులకు అభయమిచ్చాడు. ఆద్యంత రహితుడైన శివదేవుడు ఐశ్వర్యసూచికమైన నందిని అధిష్టించినపుడు దర్శనం చేసుకోవడం భక్తులకు పుణ్యం. ఆలయ మాఢ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటలు ముందు వాహనసేవ జరిగింది. గురువారం ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తి బంగారుతిరుచ్చిపై కామాక్షి అమ్మవారితో కలసి ఊరేగారు.

## ఎస్వీగోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌ల్లో ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు విరాళం అందించారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ కుమారుడు కుప్పాల నీలేశ్ కుమార్ 10,00,116 రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులకు ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బొజ్జిరెడ్డి



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి గురువారం రాత్రి తిరుమలకు వచ్చారు. ఆయనకు వసతికల్పన విభాగం ఒఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికారు. నేటి ఉదయం దేవుని దర్శనం చేసుకోనున్నారు.

## తిరుమలలో తెలంగాణ డిసిఎం భట్టి

### - నేటి ఉదయం శ్రీవారి దర్శనం



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిధిగృహం వద్ద వసతికల్పన విభాగం ఒఎస్‌డి సత్రానాయక్ పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బసచేస్తున్న భట్టి నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. తెలంగాణాలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాలని, తెలంగాణ ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని కాంగ్రెస్ ప్రభుత్వానికి కలగజేయాలని వేడుకోనున్నారు.

## శ్రీవారి ఆశీస్సులు కోరిన తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామి



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తమిళనాట త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకునేందుకు గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని వకుళమాత విశ్రాంతి భవనం వద్ద పద్మావతి వసతికల్పన విభాగం అధికారులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి ఇక్కడే బసచేసి నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

## స్వామి ఆశీస్సులందుకున్న సినీదర్శకుడు రాఘవేంద్రరావు



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందు కున్నట్లు సినీదర్శకుడు రాఘవేంద్రరావు తెలిపారు. ఇష్టదైవం దర్శనం చేసుకోవడం మనసు ఆనందంగా ఉందన్నారు. గురువారం ఉదయం ఆయన అనుచరులతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### కాలంచెల్లిన భవనాలపై నిర్లక్ష్యమేనా! - టెండర్ స్థాయికి చేరినా జాప్యమే



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో పాతబడిన, కాలంచెల్లిచన వసతి గృహల భవనాలపై టిటిడి నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎందుకనే విమర్శలు భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే తిరుమలలో పురాతన కాటేజీలను గుర్తించిన టిటిడి అధికారులు వాటి స్థానంలో కొత్తవి అధునాతనంగా నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే అప్పట్లో టిటిడి బోర్డు లేకపోవడంతో అధికారులు దాతల సహకారంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని భావించారు. మళ్ళీ ఆ ప్రతిపాదనలు ఆచరణకు రాలేదు. వసతికల్పన విభాగం అధికారులు కూడా తిరుమలలో భక్తులకు ప్రయోజనం లేని కాటేజీలను గుర్తించారు. భక్తుల నుండి వచ్చిన ఫిర్యాదులతో సుదర్శన్ ,గోవర్ధన్, కల్యాణి, సిటైప్ క్వార్టర్స్, పద్మావతిప్రాంతంలోని కొన్ని విశ్రాంతి గృహల స్థానంలో అధునాతనంగా నిర్మించాలని నిర్ణయించారు.

వార్త

ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించి చూడాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి.

-అబ్రహం లింకన్

# అవినీతిపై అదుపేది?

ఆయా ప్రపంచ దేశాల అవినీతిని లెక్కగట్టిహెచ్చరించే ఏకైక సంస్థ ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ ఈ ఏడాది కూడా తన నివేదికను విడుదల చేసింది. అందులో మన దేశానిది 91వ స్థానం వచ్చింది. కానీ తాజా లెక్కలలో 91ర్యాంకులో ఉన్నాం. గత ఏడాది నివేదికతో పోల్చి చూసుకుంటే ఈసారి కాస్త మెరుగైన పరిస్థితి కనపడుతోంది. 2025 సంవత్సరానికి గాను భారత్ మాల్దీవులు, మొరాకో, ట్యునీషియాతో సమాన స్థాయిలో 39 స్కోరుతో 91వ స్థానానికి ఎదిగింది. గత ఏడాదితో పోలిస్తే 1పాయింట్ మెరుగు పడిందన్నమాట.ప్రపంచవ్యాప్తంగా వీటిపరిస్థితి చూస్తే ఆందోళనకరమే. అవినీతికి సంబంధించి ప్రపంచ దేశాల సగటు స్కోరు దశాబ్ద కాలంలో 42కి పడిపోయింది. మూడింట రెండు వంతుల స్కోర్ 50లోపలే ఉంది. ఇదే మరింత ఆందోళనకర పరిస్థితులను సూచిస్తోంది. లంచాలు తీసుకోవడం, అంతే నేరమైన విషయాన్నిభారత దేశ చట్టాలు ఎంత చెప్పినా ప్రభుత్వాధికారులు ఎవరూ పట్టించుకోకపోవడమే భారత దేశ దౌర్భాగ్యం. ఇటీవల కాలంలో వారికి భయం, భక్తి లోపించింది. ఉద్యోగంలో చేరిన వెంటనే బల్లకింద చేతులు పెట్టేస్తున్నారు. ప్రభుత్వాధికారుల తమకు వీలైన పనులు చేయించుకోవడానికి వారికి ఇచ్చేది లంచం.మరో మంచి మాట చెప్పలేము. అధికారిని ఏ విధంగా లోబరచుకొని తమ ప్రయోజనాలుకాపాడుకోవాలనుకున్నా, లంచం ఆశ చూపేవారు,అవినీతిని తప్పు పట్టే వారున్నా,అవినీతి నిరోధక శాఖ అవినీతిపరులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నా సరే వారి గమనంమారదు. ఎప్పటికప్పుడే అనే ధోరణిలో మార్పు చెందలేకపోతున్నారు. దులిపేసుకుని మళ్లీ కొత్తప్రయత్నం. కోట్లాది రూపాయలు సంపాదించినా ఇంకా ఇంకా కావాలనే తాపత్రయపడతారు. సాధారణంగా రెవెన్యూ శాఖను అతి అవినీతిమయమైన శాఖగా భావిస్తుంటారు.కానీ దాదాపుప్రభుత్వ శాఖలు అన్నిటిలోనూ లంచావతారులున్నారనే అపప్రధ ఉందనే ఉంది. ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో అవినీతి పెచ్చుపెరిగిపోయింది. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చేయని ప్రయత్నాలు లేవు. జీరో పాయింట్లుంటేనే అత్యధిక అవినీతి ఉన్నట్లు లెక్క. ప్రభుత్వ పాలనలోఅవినీతి, బంధు ప్రీతి బాగా పాతుకుపోయిందనేది అందరికీ తెలిసిందే. పలు దేశాల్లో పెచ్చుమీరిన అవినీతిపై యువత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయా ప్రభుత్వాల మీద ఎదురు తిరిగిన సందర్భాలు మనకు విదితమే. ఇదే జాబితాలో 89 స్కోరుతో డెన్మార్క్ అతి తక్కువ అవినీతి ఉన్న దేశంగా నిలిచింది. ఫిన్లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, నార్వే,స్వీడన్, స్విట్జర్లాండ్, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, జర్మనీతో మొదటి టెన్‌లోఉన్నాయి. అవినీతి సమస్య వల్ల అనేక దేశాలు రాజకీయ ఆర్థిక సంక్షోభాలు బారిన పడ్డాయి. అవినీతి అక్రమార్జనలకు సంబంధించిన విశేషాలు అప్పట్లో పనామాపత్రాలు బయటిపెట్టి సంచలనం సృష్టించాయి. అక్రమ మార్గంలో కూడపెట్టిన లక్షలాది కోట్ల ధనాన్ని ఇతర దేశాలకు తరలించిన తీరు మనకు తెలిసిందే. అవినీతి మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అమెరికా, ఫ్రాన్స్ దేశాలు ఒక ప్రణాళికతో ముందుకు నడుస్తున్నాయి. కాగా అవినీతి వ్యతిరేకంగా దేశాల్ని కలిసికట్టుగా పోరాడాలనే స్ఫూర్తి ఎక్కడా లేకపోయింది. భారత దేశం విషయానికి వస్తే ప్రభుత్వవిభాగాల్లోఊడలు పెంచుకున్న అవినీతికి అడ్డుకట్ట వేయడం చాలా కష్టం అవుతుంది. ప్రభుత్వ విభాగాల్లో అధికారులు ఎన్ని విధాలుగా అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్నారో తేటతెల్లమే. అలాంటి అవినీతిపరులు సస్పెన్షన్ అవుతారు. ఆ తర్వాత మళ్లీ రాజకీయ ప్రాబల్యంతో తిరుగుతారు. ఇవన్నీఎక్కడికి దారితీస్తాయి?అవినీతిని నిరోధించే మూల సూత్రాలు కూడా పక్కనపెట్టి వారిని అందలం ఎక్కిస్తున్నారు. అదే వ్యవస్థలోని లోపం. ప్రజాధనాన్ని సొంత ఆస్తిగా మెక్కేసే అధికారులకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. అందుకు బాధ్యులైన వారు కూడా గతంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించేవారు. భయపడేవారు. ఇప్పుడు భయపడే పరిస్థితి ఏమి లేదు. స్వాతంత్ర్యం వచ్చిన వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు ప్రధానమైన కుంభకోణాల్లో దాదాపు 100లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టినట్లు ఒక అంచనా. ప్రధానంగా రాజకీయ పదవుల్లో ఉన్నవారే అవినీతికి పాల్పడుతుంటే వారు శాసనాలు ఏమి చేయగలరు, వాటిని అమలుపరిచే విషయంలో ఏ విధంగా సహాయ పడగలరు అన్న విషయాలన్నీ తెరమీద అందరికీ తెలిసిన విషయమే ఇలాంటి పరిస్థితులు అవినీతిని ఎండగట్టే స్థితిలోఉండవు. అవినీతిపరులను కఠినంగా శిక్షించే చట్టాలు లేకపోవడం ఒక వెనుకబాటు. అవినీతి అవగాహన సూచిక 2025ప్రకారం, ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోనూ అవినీతి తీవ్రమైన ముప్పుగా ఉంది. ప్రభుత్వరంగ అవినీతి స్థాయిల ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా 182 దేశాలను ర్యాంక్ చేస్తుంది. ఫలితాలు '0' అత్యంత అవినీతి,నుండి 100 రాంక్ అనగానే అవినీతి రహితమని ఇక్కడ అర్థం. 2012 నుండి 31దేశాలు తమ అవినీతి స్థాయిలను గణనీయంగా తగ్గించుకున్నప్పటికీ, మిగిలినవి సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయి. ప్రపంచ సగటు 42కొత్త కనిష్ట స్థాయికి పడిపోయింది. అయితే మూడింట రెండువంతుల కంటే ఎక్కువ దేశాలు 50 కంటే తక్కువ స్కోరు సాధించాయి. ప్రజా ప్రతినిధులు కూడా సుపరిపాలన అందించడంకన్నా తమ సొంత ప్రయోజనాలు కాపాడేందుకే కాలంవెచ్చిస్తున్నారని అనిపిస్తోంది. అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వాలు కంకణం కట్టుకున్ననాడే దేశం సుభిక్షంగాఉంటుంది. ప్రధానంగా ఈదేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి ముందుగారాజకీయ అవినీతిని నిర్మూలించగలిగితేనే సాధ్యమౌతుంది.

ఒకే భాషను శాస్త్రీయంగా అభ్యసిస్తే మిగతా భాషలు సులభతరం అవుతాయి.



మహాత్మాగాంధీ

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### ప్రతిపక్షాల మధ్య సమన్వయం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో పార్లమెంటు అత్యున్నతమైన శాసనసభ. ప్రజల సమస్యలను చర్చించి, పరిష్కారమార్గాలను అన్వేషించాల్సిన ఈ వేదిక నేడు నిరంతర అంతరాయాలకు నిలయంగా మారుతోంది. అధికార,ప్రతిపక్షాల మధ్య సమన్వయం లోపించడం వల్ల పార్లమెంటు విలువైన సమయం వృథా అవుతోంది. దీనివల్ల దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే అనేక కీలకబిల్లులు ఆమోదం పొందకుండా పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. సభలో నిరసనలు తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది సభా సమయాన్ని పూర్తిగా హరించేలా ఉండకూడదు. ప్రతి నిమిషం పార్లమెంటునిర్వహణకు ప్రజాధనంభారీగా వెచ్చించబడుతోంది. అధికార పక్షంప్రతిపక్షాల విమర్శలనుఓర్పుతో వినాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రాఫెల్ కొనుగోళ్లు

ఫ్రాన్స్ నుండి రాఫెల్ యుద్ధవిమానాలు కొనుగోలు చేయడంకోసం3లక్షల కోట్లవిలువైన ఒప్పందం జరగడం గొప్ప పరిణామం అయితే ఇందులో ప్రత్యేకత ఏమిటి? స్వదేశీయంగానాగపూర్‌లోను, హైదరాబాద్‌లో రాఫెల్ విమానాలా భాగాలు తయారు అవుతున్నాయి. ఇది స్వదేశీయంగా తయారు కావడమే కదా చారిత్రక నేపథ్యాల నుండి చుస్తే భారత రాజ్యాంగంలో స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వంలాంటి గుణాలను మనంఫ్రాన్స్ నుండే తీసుకున్నాం. ఇప్పుడు భారత రక్షణ వ్యవస్థకు ఆయువు పట్టులాంటి రాఫెల్ విమానాన్ని అందించడం అందులో 18 ఫ్రాన్స్‌లో 96స్వదేశీయంగా తయారు కావడం ఆహ్వానించదగిన విషయం.

- భారత అవినాష్, జనగామ

### హామీలను నెరవేర్చాలి

ఎన్నికల సమయంలో వివిధ పార్టీలు మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వచ్చాక తప్పకనెరవేర్చాలి. ఎన్నికల సమయంలో మానిఫెస్టోనుఎన్నికల సంఘం నిర్ధారించాలి.హామీలు నెరవేర్చేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. హామీలు నెరవేర్చని ప్రభుత్వం పార్టీ గుర్తింపును రద్దు చేయాలి. అలాగే ప్రభుత్వం ఏర్పడ్డాక బడ్జెట్‌నిధులను ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పారదర్శకంగా పని చేయాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### మనిషికి సాటిరాని కృత్రిమ మేధస్సు

డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కృత్రిమ మేధస్సు సమాజాన్ని కొత్తదిశల్లో నడుపుతోంది. భాష, గణితం, డేటా విశ్లేషణ ఇలాంటి అనేకరంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుత వేగంతో ముందుకు సాగుతున్నప్పటికీ, అది మనిషి సహజ మేధస్సు ను భర్తీ చేయగలదనే అపోహ మరింత ప్రమాదకరం. ఎందుకంటే యంత్రాలు వేగాన్ని, ఖచ్చితత్వాన్ని అందించగలిగినా,భావోద్వేగం,నైతికత,సానుభూతి, సృజనాత్మకత ఇలాంటి మానవ విలువలను అవి పునరుత్పత్తి చేయలేవు. కృత్రిమమేధస్సు అతిపెద్దశక్తి దాని విశ్లేషణ సామర్థ్యం. వైద్యం నుంచి రవాణా వరకు, పంటల ఆరోగ్యం నుంచి వాతావరణ అంచనాలవరకు అన్ని రంగాల్లో ఇది సమర్థతను పెంచుతోంది. వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించడం, ట్రాఫిక్ నియంత్రణ, లాజిస్టిక్స్‌లో వృథా తగ్గించడం వంటి అభివృద్ధులు ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందిస్తున్నాయి.

-కె.రామారావు, నల్గొండ జిల్లా

### నిబంధనలను పాటించాలి

వైద్యుల ప్రిస్క్రిప్షన్ చీటీలేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమేకానీ,తెలంగాణలో అన్నిజిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగాప్రజలఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్‌లేకుండానే మందులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక్కొక్క మందుల షాప్‌లో ఫార్మాసిస్ట్ లేదు. పర్యవేక్షణ లేదు. నిబంధనల ప్రకారం ప్రతి మందుల దుకాణంలో అర్హత పొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. జీఎస్‌టీ, కంప్యూటరైజ్డ్ బిల్లులు ఇవ్వకపోవడంవంటి ఉల్లంఘనలు సర్వసాధారణం. మెడికల్‌షాప్స్ వారు విధిగా నిబంధనలు పాటించాలి.

-పి. జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

### అవినీతికి అంతం లేదా?

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తారాస్థాయికి చేరింది. ప్రతిరోజు ఏదో ఒకప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారుతుంది. సుమారు 1000 మంది అధికారులు ఏసీబీకి చిక్కారు. లంచం లేనిదే కార్యాలయాల్లో ఫైలు కదలైన పరిస్థితి ఉంది. ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసిన లంచగొండి అధికారుల ప్రవర్తనలో మార్పుడం రావడంలేదు.ఏసీబీ అధికారులు మరిన్ని దాడులు చేసి లంచగొండిల భరతం పట్టాలి.

-సి. సతీష్, భూపాలపల్లి జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యాభివృద్ధి లేని వికసిత్ భారత్ సాధ్యమేనా?

*దేశంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయకపోవడంతో విద్యా ర్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యు.కె. లాంటి దేశాలు వలసలుపోతున్నారు. దీని గురించి కనీస ప్రస్తావన బడ్జెట్లో లేదు. విద్యావేత్తలు, మేధావులు గత అనేక సంవత్సరాలు నుండి కోరుతున్నట్లు జి.డి.పి.లో 6 శాతం నిధులు కేటాయింపు కూడా లేదు. సంకుచితమవుతు న్న ప్రభుత్వ పాఠశాలలు, ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న తర గతులు, భారీ డ్రాప్ అవుట్‌లు, వాణిజ్యీకరించిన సంస్థలు, పెరుగుతున్న సామాజిక విభేదాలపై అభివృద్ధి చెందిన భారత్ నిర్మించలేం. వికసిత భారత్ నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఉండాలంటే, ప్రజా విద్యను మళ్లీ సార్వత్రిక హక్కుగా గుర్తించి జాతీయ ప్రాధాన్యతగా పెట్టాలి. లేకపోతే, భారత వృద్ధి విస్తృతంగా కనిపించినా పునాదులు బలహీనంగానే ఉంటాయి.*

టి. నాగరాజు

వికసిత్ భారత్ నినాదంతో యూనియన్ బడ్జెట్ 2026 మౌలిక సదుపాయాలు, డిజిటలైజేషన్, తయారీ రంగం, ప్రపంచ పోటీతత్వం వంటి పదాలతో ప్రజల నమ్మకాన్ని పొందే ప్రయత్నం చేస్తోంది. కానీ ప్రజా విద్యా కోణంలో పరిశీలిస్తే, ఈ బడ్జెట్‌లో విద్యకు తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తుంది. నేడు భారత్ అభివృద్ధి కథ ముందుకు సాగుతున్నప్పటికీ, విద్యను సామాజిక హక్కుగా లేదా మౌలిక ప్రజావనరుగా చూడడంలో విఫలమవుతోంది.భారత జిడిపి పెరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నా, ఆ వృద్ధికి అనుగుణంగా విద్యపై ఖర్చుపెరగడం లేదు. విద్య వ్యయంపై నామమాత్రపు పెరుగుదలను ప్రభుత్వం చూపిస్తోంది. కానీ ద్రవ్యోల్బణం, నమోదు పెరుగుదల, వ్యవస్థాపక ఖర్చులు లెక్కలోకి తీసుకుంటే, ఈసంఖ్యలు తప్పుదారిపట్టించేవే. 2026-27 బడ్జెట్‌లో విద్య మంత్రిత్వ శాఖకు కేటాయింపు చేసినది రూ.1,39,289 కోట్లు కాగా, 2025-26లో ఇది రూ. 1,28,650 కోట్లు. నామమాత్రంగా పెరుగుదలఉన్నా, వాస్తవ (ద్రవ్యోల్బణ సర్దుబాటు చేసిన) వ్యయం స్థిరంగా ఉంది. మొత్తం జిడిపిలో విద్య ఖర్చు సుమారు 3-4శాతం మాత్రమే ఉంది. ఇది జాతీయ విద్యా విధానం (ఎనఈపి) సూచించిన 6శాతం లక్ష్యానికి చాలా తక్కువ. కేంద్ర ప్రభుత్వ కేటాయింపు కేవలం జిడిపిలో 0.3 శాతం మాత్రమే. మొత్తం అంచనా ఖర్చు రూ. 53.5 లక్షల కోట్లలో విద్య వాటా సుమారు 2.6 శాతం మాత్రమే. అనుపాతంగా చూస్తే, జిడిపి పెరుగుతున్నప్పటికీ విద్యకు ప్రాధాన్యం తగ్గుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే ఈ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. జపాన్, చైనా, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలు తమ జిడిపిలో 6 శాతం లేదా అంతకంటే ఎక్కువను విద్యపై ఖర్చుచేస్తున్నాయి. ఆర్థికబలం, ఆవిష్కరణలు, సామాజిక స్థిరత్వానికి ప్రజా పెట్టుబడి కీలకమని అవి గుర్తించాయి. కానీ భారతదేశం విద్యకు తగిన పెట్టుబడి లేకుండా ప్రపంచ శక్తిగా మారాలనే ఆశయం బలహీనమైన పునాదిపై నిలబడి ఉంది. ఈ నిర్లక్ష్యం ప్రభావం నేల మీద ఇప్పటికే కనిపిస్తోంది. 2014-15లో 11,07,101 ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 2023-24 నాటికి 10,17,660కు తగ్గాయి. గత దశాబ్దంలో 89,441 ప్రభుత్వ పాఠశాలలు మూసివేయబడ్డాయి. 'సమర్థత' పేరుతో తీసుకున్న నిర్ణయాలు గ్రామీణ, గిరిజన, అంచున ఉన్నవర్గాలపై తీవ్ర ప్రభావం చూపాయి. పిల్లలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. చదువు మానేయాల్సి వస్తోంది. పాఠశాలల మూసివేత లేదా విలీనం అనే సంక్షోభంపై బడ్జెట్ 2026 మౌనం వహిస్తుంది.బడ్జెట్ 2026లో అత్యంత పెద్దలోపం, భారీ స్థాయిలో ఉపాధ్యాయ నియామకాల లేమి. ప్రపంచంలో అతిపెద్ద విద్యా వ్యవస్థలలో ఒకటైన భారత్‌లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమైంది. 33లక్షల మంది విద్యార్థులు ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న పాఠశాలల్లో చదువు తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేర్చుకునే నాణ్యత మెరుగ వుతుందని ఆశించడం వాస్తవాలకు విరుద్ధం. డిజిటల్ ప్లాట్ ఫామ్‌లు, పాఠ్యాంశాలలో మార్పులు లాంటి చర్యలు శిక్షణ పొందిన, భద్రతకల్గిన, తగిన వేతనం పొందే ఉపాధ్యాయులకు ఏమాత్రం ప్రత్యామ్నాయంకావు. ప్రభుత్వ విద్యాసంస్థలలో తగిన పెట్టుబడి లేకపోవడం వల్ల డ్రాప్ అవుట్‌లు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు 65.7 లక్షల మంది పిల్లలు పాఠశాల వ్యవస్థ నుంచి బయటకువచ్చారు. వీరిలోదాదాపు సగం మంది బాలికలే. ఇది పేదరికం, పాఠశాల మూసివేతలు, మాధ్యమిక పాఠశాలల కొరత, అసురక్షిత ప్రయాణం, ప్రజా మద్దతు లేకపోవటం వంటి అంశాలతో సంబంధం కలిగి ఉన్నాయి. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు బడ్జెట్



2026లో పునర్నమోదు, వారిని స్థిరంగా చేయడం నిలుపుదల, సామాజిక మద్దతుకు సమగ్ర వ్యూహం ఈ బడ్జెట్‌లో లేదు. ఈ బడ్జెట్ ప్రభుత్వ విద్యా సంస్థలను బలపరచడం బదులు, ఎన్‌ఈపికి అనుసంధానమైన అంశాలపై ఎక్కువగా దృష్టి పెడుతోంది అకాడెమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఎబిసి), నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సిఆర్‌ఎఫ్), అపార్, పరఖ్, పిఎమ్ శ్రీ, దీక్ష వంటి పథకాలు. అదేవిధంగా పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి)మోడల్‌ను విద్యలో ముందుకు తీసుకు వస్తోంది. ఇది సామర్థ్యం, ఆవిష్కరణ పేరుతో ప్రభుత్వ విద్యాసంస్థలను వాణిజ్యపరంగా మార్చి,ఖర్చును విద్యార్థులు,వారి కుటుంబాలపై మోపి, ప్రభుత్వ విద్యను ప్రైవేట్ లాభాలకు తలుపులు బార్లా తెరుస్తోంది. ఉన్నత విద్యలో అంతర్జాతీయీకరణ, పరిశ్రమ విద్యాసంస్థల భాగస్వామ్యం, వికసిత భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్ఎ)బిల్లుతో తీవ్రమైన కేంద్రీకరణ ద్వారా నియంత్రణ వ్యవస్థ ప్రతిపాదన ఇవన్నీ అధిక కేంద్రీకరణను, మార్కెట్ దృక్పథాన్ని సూచిస్తున్నాయి. ప్రజా పెట్టుబడికి బదులు నియంత్రణ పునర్వ్యవస్థీకరణకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజాస్వామ్య నియంత్రణను, సంస్థాగత స్వతంత్రతను బలహీనపరుస్తున్నాయి. అంతిమంగా చూస్తే, ప్రస్తుత విధానాల కింద రూపొందుతున్న విద్యా వ్యవస్థ అత్యంత సాధనోపయోగంగా ఉంది. ఇది కొద్దిమంది అత్యంత నైపుణ్యం గల ఎలైట్‌వర్గాన్ని తయారు చేయడమే కాకుండా, అస్థిర కార్మిక మార్కెట్‌కు సరిపోయే అర్ధనైపుణ్యం గల పెద్ద సంఖ్యలో కార్మికులను సృష్టిస్తోంది. అదేసమయంలో, అర్ధశిక్షణ పొందిన డ్రాప్ అవుట్‌ల పెద్దసమూహం ఏర్పడుతోంది. ఇది యాదృచ్ఛికం కాదు. దీర్ఘకాలిక తక్కువ పెట్టుబడి ప్రైవేటీకరణ ఫలితం. ఈ బడ్జెట్ పూర్తిగా అభివృద్ధి రహితమైనది. మైనారిటీలు, చారిత్రాత్మకంగా అణగారిన వర్గాలపై ప్రత్యేక దృష్టిలేదు. ప్రవేశాలు నైపుణ్యం,నేర్చుకునే పద్ధతుల్లో ఉన్న అసమానతలను పట్టించుకోవడం లేదు. సామాజిక నిర్మాణాత్మక అసమానతలను పట్టించుకోకుండా జాతీయ విధానమని చెప్పుకోవడం ప్రజాస్వామ్యంగా చెప్పలేం. ఈ నిర్లక్ష్యం పాఠశాలలు, విశ్వవిద్యాలయాలకే పరిమితం కాదు. మధ్యాహ్న భోజన పథకం వంటి పునాది సంక్షేమ విద్యా వ్యవస్థలకూ విస్తరించింది. అంగన్‌వాడి పోషణ్ 2.0కు 2026-27లో కేటాయింపు రూ.23,100 కోట్లు మాత్రమే (గత సంవత్సరం రూ.21,960 కోట్లు). పోషకాహార ఖర్చు ప్రమాణాలు పెరుగుతాయని హామీ ఇచ్చినా, ఇది రోజుకు ఒక్కో పిల్లకు కేవలం 38 పైసల పెరుగుదల మాత్రమే.3.38 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీరు లేదు, 4.61 లక్షలకు మరుగుదొడ్లు లేవు. గత నాలుగేళ్లలో కేవలం 60,000 కేంద్రాలే అభివృద్ధి చేయబడ్డాయి. ఇది బాల్యవిద్య, పోషణ పునాదినే దెబ్బతీస్తోంది. మొత్తంగా చూస్తే,బడ్జెట్ 2026 విద్యను సామాజిక హక్కుగా కాకుండా మార్కెట్ ఆధారిత సేవగా మార్చుతోంది. నైపుణ్యాలు, క్రెడిట్లు, ఉద్యోగయోగ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజా పెట్టుబడి, ఉపాధ్యాయ నియామకాలు, సామాజిక రక్షణను పక్కన పెడుతోంది. ఇవన్నీ పేదరికం, ప్రాంతీయ అసమతుల్యత, లింగవివక్ష, రాష్ట్ర ఉపసంహరణ వల్ల ఏర్పడిన నిర్మాణాత్మక అసమానతలపై తాత్కాలికం మాత్రమే. దేశంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయకపోవడంతో విద్యార్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యు.కె. లాంటి దేశాలు వలసలుపోతున్నారు. దీని గురించి కనీస ప్రస్తావన బడ్జెట్లో లేదు. విద్యావేత్తలు, మేధావులు గత అనేక సంవత్సరాలు నుండి కోరుతున్నట్లు జి.డి.పి.లో 6 శాతం నిధులు కేటాయింపు కూడా లేదు. సంకుచితమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు, ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న తరగతులు, భారీ డ్రాప్ అవుట్‌లు, వాణిజ్యీకరించిన సంస్థలు, పెరుగుతున్న సామాజిక విభేదాలపై అభివృద్ధి చెందిన భారత్ నిర్మించలేం. వికసిత భారత్ నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఉండాలంటే, ప్రజా విద్యను మళ్లీ సార్వత్రిక హక్కుగా గుర్తించి జాతీయ ప్రాధాన్యతగా పెట్టాలి. లేకపోతే, భారత వృద్ధి విస్తృతంగా కనిపించినా పునాదులు బలహీనంగానే ఉంటాయి. •

# ఆహార దుర్వినియోగాన్ని నివారించాలి

డాక్టర్. వై. సంజీవ కుమార్

మనిషి మనుగడకు ప్రాణవాయువు ఎంత అవసరమో, ఆహారం అంతే అవసరం. అలాంటి ఆహారాన్ని నిర్లక్ష్యంగా వృథా చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. నేడు ఆహారాన్ని వృథా చేసే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఒకవైపు ఆహారం చెత్తబుట్టల్లో పడిపోతుంటే, మరోవైపు ఒక్కపూట భోజనం కోసం ఆశగా ఎదురుచూస్తూ జీవిస్తున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. ఆకలి బాధ తాళలేక మరణించిన వాళ్లు ఎందరో ఉన్నారు. ఆకలి కేవలం శరీరబాధనే కాదు అంతరాత్మను క్షోభపెట్టె బాధ. ఆకలితో జీవించడం అత్యంత దుర్భరమైన అనుభవం. ఆకలిబాధను అనుభవించినవారికే ఆ కష్టం విలువ తెలుస్తుంది. అవసరానికి మించి ఆహారం వండటం, ఫంక్షన్లకు వెళ్లి ఆకలి లేకున్నా ఎక్కువగా తీసుకుని పూర్తిగా తినకుండా వదిలేయడం వంటి చర్యలు చిన్న తప్పుగా భావించవచ్చు. కానీ బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుంది. నేటి ఆధునిక పోకడల్లో మనిషి విలువలకన్నా ఆడంబరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడు. స్తోమతకు మించి శుభకార్యాలు చేయడం ఒక ఫ్యాషన్‌లా మారిపోయింది. వాళ్లు ఇలా చేసారు.. వీళ్లు అలా చేసారు అనే పోలికలతో, పోటీ భావనతో, గ్రాండ్‌గా చేయకపోతే ఎవ్వరో ఏదో అనుకుంటారు అనే విపరీత ధోరణిలతో చిన్న శుభకార్యమా.. పెద్ద శుభకార్యమా అనే తేడా లేకుండా అనేక రకాల వంటకాలు సిద్ధం చేస్తున్నారు. పది మంది తినే కార్యక్రమానికి ఇరవై రకాల వంటకాలు, వంద మంది తినే కార్యక్రమానికి ముప్పై రకాల వంటకాలను, మరికొందరి మరిన్ని ఎక్కువ రకాల వంటలను చేయి



స్తున్నారు. ఒక్కో వంటకం రుచి చూడటానికి తీసుకుని సగం సగం తిని మిగతాదంతా చెత్తబుట్టలో వేయడం ఇప్పుడొక సాధారణ దృశ్యంగా మారిపోయింది. ఆహారాన్ని వృథా చేస్తున్నాము అనేది తప్పు అని ఎవ్వరికి అనిపించడం లేదు. కానీ ఆ చెత్తబుట్టలో పడుతున్న ప్రతి గింజ వెనుక ఒక రైతు చెమట ఉంది. శుభకార్యం చేసే కుటుంబం కష్టం ఉంది. ఒక ఆకలితో ఉన్న మనిషి ఆశ ఉంది. పోటీ పడాల్సింది ఆడంబరాల్లో కాదు, మంచి పనుల్లో పడాలి.ఎవరి శుభకార్యం ఎంత గొప్పగా జరిగిందోకాకుండా, ఎంత మంచిగా నిర్వహించామా, ఎంతమందికి ఉపయోగపడిందో అనేదే అసలైన గొప్పతనం. మంచి మార్పులను ఎప్పటికప్పుడు మనిషి అలవాటు చేసుకోవాలి, ఆచరణలో కొనసాగాలి, ఆహారాన్ని వృథా చేయకపోవడం కూడా ఒక గొప్ప సంపాదనే. శుభకార్యాలు, ఇతర వేడుకలు నిర్వహిస్తున్నప్పుడు సమీపంలోని ఆశ్రమాలు, అనాథాశ్రమాలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆహ్వానించి వారికిఆహారం అందిస్తే, వారి ఆకలిని తీర్చడమే కాకుండా ఒకఅపూర్వమైన సంతృప్తి,ఆనందం లభిస్తుంది. ఆహారంపట్ల అందరూబాధ్యతగా ప్రవర్తించే అలవాట్లు చేసుకుంటే, నేటిచిన్నారులు ఆ అలవాట్లను అనుసరిస్తారు,బాధ్యతతో కూడిన నడవడికతో ఆహారాన్ని దుర్వినియోగం చేయకూడదనే మంచి అలవాట్లను నేర్చుకుంటారు,దాని ద్వారా భవిష్యత్తులో వారు ఆహారాన్ని గౌరవించే,వృథాచేయని బాధ్యతాయుతమైన పౌరులుగా మారుతారు. ఆహారాన్ని గౌరవిద్దాం,ఆకలిని తగ్గిద్దాం. •

# ఏఐ పునాదులు బలపడితేనే దేశ భవిష్యత్తు!

ముద్దం నరసింహస్వామి

ప్రతి దేశంలో కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తూ జన జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నిర్ధారణ, రిటైల్, ఫైనాన్స్, పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో ఏఐ విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. అయితే ఈ వేగంలో భారత్ క్రియాశీలంగా ఉన్నప్పటికీ, గ్లోబల్ పోటీలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేకపోతోంది. పెట్టుబడుల కొరత, మౌలిక వసతుల లేమి, నిపుణ మానవ వనరుల లోపం వంటి అంశాలు దేశీయ ఏఐ వృద్ధికి ప్రధాన అడ్డంకులుగా మారుతున్నాయి.స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన తాజా ఏఐ నివేదిక ప్రకారం, 2013-2024 మధ్య కాలంలో కృత్రిమ మేధ రంగంలో అమెరికా సుమారు 47 వేల కోట్ల డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించగా, చైనా దాదాపు 12వేల కోట్ల డాలర్లు సమీకరించింది. అదే సమయంలో భారత్ కేవలం 1,100కోట్ల డాలర్ల పెట్టుబడులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇది ప్రపంచంలో డేటా ఉత్పత్తిలో భారత్ వాటా సుమారు 20 శాతం ఉన్నప్పటికీ, డేటా నిల్వ సామర్థ్యం కేవలం 3శాతానికి పరిమితమవుతుండటం గమనార్హం. ఈ అసమతుల్యత ఏఐ ఆధారిత పరిశోధనలు, ఉత్పత్తుల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏఐ మోడళ్ల శిక్షణకు కీలకమైన జీపీయూల అందుబాటులో లేకపోవడం భారత్‌కు పెద్ద సమస్యగా మారింది. తాజా ఆర్థిక సర్వే కూడా ఇదే అంశంపై హెచ్చరించింది. జీపీయూల కొరత కారణంగా పరిశోధనల వేగం మందగించడం, ఖర్చులు పెరగడం జరుగుతోంది. మరోవైపు, సెమీ కండక్టర్ చిప్‌ల కోసం విదేశాలపై ఆధారపడటం దేశీయ ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలహీనపరుస్తోంది. దేశీయంగా నిధులు, మౌలిక వసతులు, మార్కెట్ యాక్సెస్ సరిగా లభించకపోవడంతో భారతీయ ఏఐ స్టార్టప్‌లు అమెరికా వైపు చూస్తున్నాయి. వందకు పైగా ఏఐ సంస్థలు ఇప్పటికే యూఎస్‌కు తరలివెళ్లడం లేదా అక్కడ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రయత్నించడం భారత్‌కు హెచ్చరికగా భావించాలి. ఇది బ్రెయిన్ డ్రెయిన్ మాత్రమే కాదు, ఇన్నోవేషన్ డ్రెయిన్ కూడా. అంచనాల ప్రకారం, వచ్చే ఏడాదికల్లా భారత్‌లో ఏఐ రంగంలో 23 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉంది. అయితే ఉన్నత విద్య వ్యవస్థను తక్షణమే సంస్కరించుకోకపోతే, దాదాపు 10 లక్షల ఏఐఉద్యోగాలు నిపుణుల లేమితో ఖాళీగానే మిగిలి కోర్సులు కొద్ది అగ్రశ్రేణి విద్యాసంస్థలకే పరిమితమయ్యాయి. అధిక శాతం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలల్లో ఏఐ విభాగాలు, ప్రాక్టికల్ ఓరియెంటెడ్ పాఠ్యప్రణాళికలు లేవు. ఈ పరిస్థితుల్లో దేశీయంగా ఆధునిక మౌలిక వసతులనువేగంగా అభివృద్ధి చేయడం అత్యవసరం. ఏఐ మిషన్ కింద భారీ స్థాయిలో జీపీయూలను అందుబాటులోకి తీసుకురావాలి. విశాఖపట్నంలో ఏఐ హబ్, డేటా సెంటర్, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు వంటి ప్రణాళికలు మౌలిక




వసతుల పరంగా సానుకూల సంకేతాలే.అయితే ఇవి కేవలం ప్రారంభ దశకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా విస్తరించాలి.తాజా అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్న మరో కీలక అంశం స్వదేశీ ఏఐ మోడళ్ల అభివృద్ధి. విదేశీ మోడళ్లపై ఆధారపడటం డేటా భద్రత, వ్యయభారం, వ్యూహాత్మక స్వతంత్రతపై ప్రభావం చూపుతుంది. కాబట్టి ఇండియా తన భాషలు, అవసరాలు, సామాజిక వాస్తవాలకు అనుగుణంగా సొంత లాంగ్వేజ్ మోడళ్లు, అప్లికేషన్లు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కేవలం టెక్నాలజీ రంగానికే పరిమితం కాకుండా, దేశాల ఆర్థిక భద్రత, జాతీయ భద్రత, సామాజిక సమానత్వానికి కేంద్ర బిందువుగా మారుతోంది. అమెరికా, చైనా వంటి దేశాలు ఏఐని స్ట్రాటజిక్ నేషనల్ అసెట్‌గా పరిగణిస్తూ భారీ ప్రభుత్వ-ప్రైవేట్ పెట్టుబడులతో ముందుకెళ్తున్నాయి. భారత్ కూడా ఈమార్గంలో అడుగులు వేస్తున్నప్పటికీ, అవి ఇంకా చెల్లాచెదురుగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.స్టాన్‌ఫర్డ్ ఏఐ ఇండెక్స్ రిపోర్ట్ ప్రకారం, అమెరికాలో మొత్తం ఏఐ పెట్టుబడుల్లో ప్రభుత్వ వాటా 30 శాతం దాటింది. చైనాలో అయితే ఇది ఇంకా ఎక్కువ. భారత్‌లో మాత్రం ఏఐ పెట్టుబడులు ఎక్కువగా ప్రైవేట్ రంగానికే పరిమితమవుతున్నాయి. దీని ఫలితంగా దీర్ఘకాలిక పరిశోధనలు, ఫౌండేషన్ మోడళ్ల అభివృద్ధి వంటి ఖరీదైన కార్యక్రమాలకు అవసరమైన స్థిర నిధులు అందడం లేదు. ప్రభుత్వం ముందుగా తీసుకోవాల్సిన కీలక నిర్ణయం జాతీయ ఏఐ ఫండింగ్ మోడల్. రక్షణ, అంతరిక్ష రంగాల మాదిరిగానే ఏఐకూ ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి. ఏఐ పరిశోధనల కోసం ఐఐటీలు, ఐఐఎస్సీ, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నేషనల్ ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇవి కేవలం అకడమిక్ పరిశోధనకే కాకుండా, స్టార్టప్‌లకు ఓపెన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా పనిచేయాలి. మరో కీలక అంశం డేటా పాలసీ. ప్రపంచ డేటాలో ఐదవ వంతు భారత్‌నుంచి ఉత్పత్తి అవుతున్నప్పటికీ, ఆ డేటా ఆధారంగా విలువ సృష్టించుకుంటున్నవి ఎక్కువగా విదేశీ సంస్థలే. దేశీయంగా సురక్షితమైన డేటా షేరింగ్ ఫ్రేమ్‌వర్క్, పబ్లిక్ డేటా రిపోజిటరీలు ఏర్పాటు చేస్తే హెల్త్‌టెక్, అగ్రిటెక్, ఎడ్యుటెక్ రంగాల్లో దేశీయ ఏఐ మోడళ్ల అభివృద్ధికి ఊతంలభిస్తుంది. విద్యారంగంలో సంస్కరణలు మరింత అత్యవసరం. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌ను ఎలక్టివ్‌లుగా కాకుండా కోర్ సబ్జెక్టులుగా ప్రవేశపెట్టాలి. పరిశ్రమలతో కలిసి లైవ్ ప్రాజెక్ట్స్, అప్రెంటిస్‌షిప్స్ తప్పనిసరి చేస్తేనే నైపుణ్యలోపం తగ్గుతుంది. ప్రపంచ బ్యాంక్ అంచనాల ప్రకారం, సరైన స్కిల్ అప్‌గ్రేడేషన్ జరిగితే భారత్ ఏఐ ద్వారా జీడీపీకి అదనంగా 7-8 శాతం వృద్ధిని సాధించగలదు. చివరగా, ప్రవాస భారతీయ ఏఐ నిపుణులను తిరిగి రప్పించేలా ప్రత్యేక ప్రోత్సాహక విధానాలు అవసరం. పన్నురాయితీలు, రీసెర్చ్ గ్రాంట్లు, స్టార్టప్ ఫ్రీడమ్ కల్పిస్తే భారత్ బ్రెయిన్ డ్రెయిన్‌ను బ్రెయిన్ గైన్‌గా మార్చగలదు. ఏఐ యుగంలో వెనుకబడితే, అది కేవలం ఒక టెక్నాలజీ లోటు కాదు భవిష్యత్ అవకాశాల కోల్పోవడమే. కాబట్టి ఇప్పుడే సమగ్ర జాతీయ వ్యూహంతో ముందుకెళ్లాల్సిన సమయం వచ్చింది. ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు, బలమైన మౌలికవసతులు, సమగ్ర విద్యా సంస్కరణలు, పరిశోధనలకు ప్రోత్సాహం కలిసొస్తే ఏఐ పందెంలో అగ్రదేశాలకు దీటుగా భారత్ దూసుకుపోవడం అసాధ్యం కాదు. ఇప్పుడే పునాదులు బలపరచుకోకపోతే, రేపటి అవకాశాలు విదేశాలకే జారిపో తాయన్న సత్యాన్ని విధాన నిర్ణయకర్తలు గ్రహించాల్సిన సమయం ఇదే. •

# విజయవాడ వార్త

## ఈ నెల 21, 22న జిల్లా స్థాయి సేంద్రీయ మేళా

### ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**విజయవాడ, ఫిబ్రవరి 12(ప్రభాతవార్త) :** ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కృష్ణాయపాలెం గ్రామంలో ఈ నెల 21వ తేదీన, విజయవాడలో ఈ నెల22 వ తేదీన నిర్వహించనున్న ఎన్‌టీఆర్ జిల్లా స్థాయి సేంద్రీయ మేళా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



గురువారంనాడు అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, మౌలిక వసతులు, రైతులకు అనుకూలమైన ఏర్పాట్లు, ప్రదర్శన స్టాల్స్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ, మార్కెట్ లింకు కల్పన వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మార్గదర్శకాలను అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కామర్స్ సంస్థలు, బిగ్ బాస్కెట్ వంటి కొనుగోలుదారులు కూడా ఈ మేళాలో పాల్గొంటారని, ఆసక్తి గల రైతులు, వినియోగదారులు మరియు కొనుగోలుదారులు 22వ తేదీన విజయవాడలో జరిగే ఈ మేళాలో పాల్గొనవలసిందిగా జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా సేంద్రీయ వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించి, రైతుల ఆదాయాభివృద్ధికి తోడ్పడే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సేంద్రీయ రైతులకు మార్కెట్ లింకు కల్పించడం సేంద్రీయ మేళా ముఖ్య ఉద్దేశ్యమని ఆయన కలెక్టర్ తెలిపారు. సేంద్రీయ వ్యవసాయంపై ఆసక్తి కలిగిన రైతులకు సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, సేంద్రీయ ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం జరుగుతుందన్నారు. సేంద్రీయ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాల్స్, శిక్షణ సదస్సులు, ప్రత్యక్ష ప్రదర్శనలు , రైతు-నిపుణుల పరస్పర చర్చా వేదికలు ఈ మేళాలో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎరువులు, పురుగుమందులను తగ్గించి రైతులు వారి పొలంలో సేంద్రీయ కర్బనంను పెంచుకోవాలని, ఆదర్శ రైతులకు,ఎఫ్పీఓస్ ,ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే వారికి సన్మానం ఉంటాయని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు మరియు కొనుగోలుదారులను ఈ కార్యక్రమంలో ఒకే వేదికపైకి తీసుకువస్తామని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి మార్కెట్ కల్పించేందుకు మార్కెటింగ్ లింకేజీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంఓయూలు, ఒప్పందాలు మరియు వివిధ మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి ,డీపీఎం వై.శంకర్ నాయక్, భూమి ఆర్గానిక్ రఘురాం, టీలివీ, ఎంపీడీఓ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

**విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 12(ప్రభాతవార్త ) :** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, కృష్ణా మరియు ఎన్టీఆర్ జిల్లాలలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలు మరియు కళాశాలల్లో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ, 6వ, 7వ, 8వ, 9వ, 10వ తరగతులు మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (జనరల్ మరియు ఐఐటి-నీట్ విభాగాలు) ప్రవేశాలకు బాలుర మరియు బాలికల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి గల విద్యార్థులు ఈ నె 29వ తేదీలోగా తమ దరఖాస్తులను ఆన్ లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవలసి ఉంది. 5 వ తరగతి లో 1040 ఖాళీలకు గాను 1013 మంది , ఇంటర్ నందు 960 ఖాళీలకు గాను 1660 మంది 6 నుండి 9 వరకు 858 మంది బాలబాలికలు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్నారు ఇంకను అర్హత గల్గి దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు (https://apbragcet.apcfss.in) వెబ్ సైట్ ను సందర్శించవచ్చు. . అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ (0866 2481698) లేదా మీకు దగ్గర్లో గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలు లేదా అధికారిక వెబ్‌సైట్‌ను (https://apbragcet.apcfss.in) సంప్రదించగలరు.

## ఈ ఎన్‌హెచ్30పై ప్రయాణం యమపురికి మార్గం

### ఎన్‌హెచ్-30 అధికారుల మీనమేషాలపై విమర్శ

**ఎ కొండూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఒకరిద్దరు నిర్వాసితులు కోర్టులో వేయడం వల్ల విజయవాడ మైలవరం తిరువూరు జగదల్‌పూర్ జాతీయ రహదారి-30పై ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మొత్తం విస్తరణ ఆగిపోవడంతో ఈ ప్రమాదకర మలుపులో ప్రమాదాలు జరుగుతుండంతో ప్రజలు ప్రయాణీకులు బేజారెత్తుతున్నారు.



మండలం రామచంద్రాపురం వద్ద ప్రమాదకర మలుపులో ఉన్న గృహాలను తొలగించడంలో గత దశాబ్దకాలంగా జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుండడంతో ఈ ప్రాంత ప్రజలు ప్రయాణీకులు అధికారుల వైఖరిని తీవ్రంగా ఆక్షేపించారు. ఈ ఎన్‌హెచ్-30 రామచంద్రాపురం విస్తరణలో భాగంగా ఇళ్ళు కోల్పోయిన నిర్వాసితులకు నష్ట పరిహారం అందచేయడం కోర్టులో ఉన్న సమస్యను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం వల్ల తిరువూరు మైలవరం నియోజకవర్గ ప్రాంతాల ప్రజలు అనేక రహదారి ప్రమాదాల వల్ల నరకకూపంగాతో ప్రమాదాలతో మృత్యువాతపడుతున్నారు. ఈ జాతీయ రహదారి మలుపులో ఉన్న గృహాలను వెంటనే తొలగించి యమపురి దారి నుండి ప్రాణాలు కాపాడాలని ఈ ప్రాంత ప్రజలు కలెక్టర్ జాయింట్ కలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు.

## తిరువూరులో సమ్మె విజయవంతం

**తిరువూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె తిరువూరులో విజయవంతంగా జరిగింది. సిఐటియు అనుబంధ సంఘాలైన అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఆశ వర్కర్స్ యూనియన్, ముఠా కార్మిక సంఘం, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆటో కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు, రైతులు, ఏపీ ఎన్జీవోస్ నాయకులు, ఏఐటియుసి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సంఘీభావంగా వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా ప్రదర్శన నిర్వహించి తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.

## ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను విడుదల చేసిన ఓల్డ్ బ్రిడ్జ్ మ్యూచువల్ ఫండ్

**విజయవాడ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను విడుదల చేస్తున్నట్లు ఓల్డ్ బ్రిడ్జ్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఇది లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ , స్మాల్‌క్యాప్ స్టాక్‌లలో పెట్టుబడి పెట్టే ఓపెన్‌ఎండ్ డైనమిక్ ఈక్విటీ పథకం. ఇది పెట్టుబడిదారులకు ఒకే వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియో ద్వారా మార్కెట్ ను అన్వేషించటాన్ని సులభతరం చేస్తుంది. ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ యొక్క కొత్త ఫండ్ ఆఫర్ ఈ నెల 13న ప్రారంభమై, ఈ నెల 23న ముగుస్తుంది. ఈ పథకం యూనిట్‌కు రూ. 10 ప్రారంభ ధరతో అందించబడుతుంది, ఏకమొత్తం దరఖాస్తులకు కనీసం రూ. 5,000, ఎస్ఐపి లకు రూ. 1,000పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఈ ఫండ్ బాటమ్‌అప్, బిజినెస్ బైబిజినెస్ పెట్టుబడి విధానాన్ని అనుసరిస్తుంది. ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను ఓల్డ్ బ్రిడ్జ్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ కెన్నెత్ ఆండ్రేడ్ నిర్వహిస్తారు. ఈ ఫండ్ బీఎస్ఈ 500 ట్రై కి అనుగుణంగా బెంచ్‌మార్క్ చేయబడింది.గ్రోత్, ఐడీసీడబ్ల్యూ అవకాశాలతో డైరెక్ట్, రెగ్యులర్ ప్లాన్‌ల క్రింద అందుబాటులో ఉంటుంది

## పలు సమస్యల పై సిఎంకు వినతి పత్రం అందజేత

**తిరువూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం తిరువూరు నియోజకవర్గానికి సంభందించిన పలు అంశాలు సమస్యలు మరియు గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వంతెన నిర్మాణానికి కావాల్సిన నిధులు గురించి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్ళగా సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.



## మహా శివరాత్రి ఏర్పాట్లపై అలసత్వం వద్దు : కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 12(ప్రభాతవార్త ) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ శ అధికారులకు సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి దేవాదాయ శాఖ అధికారులతో పాటు వివిధ ఆలయాల ఈవోలు, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రతలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంతో పాటు జిల్లా వ్యాప్తంగా శివాలయాలకు పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణానదీ తీరంలోని దుర్గాఘాట్, పున్నమి ఘాట్, భవానీ ఘాట్, పవిత్ర సంగమం వంటి ప్రాంతాల్లో భక్తులు భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించే అవకాశం ఉన్నందున ఈ నెల 14, 15 తేదీల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఘాట్ల వద్ద, క్యూ లైన్లలో నిరంతరం పహారా కాయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిఘా ఉంచాలని పోలీసు శాఖకు సూచించారు. బ్యారికేడింగ్, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ఘాట్ల వద్ద నిరంతర పారిశుధ్య పనులు చేపట్టాలని, భక్తులకు తాగునీరు, మొబైల్ టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షి ంచాలని, వివిధ ఆలయాల్లో ముఖ్యంగా రద్దీ సమయాల్లో తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన ఘాట్ల వద్ద మెడికల్ క్యాంపులు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పండగ రోజుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు స్పష్టం చేశారు. భక్తుల రక్షణను దృష్టిలో ఉంచుకొని 15 మంది శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను మూడు షిఫ్టులలో ఘాట్ల వద్ద అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖాధికారిని ఆదేశించారు.

ఎక్కడైనా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా వాటికి ప్రతిరోజూ భద్రతా ప్రమాణాల తనిఖీ చేయాలని, తనిఖీ రిజిస్టర్లను నిర్వహించాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరక్కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీటీవీ, డ్రోన్లను కూడా ఉపయోగించాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేయాలన్నారు. మహిళా భక్తులు, చిన్నపిల్లలు, వయోవృద్ధుల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. అన్న ప్రసాదంతో పాటు లడ్డూ ప్రసాదాలను అత్యంత నాణ్యతతో అందించాలని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి ఎన్.షణ్ముగం, ఆర్‌డీవోలు కె.బాలకృష్ణ, కె.మాధురి, సమన్వయ శాఖల అధికారులు వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు.

## వ్యర్థాలను పూర్తి స్థాయిలో సేకరించాలి

### కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** అవసరమైతే వాహనాల ట్రిప్పులు పెంచి వ్యర్థాలను పూర్తి స్థాయిలో సేకరించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. గురువారం ఆయన శాఖాధిపతులతో టెలికాన్ఫరెన్స్ ను నిర్వహించారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లను,పారిశుద్ధ కార్మికుల సమ్మె వలన వారు తీసుకుంటున్న చర్యలనడిగారు. పర్మినెంట్ వర్కర్లతో పారిశుద్ధ నిర్వహణ జరిపిస్తున్నామని వారు కూడా ఫీల్డ్ లోనే అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎక్కడ ఇబ్బంది కల్గకుండా చూసుకుంటున్నారన్నారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ కార్మికులు సమ్మెలో ఉన్న సందర్భంగా నగరంలో ఎక్కడ పారిశుద్ధ నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఉన్న పారిశుద్ధ కార్మికులతో ఎక్కడ వ్యర్థాలు లేకుండా చేసుకోవాలని, ఫీల్డ్ లోనే ఉంటూ ఎక్కడైనా అవసరం ఉంటే వెంటనే ఆ ప్రాంతానికి పారిశుద్ధ కార్మికుల ద్వారా అక్కడున్న వ్యర్థాలను తొలగించేటట్లు చర్యలు తీసుకోవాలని,ప్రజలకు పారిశుధ్య నిర్వహణపై ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలన్నారు. గురువారం అర్ధరాత్రితో సమ్మె విరమిస్తారు కాబట్టి శుక్రవారం ఉదయం వ్యర్థాల సేకరణలో పారిశుధ్య నిర్వహణలో విస్తృత చర్యలు తీసుకొని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కల్గకుండా చూసుకోవాలని అవసరమైతే వ్యర్థాల సేకరణ వాహనాలను ట్రిప్పులు పెంచి వ్యర్థాలను సేకరించాలన్నారు.



## కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

**పెనమలూరు ఫిబ్రవరి12,ప్రభాతవార్త :** కార్మికులను ఉద్యోగులను కట్టుబానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్లను రద్దుచేయాలని వీటికి వ్యతిరేకంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు పెనమలూరు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పెనమలూరు మండలంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు వై.నరసింహారావు జెండాఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళ తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్లు కార్మికులకు వెట్టిచాకిరిని మిగుల్చుతుందని తెలిపారు.విదేశీ విత్తన చట్టం ద్వారా వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు.పాతమహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని తిరిగి ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేసారు.కార్మికులను,ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీసవేతనం రూ26వేలు ఇవ్వాలని కోరారు.పోరంకి సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో అందరూ సమ్మెలో పాల్గొని నినాదాలు చేసారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ ఖాసిం,షేక్ మస్తాన్‌వలి, మండల కన్వీనర్ ప్రసన్నలక్ష్మి,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యనారాయణ,మైకేల్‌రాము,ఖాసిం వలి,వసంతరావు, షేక్‌బాబు,సింహాచలం ,కొండలబాబు,కార్మికులు పాల్గొన్నారు.




## గ్రామాన్ని స్వర్ణ గ్రామంగా నిలుపుతాం

**ఎ కొండూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామ పంచాయతీ సర్పంచచ్ మోర్ల లక్ష్మి సాంబశివరావుల ఆధ్వర్యంలో సెక్రటరీ, ఐ శివనాగమణి పారిశుధ్య కార్మీకులతో డ్రైన్లలో స్లీటింగ్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తు న్నారు. గ్రామంలో ఉన్న డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. అలాగే గ్రామంలో డ్రైనేజీల బాగుచేతవల్ల మురుగునీరు పారుదల జరుగుతున్నది. దీంతో గతంలో మురుగునీరు వల్ల దోమల బెడద ఏర్పడి ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. ఈ డ్రైన్ల బాగుచేత మురుగునీరు పారుదల వల్ల దోమల నివారణ కొంతమేర తగ్గిందని అలాగే డ్రైన్లలో బ్లీచింగ్ చల్లించడం జరుగుతుందని ఈ గ్రామాన్నిస్వర్ణ గ్రామంగా నిలుపుతారని సర్పంచ్ మోర్ల లక్ష్మి, సాంబశివరావు, సెక్రటరీ ఐ.శివనాగమణి గురువారం ప్రభాతవార్తకు తెలిపారు.



## బాల బాలికలకు చెస్, సైక్లింగ్ పోటీలు

**విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 12(ప్రభాతవార్త ) :** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ బాలబాలికలకు చెస్, సైక్లింగ్ లలో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 13, 15, 17, 19 విభాగాల్లో జిల్లా స్థాయి చెస్ పోటీలు ఈ నెల 17వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో, అండర్ 13, 15, 17, 19 విభాగాల్లో సైక్లింగ్ పోటీలు ఈ నెల 22వ తేదీన నున్నలోని జిల్లా పరిషత్ హైస్కూలులోనూ నిర్వహించనున్నట్లు తెలిపారు. చెస్ పోటీలలో ఎంపికైన బాల, బాలికలు ఈ నెల21వ తేదీన తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులని తెలిపారు. జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలలో గెలుపొందిన అభ్యర్థులు ఈ నెల 28, మార్చి 1వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులని తెలిపారు. అర్హత గల క్రీడాకారులు ఈ నెల 13 వతేదీ లోగా శాప్ వెబ్ సైట్ లో తమ ఆధార్ నెంబరుతో నమోదు చేసుకోవాలని సూచించారు.

## కంచికచర్లలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం

**కంచికచర్ల ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కంచిచర్ల పట్టణంలో కార్మిక సంఘాలైన సిఐటియు, ఐఎఫ్టియు సంఘా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మికులు వందేళ్లుగా పైగా పోరాటాలు చేసి అనేక త్యాగాలతో 29 కార్మిక




చట్టాలను సాధించుకుంది కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోళ్లను తెచ్చి 2025 నవంబర్ 21 నుండి అమలు చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. కార్మిక సంఘాలు కోట్లాదిమంది భారత కార్మిక వర్గం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిన పెద్ద ఎత్తున నిరసనలు తెలిపిన ఏమాత్రం పట్టించుకోకుండా ఈ లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మికులు తీవ్ర నష్టం కార్మికులు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులకి సంక్షేమ పథకాలు అమలు చేయాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కాంట్రాక్స్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో సిఐటియు - ఐఎఫ్టియు నాయకులైన జి హరికృష్ణ రెడ్డి, బెజ్జంభూషణం, గోపినాయక్, అంగన్వాడి పెండ్యాల సెక్టర్ కార్యదర్శి వేణు కుమారి, కంచికచర్ల సెక్టర్ మహాలక్ష్మి, ఆశా వర్కర్ రోజ్ మేరీ, పుల్లమ్మ, గోవిందమ్మ, భవన నిర్మాణ కార్మికులు మరిపూడి చిన్న ఇనుపనుర్తి విజయ, ఒంటిపులి సువర్ణ రాజ్, కాలవ వెంకటేశ్వరరావు, లిక్కిశెట్టి ఆంజనేయులు, బడేటి దాసు, తాడికొండ వీరయ్య, రావుపంచాయతీ కార్మికులు సుధాకర్, లక్ష్మి, జ్రాన సుందరి, విమలయ్య, కృష్ణ , గ్యాస్ కార్మికులు జాను, మహేష్, మౌలాలి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్, నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఓ ఆర్ ఆర్ రోడ్డు కోసం భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలి : వేమా సురేష్ బాబు

**కంచికచర్ల ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ఓ ఆర్ ఆర్ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా వేమా సురేష్ బాబు మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు ఐదు జిల్లా పరిధిలోని 190 కిలోమీటర్ల 140 మీటర్ల వెడల్పు రోడ్డు కోసం 250 మీటర్ల వెడల్పు రోడ్డు భూమిని సేకరించమేమిటని ఆయన ప్రశ్నించారు. రైతులకు సమాచారం తెలియజేయకుండా నోటిఫికేషన్ విడుదల చేయడం రైతులను మోసం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ఎక్కడైనా సరే రోడ్డు, ప్రాజెక్టులకు భూములు సేకరించే ముందు రైతులకు తెలియజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అమరావతి పూర్తి స్థాయిలో నిర్మాణం జరగలేదని ఇలాంటి పరిస్థితుల్లో ఇంత పెద్ద వెడల్పు రోడ్డు ఎవరి అవసరాల కోసం ఎవరి లాభాల కోసం ఇలాంటి రోడ్డు ఏర్పాటు చేసి రైతులకు నష్టం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రైతులకు ప్రస్తుత బహిరంగ మార్కెట్లో ఉన్న విలువ ప్రకారం నాలుగు రెట్లు ఎక్కువ నష్టపరిహారం చెల్లించాలనీ, ఓ ఆర్ ఆర్ రెడ్డు వెడల్పు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అమరావతి ఓ ఆర్ ఆర్ ప్రాజెక్టుకు కావలసినంత వరకు భూమి సేకరించాలి కాని అనవసరంగా సారవంతమైన విలువైన భూములు దుర్వినియోగం చేయడమేమిటని అన్నారు. 140 మీటర్ల వెడల్పు నుంచి 70 మీటర్లు వెడల్పు కు తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులకు అమరావతిలో ప్లాట్లు కేటాయించాలని, భూములు పై ఉన్న రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించని పక్షంలో భూసేకరణ నోటిఫికేషన్ వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా నిలిచి వాళ్ల పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తామని వారికి న్యాయం జరిగే వరకూ వాళ్ళకు పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు.





## చిన్న తరహా పరిశ్రమల భవన నిర్మాణాలకు సత్వర అనుమతులు

**విజయవాడ తూర్పు, ఫిబ్రవరి 12(ప్రభాతవార్త ) :** రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార సౌలభ్యాన్ని పెంచే దిశలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా చిన్నతరహా పరిశ్రమలు, సేవారంగ సంస్థలకు భవన నిర్మాణ అనుమతులను సత్వరం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందని జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల స్థాపనకు మరింత ఊతం ఇచ్చే కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని, చిన్నతరహా పరిశ్రమలు, సేవారంగ సంస్థలకు భవన నిర్మాణ ప్రణాళికల అనుమతుల దరఖాస్తులను పారిశ్రామిక సంస్థలతో సమానంగా పరిష్కరించడంతో పాటు మినహాయింపులు కూడా అదేవిధంగా ఉంటాయని జిల్లా పరిశ్రమల అధికారి తెలిపారు. పట్టణ అభివృద్ధి ప్రాధికార సంస్థలు (యూడీఏ), పట్టణ స్థానిక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలోని సేవారంగ చిన్నతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) ఉద్యమ్ పోర్టల్‌లో నమోదై ఉన్నట్లయితే ఈ వెసులుబాటు ఉంటుందని వివరించారు. ఆటోమొబైల్ సర్వీసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆరోగ్య సేవలు, లాజిస్టిక్స్, హోటళ్లు (20 గదుల వరకు), ఫంక్షన్ హాళ్లు, లాండ్రీడ్రై క్లీనింగ్ సేవలు, గోదాము సేవలు, పర్యాటక సేవలు వంటి సేవల కార్యకలాపాలకు సంబంధించిన ఎంఎస్ఎంఈలకు తాజా నిర్ణయం ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రయోజనాలను కచ్చితంగా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలకు వేగవంతమైన అనుమతులు, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం, పారిశ్రామిక అభివృద్ధిని విస్తృతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు.

## మహాశివరాత్రి వేడుకల ఆహ్వానపత్రిక అందజేత

**తిరువూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో 15న మహాశివరాత్రి జరగనున్న పర్వదిన వేడుకలు సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తిరువూరు మరియు గంపలగూడెం ఎస్సై వి.శాత కర్ణి, జి.అనిల్‌లకు ఆలయ ఛైర్మన్ జంగాల మురళి మున్సిపల్ కౌన్సిలర్ నాళ్ళ సురేంద్ర, ఆలయ ధర్మకర్త విశ్వనాథుని మాధవచారి జిల్లా ఆర్యవైశ్య వాణిజ్య విభాగం నాయకులు గుడిమెట్ల రాము, బొడ్డు శ్రీనివాసరావు'లు ఆహ్వానపత్రిక అందచేశారు.



## డ్రగ్స్‌పై దండయాత్ర అవగాహన ర్యాలీ జయప్రదం చేయాలి : ఎస్సై గంథం మహాలక్ష్ముడు

**ఎ కొండూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ (విజయవాడ) ఎస్‌వి రాజశేఖర్‌బాబు ఐపిఎస్ ఆదేశాల మేరకు ఎన్‌టిఆర్ జిల్లా రూరల్ జోన్ డిసిపి బి.లక్ష్మీ నారాయణ పర్యవేక్షణలో మైలవరం సబ్ డివిజన్ ఎసిపి వై.ప్రసాదరావు ఆధ్వర్యంలో తిరువూరు సిఐ కె.హరిబాబు, ఎ కొండూరు ఎస్సై గంథం మహాలక్ష్ముడు సిబ్బంది పోలీస్ శాఖ ఈ నెల 14న ఉదయం 9గంటలకు చీమలపాడు గ్రామంలో డ్రగ్స్‌పై దండయాత్ర ర్యాలీ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు కృష్ణారావుపాలెం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల / కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. 15న మధ్యాహ్నం 2 గంటలకు కంభంపాడు పట్టణంలో డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమం ర్యాలీ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొని ప్రజలను చైతన్యవంతం చేయాలని డ్రగ్స్ మాదక ద్రవ్యాల నిరూలనే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేసి డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని ఎస్సై జి.మహాలక్ష్ముడు కోరారు.

## లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి: వామపక్ష నేతలు

మాచర్ల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: కార్మిక వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలంటూ చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె మాచర్లలో




విజయవంతమైంది. కార్యక్రమానికి భారీగా కార్మికులు, అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి, సీపీఎం నాయకులు వి.సురేష్‌లు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు కార్మిక శ్రమను దోచిపెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఎంతోమంది ఉద్యమ నాయకుల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడంలో అర్థం లేదన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తేవడం వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కుతో సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి. కనీస వేతనం రూ.30 వేలు చెల్లించాలి. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, వీఓఏ, ఆర్పీ తదితర పథకాల వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మాచర్ల, దుర్గి సెక్రటరీలు మిద్దెపోగు బాబురావు, కాలా శివయ్య, సీపీఎం నాయకులు బండ్ల మహేష్, డి.గాలయ్య, కొనపర్తి బ్రహ్మం, చిన్న రామయోగి, చిన్న యేసు, కందుకూరి కిరణ్, గురులింగం, రమేష్, సురేష్, శ్రీను, లింగయ్య, కొండలు, సరళకుమారి, నిర్మల, మంగ, మాణిక్యం, ఇమాంబి, పద్మ, చిన్న రాములు తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పద భూమిని పరిశీలించిన తహశీల్దారు

మాచర్ల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు మాచర్లలో వివాదాస్పద భూమిని తహశీల్దారు కిరణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. మాచర్ల రెవెన్యూ క్లినిక్‌లో దాఖలైన అర్జీని పరిష్కరించడంలో భాగంగా సర్వే నెం.198లోని భూమిని మండల సర్వేయరుతో కలిసి విచారణ జరిపారు. భూమికి సంబంధించిన ఇరువర్గాల వారి దస్తావేజులను పరిశీలించారు.



నివేదికను కలెక్టరుకు విన్నవించనున్నట్లు తహశీల్దారు పేర్కొన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## దాడిలో గాయపడిన ఏపీఆర్‌జేసీ విద్యార్థికి దారునాయక్ పరామర్శ

విజయపురిసౌత్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా మాచర్ల మండలం నాగార్జునసాగర్ ఏపీఆర్‌జేసీలో గత సోమవారం రాత్రి విద్యార్థుల మధ్య జరిగిన దాడుల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం



విద్యార్థి జరపల వెంకటేశ్వర్లున్న నాయక్ కంటికి తీవ్రగాయమైన విషయం విదితమే. గుంటూరు శంకర కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి వెంకటేశ్వర్లు నాయక్‌ను వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం.ధారునాయక్ గురువారం ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు. విద్యార్థి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి కంటికి బలమైన గాయమైనందున వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం ఆయన విజయపురిసౌత్ మీడియాతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగిన ఏపీఆర్‌జేసీలో ఇలాంటి దుర్ఘటన జరగడం చాలా బాధాకరం అన్నారు. ఈ దుర్ఘటన కేవలం కళాశాల ప్రిన్సిపల్ నూతక్కి సరోజిని, వైస్ ప్రిన్సిపల్, ఇతర అధ్యాపకుల నిర్లక్ష్య వైఖరి వల్లే జరిగిందంటూ మండిపడ్డారు. కళాశాలలో అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా విఫలమైందని అసహనం వ్యక్తం చేశారు. వారిపై ఏపీఆర్‌ఈఐఎస్ సెక్రటరీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## 'లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి'


గురజాల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : కార్మిక, రైతు, పేద ప్రజలను దెబ్బతీసే విధానాలైన లేబర్ కోడ్‌లను తక్షణమే రదద్దు చేయాలని ఏఐటియూసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హుస్సేన్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం రైతు సంఘాల ఆధ్వర్యాన పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అరాచక విధానాలను తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వాలు నల్ల చట్టాలను అమలు చేసి రైతాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ



కార్మిక సంఘం జిల్లా నేత లక్ష్మేశ్వరరెడ్డి, సీఐటియూ నియోజకవర్గ నేత శ్రీనివాసరావు, స్కూల్ బస్సు యూనియన్ ప్రెసిడెంట్ జక్కా శ్రీనివాసరావు, అంబాపురం కార్యదర్శి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చింతపల్లి వైసీపీ గ్రామ కమిటీ ఎంపిక

కారంపూడి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: మండల పరిధిలోని చింతపల్లి గ్రామ వైసీపీ కమిటీలను పూర్తిచేసి మాచర్ల వైసీపీ కార్యాలయంలో అందజేసినట్లు కారంపూడి మండల వైసీపీ అధ్యక్షులు



కొంగర సుబ్రహ్మణ్యం, గ్రామ పరిశీలకులు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి గురువారం వెల్లడించారు. చింతపల్లి వైసీపీ అధ్యక్షునిగా ఉన్నం శంకర్, యువజన విభాగం అధ్యక్షునిగా చిరుమామిళ్ల రామకృష్ణ, రైతు విభాగం అధ్యక్షునిగా బొగ్గవరపు రామయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉమ్మినేని శివకుమారి, వలంటీర్స్ విభాగం అధ్యక్షునిగా కల్లూరి నాగేశ్వరరావు, ఎస్సీ విభాగం అధ్యక్షునిగా తాళ్లపోగు అమృతరావు, బీసీ విభాగం అధ్యక్షునిగా బత్తుల శ్రీను, మైనార్టీ విభాగం అధ్యక్షునిగా షేక్ సన్నాయి సైదుబాబు, సోషల్ మీడియా అధ్యక్షునిగా బత్తుల సైదారావు, విద్యార్థి విభాగానికి వసంత వెంకటేశ్వర్లును నియమించినట్లు తెలిపారు. నియమితులైన వారిని వైసీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## కారంపూడిలో ముగిసిన సార్వత్రిక సమ్మె

కారంపూడి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: అఖిల భారత సార్వరతిక సమ్మె కారంపూడిలో విజయవంతంగా ముగిసింది. బస్టాండ్ సెంటర్ నుంచి చెక్‌పోస్టు మీదుగా ఎన్టీఆర్ బొమ్మ బజారు నుంచి నాగులేరు వరకు భారీ ర్యాలీ నిర్వహించి నాగులేరు బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేశారు. ఈ ర్యాలీలో భారత కమ్యూనిస్టు పార్టీ, రైతు కూలీ సంఘం, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, సీఐటీయూ మొదలగు కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులకు, వ్యవసాయ కూలీలకు రైతులకు వివిధ వర్గాల వారికి వ్యతిరేకంగా చట్టాలను తీసుకొచ్చారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 రకాల చట్టాలను రద్దు చేసి ఇప్పుడు నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కారంపూడి మండల సీపీఐ కార్యదర్శి షేక్ సైదా, రైతు కూలీ సంఘం




నాయకురాలు జక్కంపూడి పద్మ, ఆశా వర్కర్ల నాయకురాలు అనురాధ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సీపీఐ నాయకులు కె.వెంకటశివయ్య, సూర్య హనుమంతరావు, ఎం.చిన్నకోటిరెడ్డి, కాల్వ శ్రీనివాసరావు, నూనె వెంకటేశ్వర్లు, పోతయ్య, బి.మల్లమ్మ, ఎస్‌కే సుభాని, ఆంజనేయులు, రైతు కూలీ సంఘం నాయకులు చింతపల్లి రామ్మూర్తి, కర్ణ సైదారావు, పాతూరు కోటిరెడ్డి, నంద కృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుహాసిని, సైదమ్మ, రమణ, శకుంతల, లక్ష్మీబాయి, ఆశ కార్యకర్తలు అనురాధ, పద్మ, విజయబాయి, యాకమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో ప్రధాన రహదారి



కారంపూడి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: కారంపూడిలోని ఎన్టీఆర్ బొమ్మ సెంటర్లో ప్రధాన రహదారి వద్ద ప్రమాదం పొంచుకొని ఉంది. ఇక్కడ నాలుగు పక్కల రాకపోకలు ఉంటాయి. బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్అండ్‌బీ రోడ్డు వేశారు కానీ మట్టి పోయలేదు. రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయకపోవడంతో సుమారు అడుగు ఎత్తు ఉన్న ప్రధాన రహదారి రోడ్డు దిగాలంటే వాహనాలు పడిపోతాయేమోనన్న ఆందోళన వాహనదారుల్లో నెలకొంది. అధికారులు స్పందించి రహదారికిరువైపులా మట్టి పోసి చదును చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సమర్పణ దివస్

యడ్లపాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త : యడ్లపాడు గ్రామం రచ్చబండ సెంటర్‌లో రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాలు మేరకు పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరు శశికుమార్ సూచనల మేరకు బీజేపీ పార్టీ మండల



అధ్యక్షులు తులాబందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సమర్పణ దివాస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకటేశ్వరరాజు మండల ఉపాధ్యక్షులు ఐలవరపు రామారావు మండల కార్యవర్గ సభ్యులు కొండ సాంబశివరావు దేసు సురేష్ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

# పల్నాడు జిల్లా వార్త



## కోటప్పకొండలో మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

### భద్రతా ఏర్పాట్లు, క్యూ లైన్లు, పార్కింగ్ ప్రదేశాల తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ

### భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశాలు

నరసరావుపేట ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ::జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటప్పకొండలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎస్పీ కృష్ణారావుతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని, భక్తుల క్యూ లైన్లను పర్యవేక్షి ంచి అధికారులకు పలు సూచనలు చేశారు. శివరాత్రి రోజున





ఆలయానికి తరలివచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీరు, నీడ, పారిశుధ్యం, పార్కింగ్ మరియు భద్రతా పరమైన అంశాల్లో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. శివాలయాన్ని కూడా సందర్శించి క్యూలైన్లను పరిశీలించారు. ఆలయ పరిసరాలు, కొండ మార్గాలు, క్యూ లైన్ల ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిరంతరంగా చేపట్టాలని, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక పారిశుధ్య బృందాలను నియమించాలని సూచించారు. అలాగే తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. మహాశివరాత్రి రోజున రాత్రి పూట భక్తులు కొండపైనే ఉండే అవకాశం ఉన్నందున, భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీసు, రెవెన్యూ, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకూడదని, లిఫ్ట్ సమస్యలు, ఇతర విద్యుత్ సమస్యలు తలెత్తితే పరిష్కరించేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. వేడుకలు ప్రశాంతంగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ, పోలీస్ శాఖ సమన్వయంతో ప్రజలకు సేవలు అందిస్తుందని, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా, సమన్వయం చేసుకొని ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధులత, ఆలయ ఈవో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'ఘంటసాల ది గ్రేట్" సినిమా దర్శకులు రామారావుకు సత్కారం

నరసరావుపేట ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : ఘంటసాల ది గ్రేట్ బయోపిక్ సినిమా చిత్ర దర్శకులు, చిత్తజల్లు రామారావు సత్కారం నిర్వహించారు. బుధవారం ఎస్ ఎస్ ఎన్ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఘంటసాల 52వ వర్ధంతి ని పురస్కరించుకొని విగ్రహం వద్దకు



పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమానికి నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ అరవింద బాబు ముఖ్యఅతిథిగా, పట్టణ ప్రముఖులు కపిలవాయి విజయ్ కుమార్, న్యాయవాది అయ్యపరాజు, మేళ్లచెరువు వీరాంజనేయులు, నాగసరపు సుబ్బరాయ గుప్త పాల్గొని మాట్లాడారు. శాసనసభ్యులు అరవింద్ బాబు స్పందిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఈ మంచి సినిమాకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానని ప్రకటించారు. కవి ఈవూరి వెంకటరెడ్డి సన్మాన పత్ర పద్యాలను పాడి వినిపించారు. రామారావు ప్రసంగిస్తూ, ఘంటసాల ప్రఖ్యాత సినీ నేపథ్య గాయకులే కాక, స్వాతంత్ర్య సమరయోధులన్నారు. సత్కరించిన నరసరావుపేట అభిమానులను మర్చిపోలేన న్నారు. మంచి చిత్రాల అభిమాన సంఘం నేతలు ఈదర గోపీచంద్ నాగ శిరోమణి దంపతులు రామారావు కు రూ. 50 వేల రూపాయల విరాళం చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖులు వంకాయలపాటి రవి, కేశవరావు, ఎం ఏ ఎం కళాశాల డైరెక్టర్ ఎంఆర్ శేషగిరిరావు, టైనీ టాట్స్ స్కూలు డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ మిట్టపల్లి రమేష్, ఏఎం రెడ్డి కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, జల్లి శ్రీనివాసరావు, గుబ్బా భారతి, చాంద్ బాబు, విశ్వేశ్వరరావు, సినిమా ప్రదర్శకులు మల్లికార్జున తదితరులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు.

## పూజారి పోస్టులను రూ.15 లక్షలకు అమ్ముకున్నారు

### -తిరుణాళ్ల ఏర్పాట్లంటే చీపురు పట్టి ఊడ్చడం కాదని ఎమ్మెల్యే తెలుసుకోవాలి

### -వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: : కోటప్పకొండ శైవక్షేత్రంలో పూజారి పోస్టులను15 లక్షల రూపాయలకు అమ్ముకోవడం తప్ప స్థానిక ఎమ్మెల్యే కోటప్పకొండలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఈనెల 15వ తేదీన జరగనున్న మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో జరుగుతున్న తిరుణాళ్ల ఏర్పాట్లను పరిశీలించి ఏమైనా లోపాలుంటే ప్రభుత్వానికి విన్నవించే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించిన డాక్టర్ గోపిరెడ్డి, విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఏకాదశి పర్వదినం అయిన ఇంతవరకు శంభులింగం చెరువుకు నీళ్లు పెట్టలేదని, ఏమని అడిగితే మరమ్మత్తులు పూర్తి కాలేదని సమాధానం చెబుతున్నారని తెలిపారు. ఈ చెరువు ద్వారానే అన్ని అన్నదాన సత్రాలకు నీళ్లు చేరతాయని ఇంతవరకు ఈ శంభులింగం చెరువును ఎన్ఎస్పి అధికారులు నీటితో నింపిన పాపాన పోలేదని తీవ్రంగా విమర్శించారు. చిలకలూరిపేట మరియు నరసరావుపేట నుంచి



కోటప్పకొండకు ఉన్న లింకు రోడ్లను ఎక్కడ బాగు చేయలేదన్నారు. ప్రభల తాకిడితో ట్రాఫిక్ స్తంభించిపోతే ఈ లింకు రోడ్ల ద్వారానే ట్రాఫిక్ క్లియర్ అవుతుందని ఈ విషయాన్ని అధికారులు ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. కోటప్పకొండ వెళ్లే ఘాట్ రోడ్డు మార్గం సైతం ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదని, ఇంతవరకు లెవెలింగ్ పనులు పూర్తి చేయలేదని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా జెడ్పీ ద్వారా రూ. 40 50 లక్షల నిధులు తీసుకొచ్చి ఈ రోడ్లన్నీ బాగు చేసే వాళ్ళమని తెలిపారు. కొండపైన పూల మొక్కలన్ని ఎండిపోయాయని, జింకలు బక్క చిక్కిపోయాయని ఫారెస్ట్ అధికారులు సంవత్సరానికి 60 లక్షల ఆదాయం ఉన్నప్పటికిని మొక్కలకు నీళ్లు సక్రమంగా అందించడం లేదని విమర్శించారు. ఆర్టీసీ అధికారులకు ఆర్టీసీ బస్సుల ద్వారా వచ్చే ప్రయాణికుల్ని ఎక్కడ దించాలి, ఎక్కడ ఎక్కించుకోవాలనే దానిమీద ఇంతవరకు క్లారిటీ లేకపోవడం శోచనీయమని. తిరుణాళ్ళ ఏర్పాట్లలో అధికారులు తీవ్ర నిరక్ష ్యంల వహిస్తున్నారని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా వచ్చిన విఐపి పాసుల సాంప్రదాయాన్ని నిలిపి ఆన్లైన్ ఏర్పాటు చేశారని, ఈ కోటప్పకొండ జాతర పేద ప్రజలకు సంబంధించినదని, వీరికి ఆన్లైన్ గురించి పెద్దగా తెలియదని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతిరోజు నాలుగున్నర గంటలకు ఒక బ్యాచ్ తో వచ్చి ఊడ్చిపోవడం తప్ప ఇక్కడ తిరుణాళ్ల ఏర్పాట్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. మనకు సక్రమంగా ఏర్పాటు చేయడం చేతకాకపోవటం వల్ల పక్క నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తిరుణాళ్ల ఏర్పాట్లు చేస్తాం అని మాట్లాడుతున్నారని అన్నారు. మన శాసనసభ్యునికి చేతకాకపోవటం వల్లే పక్క నియోజకవర్గాల వారు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తక్షణమే నరసరావుపేట ఎమ్మెల్యే తిరుణాళ్ల ఏర్పాట్లను సమీక్షి ంచాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే తిరుణాళ్లలో చీపుర్లు పట్టుకొని ఊడ్చడం కాకుండా తిరుణాళ్ల ఏర్పాట్లపై శ్రద్ధ పెట్టి అధికారులతో పనులు చేయించాలని తెలిపారు. ఈ మహాశివరాత్రి పండగ సందర్భంగా విచ్చేయుచున్న భక్తులందరూ సుఖ సంతోషాలతో జీవించాలని, రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించాలని, దర్శనానికి వచ్చిన ప్రతి భక్తుడు తమ కుటుంబాలతో క్షేమంగా ఇళ్లకు చేరేలని, తిరుణాళ్ళ విజయవంతంగా జరగాలని ఆ భగవంతుని ప్రార్థించారు. ఈ సందర్భంగా త్రికోటేశ్వర స్వామిని డాక్టర్ గోపిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## 'మీ ఇంటికి మీ డాక్టర్' ప్రాజెక్ట్ ఇంటర్వ్యూలు

నకరికల్లు ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : స్థానిక రెడ్ క్రాస్ భవనంలో గురువారం మీ ఇంటికి మీ డాక్టర్ అనే ప్రాజెక్ట్ కై మూడు సంవత్సరాల కాల పరిమితికి డాక్టర్, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్స్, డ్రైవర్ తదితర పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు రెడ్ క్రాస్ జిల్లా సెక్రెటరీ డాక్టర్ చంద్రశేఖరరావు తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కృతిక శుక్లా ఆదేశాల మేరకు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించామన్నారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ ఎం.ఆర్. శేషగిరిరావు, వైస్ చైర్మన్ కే.ఎం.ఎన్.వి. శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి డాక్టర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అభయ ఆంజనేయ స్వామి తిరుణాళ్ల

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12 ప్రభాత వార్త :: స్థానిక వినుకొండరోడ్డులోని శ్రీనివాసనగర్ లో వేంచేసియున్న అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయం 28 వ వార్షికోత్సవ తిరుణాళ్ల అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి అఖండ నామ సంకీర్తన చేశారు. ఆలయ అర్చకులు ఉదయ్ కిషోర్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రతమాలార్చన నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. తిరుణాళ్లకు భక్తులు పెద్దసంఖ్యలో



హాజరై, ముక్కుబడులు తీర్చుకొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు నగరోత్సవం నిర్వహించారు. తిరుణాళ్ళ వేడుకలో భాగంగా ఆలయం వద్ద విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షి ంచారు.

## ఆలయ నిర్మాణానికి రూ. 1,00,116 విరాళం అందజేత

నరసరావుపేట, ఫిబ్రవరి 12 ప్రభాత వార్త ::మండంలోని ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి గురువారం నరసరావుపేట వాస్తవ్యులు కొలిశెట్టి



శివశంకర్, వినోద దంపతులు, వారి కుమార్తె మయు, కుమారుడు ఈశ్వర్ లు రూ. 1,00,116 నగదును ఆలయ ఈఓ నలబోతు మాధవిదేవికి అందచేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బండ్లమూరి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. ఆలయ ఈవో మాధవి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు అందించే విరాళానికి సంబంధించి ప్రభుత్వం ఆదాయపు పన్ను మినహాయింపు ఇస్తుందన్నారు. దాతలకు అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

## నరసరావుపేటలో సమ్మె విజయవంతం

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త::కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్లు రద్దు చేయాలని, నూతన విత్తన చట్టం, విద్యుత్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని సిఐటి యు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతం అయింది. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం లోని పలు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, ఏపి డబ్ల్యూజెఎఫ్, యుటిఎఫ్, ఏపిటీఫ్ నాయకులు, స్కీమ్ వర్కర్లు నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డు లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయం వద్ద నుండి మల్లమ్మ సెంటర్ మీదుగా స్టేషన్ రోడ్డు లోని గాంధీ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరం వరకు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శన అనంతరం సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ మాట్లాడుతూ 100 ఏళ్ల క్రితం కార్మిక వర్గం దశాబ్ద కాలం పాటు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికుల హక్కులు కార్పొరేట్ లకు మోడీ తాకట్టు పెడితే చూస్తూ ఊరుకునేదిలేదని హెచ్చరించారు. ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ పని గంటలు పెంచడం వలన కార్మికుల జీవన ప్రమాణాలు తగ్గి పని భారంతో అనారోగ్యం భారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటియుసి రాష్ట్ర




నాయకులు నాగాంజనేయులు , సిపిఐ నాయకులు ఏ.మారుతి వరప్రసాద్, రైతు సంఘం నాయకులు ఉలవలపూడి రాము, ఎన్.జిఓ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాలు ఎం.రాజ్యలక్ష్మి ్మ, ఏపి డబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.నాగేంద్ర ప్రసాద్, యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. మోహనరావు, ఏపిటీఫ్ నాయకులు బి.సంపత్ బాబు, సిఐటియు నాయకులు డి శివకుమారి సిలార్ మసూద్ ఎం ఆంజనేయులు అనుబంధ కార్మిక సంఘాల నాయకులు కార్మికులు కార్యదర్శి కాసా రాంబాబు ఆంజనేయులు ఉప్పలపాటి రంగయ్య చక్రవర్తి సత్యనారాయణ రాజు ఎన్సీపీఐయు నాయకులు పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మానం సుబ్బారావు ఎన్జీవోస్ నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొని మోడీ నిరంకుశ విధానాలపై మాట్లాడారు. సిఐటియు, ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘాలు మున్సిపల్ కార్మికులు, ఆశా, అంగన్వాడి, వ్యవసాయ, జర్నలిస్ట్ సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## నిబద్ధతతో కూడిన విద్యతోనే మెరుగైన ఫలితాలు సాధ్యం: డాక్టర్ రేకపల్లి రాజశేఖర్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: : ప్రతి విద్యార్థి నిబద్ధతతో క్రమశిక్షణతో కూడిన విద్యతో మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చని, ప్రతి ఒక్కరు వారి యొక్క తల్లితండ్రుల ఆకాంక్షలకు కలలకు అనుగుణంగా కళాశాలలోని వసతులను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని



మంగళగిరి ఎయిమ్స్ న్యూరో సర్జన్ డాక్టర్ రేకపల్లి రాజశేఖర్ అన్నారు. నరసరావుపేట మండలం పెట్లూరువారిపాలెంలోని ఏ.ఎం.రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో గురువారం నూతన విద్యార్థుల వెల్కమ్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మంగళగిరి ఎయిమ్స్ న్యూరో సర్జన్ డాక్టర్ రేకపల్లి రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులుఅధునాతన టెక్నాలజీ మరియు పరిశోధనల పట్ల ఆసక్తి కనబరిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. తద్వారా భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలను మరియు సమాజంలో గుర్తింపును పొందుతారని సూచించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బి ఫార్మసీ విద్య తో ఫార్మా రంగంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు కలిగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. భార్గవ్ భూషణ్ రావు, అకాడమిక్ డీన్ డాక్టర్ ఏ పావని, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. మల్లికార్జునరావు, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. కృష్ణారెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## యడ్లపాడులో కార్మికుల సార్వత్రిక సమ్మె ర్యాలీ


యడ్లపాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం యడ్లపాడు సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద వివిధ వర్గాల కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ నేతలు మాట్లాడుతూ కార్మికులు బానిసలుగా చేసే




నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణ అపాలన్నారు. కనీస వేతనం 26వేలు చెలినంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్, వీబీ జీ రామ్ జీని రద్దు చేయాలన్నారు. 200రోజులు పని కల్పించి రోజుకు 600వేతనం ఇవ్వాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్‌కు అందజేసారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణ, నూతలపాటి ఖాళిదాసు, జరుగుల శంకర్, ముత్తవరపు పద్మారావు, కారుచోల రోశయ్య నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## 'కొండవీడు కోటకు ఆర్టీసీ బస్సుల ఏర్పాటు అవసరం ఉంది'

యడ్లపాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ముఖ్యంగా స్థానిక శాసనసభ్యులు ప్రతిపాటి పుల్లారావు మరియు పల్నాడు జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతిక శుక్లాల నేతృత్వంలో కొండవీడు ఉత్సవాలు గడచిన 7,8తేదీలలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో సాగాయి. ఎన్నడూ లేని విధంగా



పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు, కొండవీటి అభిమానులు కోటకు పోటెత్తారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ వారు చిలకలూరిపేట నుంచి నరసరావుపేట నుంచి అదే విధంగా మన ప్రాంతంలో పెద్ద నగరంగా వెలుగొందుతున్న గుంటూరు నుంచి కనీసం పండుగ రోజుల్లో, వారాంతాల్లో అంటే శని, ఆదివారాలు ఇతర ముఖ్యమైన దినాల్లో రోజుకు ప్రస్తుతానికి ఒక ట్రిప్ అయినా కొండవీడు కోటకు ఆర్టీసీ బస్సులు ఈ మూడు పట్టణాల నుంచి నిర్ణీత సమయాల్లో నడిపితే కచ్చితంగా వాహనం లేని వారు మరియు వాహన రద్దీ తగ్గించాలి అనే ఉద్దేశం ఉన్నవారు, ఆర్టీసీ బస్సుల్లో కొండవీడుకోటకు ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. పబ్లిక్ రవాణా సౌకర్యాన్ని ప్రజలకు అలవాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా ప్రతి ఒక్కరూ మోటార్ సైకిల్ నాలుగు చక్రాల వాహనాలు తీసుకొచ్చి రద్దీని పెంచడం, కాలుష్యాన్ని పెంచడం, అదేవిధంగా పార్కింగ్ సమస్యలు, ట్రాఫిక్ జాములు మున్నగు వాటిని నివారించడానికి ఆర్టీసీ బస్సుల ఏర్పాటు ఎంతో సముచితంగా ఉంటుంది కావున ఈ విషయంలో స్థానిక చిలకలూరిపేట శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు చొరవ తీసుకొని బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే బాగుంటుందని కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తన అశాబావాన్ని వెలుబుచ్చారు. అంతేకాకుండా ప్రాథమికంగా ప్రారంభించిన కొద్ది రోజులు ఆర్టీసీకి కొంత ఇబ్బందిగా ఉన్న ప్రయాణికులు లేక తరువాత అలవాటు పడి పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఉపయోగిస్తారు ఆర్టీసీ బస్సులు నడపడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం చూపించినట్లు అవుతుందన్నారు.



## వావిలాలనగర్‌లో అగ్నిప్రమాదం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని వావిలాలనగర్ లో అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధమైంది. సుమారు రూ. 3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా. ఇంట్లో బీరువాలోని సవిరిన్నర బంగారం, రూ.60 వేలు నగదు, టీవీ ,ఫ్యాన్ మొదలైనవి అగ్నికి ఆహుతయ్యాయి.

## గుడిపూడిలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన



సత్తెనపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో ఆయిల్ పామ్ సాగు పై రైతులకు అవగాహన సదస్సును ఉద్యాన శాఖ పల్నాడు జిల్లా మరియు గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన జిల్లా ఉద్యాన అధికారి ఐ. వెంకట్రావు మాట్లాడుతూ, ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీ గురించి వివరించడం జరిగింది. ప్రభుత్వం ద్వారా ఆయిల్ ఫామ్ మొక్కలు ఖరీదు పై 100 రాయితీ వస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో భాగంగా కంపెనీ నుండి వచ్చిన శాస్త్రవేత్త డాక్టర్ సుభాష్ సంజయ్ గారు మాట్లాడుతూ ఆయిల్ పామ్ అంటే నూనె పంట మరియు మార్కెట్లో ఎప్పుడు డిమాండ్ ఉన్న పంట ప్రతి సంవత్సరం ఒక లక్ష కోట్లు ఖర్చుపెట్టి విదేశాల నుండి 150 లక్షల టన్నుల వంట నూనెను దిగుమతి చేసుకుంటున్నారు, ఆయిల్ పామ్ సాగులో రైతులు పాటించ వలసిన మెళకువలు మరియు యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ కె నాని మాట్లాడుతూ సత్తెనపల్లి మండలంలోని దాదాపుగా 400 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగుకు రైతులను గుర్తించడం జరిగిందన్నారు అదేవిధంగా కంపెనీ ద్వారా ఆయిల్ ఫామ్ గెలల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఐ. వెంకట్రావు గారు, కంపెనీ శాస్త్రవేత్త డాక్టర్ సుభాష్ సంజయ్ , సత్తెనపల్లి మండలం తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు లగడపాటి గజానన, పి. ఎ. సి. స్. చైర్మన్ గద్దె అప్పారావు, గోద్రెజ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు కె. నానీ , ఐ. జగదీశ్ , రైతు సేవా కేంద్రం సిబ్బంది శాంతి శ్రీ , శంకర్ , ఆయిల్ పామ్ సాగు చేయు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనలతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1200 కోట్లు విడుదలకు కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కి విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. గత ప్రభుత్వం పెట్టి వెళ్ళిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి తెలుగు యువత తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సత్తెనపల్లి లో ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భట్రాజు కార్పొరేషన్ ఛైర్మెన్ సరికొండ వెంకటేశ్వర రాజు రాష్ట్ర తెలుగుయుత అధికార ప్రతినిధి వక్కంటి అజయ్ కుమార్ 13 వార్డ్ మాజీ కౌన్సిల్ పొట్ల ఆంజనేయులు క్లస్టర్ 2 చుక్కపల్లి శ్రీనివాసరావు నియోజకవర్గం తెలుగుయుత అధ్యక్షుడు మక్కపాటి రవిచంద్ర పార్లమెంట్ యువత ఉపాధ్యక్షుడు షేక్ వలి, వార్డు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సత్తెనపల్లిలో 'సార్వత్రిక సమ్మె' విజయవంతం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు, వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 ను పునరుద్ధరించాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గురువారం సత్తెనపల్లి పట్టణంలో విజయవంతం అయింది. ఈ సందర్భంగా పట్టణంలో భారీ కార్మిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన స్థానిక మార్కెట్






యార్డ్ నుండి బయలుదేరి తాలూకా సెంటర్, గడియార స్తంభం సెంటర్ మీదుగా తిరిగి తాలూకా సెంటర్ కు చేరుకుంది. సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాలూకా సెంటర్లో జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని మోడీ అధికారం చేపట్టిన నాటినుండి రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను, దేశ సార్వభౌమాధికారం అధికారం దెబ్బతీన్నారని అన్నారు. అమెరికాతో మోడీ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం దేశ ఆర్థిక వ్యవస్థ దివాలా తీసే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన ఈ సార్వత్రిక సమ్మె సందర్భంగా కార్మిక, కర్షకులలో వచ్చిన తీవ్రమైనటువంటి వ్యతిరేకితను మోడీ ఇప్పటికైనా గుర్తించి కళ్ళు తెరవాలని అన్నారు. ఇప్పటికైనా రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా అగ్రహాన్ని మోడీ ప్రభుత్వం చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి శివ నాగరాణి, సిఐటియు మండల కార్యదర్శి పి మహేష్, ఏపీ జేఏసీ చైర్మన్ పి మణిరావు, ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ, డి విమల, రైతు సంఘం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య, ప్రజానాట్యమండలి నాయకులు పొట్టి సూర్యప్రకాశరావు, దుగ్గి నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు డి అమూల్య, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సుజాత, అహల్య, భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కోట ఆంజనేయులు యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు ఠాగూర్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పి రామకోటయ్య, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పలనాడు జిల్లా అధ్యక్షులు వి చంద్రకళ, చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మాం ,ఏఐటియుసి సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షులు, కంబాల శ్రీనివాస్, సి పి ఐ పట్టణ కార్యదర్శి వి లక్ష్మి చెన్నకేశవరావు, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి ఈ సి రెడ్డి అంజిరెడ్డి, ఆర్ శేషయ్య. యూనియన్ నాయకులు చిలక జిప్సంన్. నర్రా కోటేశ్వరరావు. డి శ్రీనివాస్. డి శంకర్. నాగేష్. . ప్రధీప్ చంద్ర. ఆటో డ్రైవర్. కార్మికుల పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆటో కార్మికుల నిరసన

సత్తెనపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా సమ్మెకు మద్దతుగా పల్నాడు జిల్లా సత్తనపల్లి పట్టణంలోని అమరావతి బస్సు పాయింట్ వద్ద గల ఆటో స్టాండ్ వద్ద ఏపీ ఆటో డ్రైవర్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆటో కార్మికుల నిరసన



వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటియుసి సత్తనపల్లి డివిజన్ అధ్యక్షులు, కంబాల శ్రీనివాస్. సి పి ఐ పట్టణ కార్యదర్శి వి లక్ష్మీ చెన్నకేశవరావు యూనియన్ నాయకులు చిలక జిప్సంన్. నర్రా కోటేశ్వరరావు. డి శ్రీనివాస్. డి శంకర్. నాగేష్. అంజిరెడ్డి. ముసలయ్య. ఆటో డ్రైవర్. కార్మికుల పాల్గొన్నారు

## మానవత్వం చాటుకున్న జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి



సత్తెనపల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: పాత తండా కు చెందిన ధరావత్ స్వామి నాయక్ తండ్రి దరావత్ ధర్మనాయక్ గుండె పోటుతో చిన్న వయసు లోనే మరణించిన విషయం తెలుసుకున్న వలేటి కుమారి వెంటనే అక్కడకు వెళ్ళిభౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఆ కుటుంబ పేదరికం చూసి చలించి రూ. 5,000మృతుడు భార్య లావణ్య కు అందించి ఆమెను ఓదార్చారు. మృతుడు కు నాలుగు సంవత్సరాల పాప ఉన్నది. వలెటి కుమారి చేసిన ఆర్థిక సహాయం ను చూసి ఆమె స్పందించిన తీరు కు పలువురు అభినందించారు.

# పల్నాడు జిల్లా వార్త



## రంగస్థలంపై నవ వసంతం - విశ్వవేదికపై తెలుగు నాటక వైభవం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: సరిహద్దులు చెరిపేసి, ఖండంతరాలు దాటిన నాటక ఖ్యాతి గుంటూరు గడ్డపై నూతన చరిత్రను లిఖించింది. దశాబ్దాలుగా ఉత్తరాదికే పరిమితమైన జాతీయ నాటకోత్సవాలను ఆంధ్రుల చెంతకు చేర్చి, తెలుగు నాటకరంగానికి అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టిన ఈ వేడుకలు ఒక సామాజిక విప్లవంలా సాగాయి. మరుగున పడుతున్న కళలకు ప్రాణవాయువును అందిస్తూ, తెలుగు రంగస్థలం విశ్వవ్యాప్తం కావడానికి ఈ మహోత్సవం ఒక గట్టి పునాది వేసింది. దక్షిణాదికి అందిన అరుదైన గౌరవంగత 24 ఏళ్లుగా ఢిల్లీ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా నిర్వహించే భారత్ రంగ్ మహోత్సవ్ కేవలం దేశ రాజధాని చుట్టుపక్కల ప్రాంతాలకే పరిమితమైంది. దక్షిణ భారతదేశానికి, ముఖ్యంగా నవ్యాంధ్ర రాజధానిలోని అమరావతి ప్రాంతంలో ఈ అంతర్జాతీయ వేదికను తీసుకువచ్చిన ఘనత వేదిక (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం) అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబుకే దక్కుతుంది. గత ఆరు నెలలుగా ఆయన సాగించిన అచంచలమైన కృషి, ఎన్నో వ్యయప్రయాసల ఫలితంగానే నేడు గుంటూరు గడ్డపై అంతర్జాతీయ కళాకారుల పాదముద్రలు పడ్డాయి. ఇప్పటివరకు జరిగిన ఉత్సవాల్లో ఇవే అత్యంత భారీస్థాయిలో, అత్యంత క్రమశిక్షణతో నిర్వహించినవని స్వయంగా ఎన్ఎస్డీ ప్రతినిధులే కితాబు ఇవ్వడం తెలుగు వారందరికీ గర్వకారణం. భాషా భేదాలు చెరిపేసిన ర సహృదయంరష్యా, పోలాండ్ వంటి దేశాల నుంచి.. మణిపూర్, కర్ణాటక వంటి రాష్ట్రాల నుంచి వచ్చిన వైవిధ్యభరితమైన నాటకాలు పంచభూతాల సాక్షిగా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. భాష తెలియక పోయినా, భావ వ్యక్తీకరణతో హృదయాలను తాకవచ్చని ఈ ఐదు రోజుల ప్రదర్శనలు నిరూపించారు. కేవలం వినోదం మాత్రమే కాక, సామాజిక స్పృహను రగిలించి, సమాజానికి దర్పణం పట్టే నాటక కళ.. ఓటీటీలు, సినిమాల హోరులోనూ తన అస్తిత్వాన్ని ఎలా నిలబెట్టుకోగలదో ఇక్కడ రుజువైంది. విశ్వవ్యాప్త దిశగా తెలుగు నాటకంఈ ఉత్సవాల ప్రభావం కేవలం ప్రదర్శనలతోనే ముగిసిపోలేదు. తెలుగు నాటక రచయితలు, కళాకారులు, సాంకేతిక నిపుణుల ఆలోచనా ధోరణిని ఇది అంతర్జాతీయ స్థాయికి మళ్లించింది. మన నాటకాలు కూడా ప్రపంచ వేదికలపై ప్రదర్శితమయ్యేలా తమ పరిధిని విస్తృతం చేసుకోవాలనే ఆకాంక్ష కళాకారులలో చిగురించింది. తెలుగు నాటక రంగానికి జీవం పోస్తున్న 60 మంది కళాపరిషత్ నిర్వాహకులను గౌరవించుకోవడం, వెయ్యి మందికి పైగా చిన్నారులు గజ్జె కట్టడం భవిష్యత్తుపై ఆశలను రేకెత్తిస్తోంది. ఎన్ఎస్డీ చాప్టర్ అక్షరాలా ఒక కల సాకారంఈ మహోత్సవాల వెనుక ఉన్న అసలు లక్ష్యం అమరావతిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా విభాగాన్ని ఏర్పాటు చేయడం. సురేష్‌బాబు సంకల్పానికి ప్రభుత్వం నుంచి కూడా సానుకూలత లభించడం శుభపరిణామం. ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, గల్లా మాధవి, మొహమ్మద్ నశీర్ అహమ్మద్ మద్దతు ఇస్తామని వేదిక ద్వారా వెల్లడించడంతో పాటు స్థల కేటాయింపుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ప్రకటించడం విశేషం. తెలుగు అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ వంటి వారు దీని ఆవశ్యకతను వివరించడం, ఇందుకు ప్రజాప్రతినిధులు, కళారంగ ప్రముఖులతో కమిటీని సిద్ధం చేయాలని సురేష్‌బాబును ప్రేక్షకుల సాక్షిగా సూచించడం జరిగింది. ప్రపంచ యవనికపై ప్రజ్వరిల్లనున్న తెలుగు నాటక రంగంఈ కేంద్రం గనుక ఏర్పాటు అయితే, తెలుగు యువతకు నాటక విద్యలో పాటు తెలుగు నాటకరంగం పరిధి అనంతంగా వికసించనుంది. ఇప్పటికే ఎన్ఎస్డీ నాటక విద్య మూడేళ్ల కోర్సు రాష్ట్రంలో అందుబాటులోకి తెచ్చేందుకు అనుమతిని సైతం ఇవ్వడం గమనార్హం. ఇది తెలుగు రంగస్థల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది. అంపశయ్యపై ఉన్న నాటక కళకు ఈ ఐదు రోజుల పండుగ పునర్వైభవాన్ని ప్రసాదించింది. కళామతల్లి ఆనందబాష్పాలు రాల్చేలా జరిగిన ఈ ఉత్సవాలు, తెలుగు నాటకం ఆధునిక సాంకేతికతను జోడించుకుని ప్రపంచంతో పోటీ పడేందుకు దారి చూపాయి. ఈ జైత్రయాత్ర కేవలం ముగింపు కాదు.. తెలుగు నాటక రంగం ప్రపంచ యవనికపై అగ్రస్థానానికి చేరుకోవడానికి పడిన మొదటి అడుగు.




















## సుభాని నగర్ షాదీఖానా ఆధునీకరణ పనులకు రేపు శంకుస్థాపన

### ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో రూ. 30 లక్షల నిధులు మంజూరు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: స్థానిక చిలకలూరిపేట పట్టణంలోని సుభాని నగర్ మైనార్టీ కమ్యూనిటీ హాల్ (షాదీఖానా) రూపురేఖలు మారనున్నాయి. ఈ కమ్యూనిటీ హాల్ ఆధునికీకరణ కోసం స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక చొరవతో 30 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించారు. ఈ అభి వృద్ధి పనుల శంకు స్థాపన మరియు ప్రత్యేక దువా కార్యక్రమం ఈనెల 14వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నారు. ఏర్పాట్ల పరిశీల నశంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్ మరియు టీడీపీ మైనార్టీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కమ్యూనిటీ హాల్ వద్ద జరుగుతున్న పనులను పర్యవేక్షించి, కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. పాల్గొన్న నాయకులు మోలాలి కౌన్సిలర్, మరియు వార్డు పెద్దలు, ఖాజా హుస్సేన్, రియాజ్, కరీం, బాజీ, బుజ్జి, కరములు స్థానిక టీడీపి మైనార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు, వార్డు ప్రజలు మరియు అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధిలో భాగంగా మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## డిఎల్ఈసి సమావేశంలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ 'మక్కెన'



వినుకొండ, ఫిబ్రవరి12, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నందు డిఎల్ఈసి సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో బ్యాంకు చైర్మన్‌మక్కెన మల్లికార్జునరావు, సీఈఓ ఫణి కుమార్, డీసీవో వీరాచారి, ఆప్కాబ్ ధనుంజయులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో బ్యాంకు పురోభివృద్ధికి చెందిన వివిధ అంశాలపై చర్చించారు.

## స్వచ్ఛసర్వేక్షణ్‌పై మెప్మా,సచివాలయ సిబ్బందికి శిక్షణ

వినుకొండ, ఫిబ్రవరి12, ప్రభాతవార్త: స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వినుకొండ మునిసిపాలిటీ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్స్, పర్యావరణ కార్యదర్శులు, ప్రజారోగ్య కార్యదర్శులు, మేస్త్రీలు వివిధ విభాగాలకు చెందిన సచివాలయ సిబ్బందికి వినుకొండ పురపాలక సంస్థ



కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఒక్కరోజు పూర్తిస్థాయి శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, డోర్ టు డోర్ వ్యర్థాల సేకరణ, ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం, శుభ్రత ప్రమాణాలు, స్వచ్ఛసర్వేక్షణ్‌లో వినుకొండ పట్టణ ర్యాంకింగ్ మెరుగుపరచడం వంటి అంశాలపై నిపుణుల బృందం సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ షేక్ షకీలా దస్తగిరి, మున్సిపల్ కమిషనర్ కె. శివరామ్ ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ ,మేనేజర్ అర్జున్‌తదితరులు పాల్గొన్నారు.

## వినుకొండలో ఐఐఎఫ్ఎల్ గోల్డ్ ఫైనాన్స్‌ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు

వినుకొండ, ఫిబ్రవరి12, ప్రభాతవార్త: పట్టణంలోని లాయర్స్ స్ట్రీట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐఐఎఫ్ఎల్ గోల్డ్ ఫైనాన్స్ బ్రాంచ్ గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎంఎన్ ప్రసాదు, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, పార్టీ నాయకులు తుమ్మ వెంకటరెడ్డి పాల్గొని





ప్రారంభించారు. అభివృద్ధి చెందుతున్న వినుకొండ పట్టణంలో ఇలాంటి సంస్థలు రావడం అభినందనీయమన్నారు. ఐఐఎఫ్ఎల్ ప్రతినిధి ఫణి సూర్య మాట్లాడుతూ ఇతర కంపెనీలతో పోల్చుకుంటే తమ వద్ద వడ్డీ రేట్లు తక్కువని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులు ఎన్. శ్రీనివాసరావు, ఏరియా మేనేజర్ రాంప్రసాద్, స్థానిక మేనేజర్ ఆల బలారాం తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.సి.యం పాఠశాలలో వార్షిక తనిఖీ

పెదకూరపాడు, ఫిబ్రవరి12 , ప్రభాతవార్త: ఎయిడెడ్ పాటిబండ్ల పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు వై. ప్రసాద్ రావు సత్యనారాయణ వార్షిక తనిఖీ గురువారం నిర్వహించారు. పాఠశాలలోని అన్ని రిజిస్టర్, రికార్డ్స్ మరియు విద్యార్థుల విద్యాస్థాయి, 75 రోజుల జి ఎఫ్ ఎల్ ఎన్ యాక్షన్ ప్లాన్, ఎస్ ఆర్ కె వి ఎం ఎక్విటెన్స్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వాటి అన్ని రికార్డ్స్, అసెస్మెంట్ బుక్లెట్స్ అడ్మిషన్స్, యు డైస్ ప్లస్ ఆన్లైన్ రోల్, విద్యార్థుల ప్రగతి, అన్ని రిజిస్టర్లు పరిశీలించారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు సిస్టర్ విజయ రాణి ఉపాధ్యాయురాలు శ్రీమతి. కేశవ కుమారి, మేరీ పాలిన్ జత్రుత క్లస్టర్ రిసోర్స్ టీచర్స్ జి .జ్యోతి .శివ, ఆఫీసు సిబ్బంది ఎన్. జయప్రకాష్ ఎన్. సాంబశివరావు పాల్గొన్నారు.



## చివరి భూమి వరకు నీరు అందేలా చర్యలు



పెదకూరపాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: ఆయకట్టు పొలాలకు సాగునీరు అందేలా డిసి చైర్మన్ తగు చర్యలు తీసుకున్నారు. నీరు వృధా గా పోకుండా కంట్రోల్ చేసుకుంటూ వచ్చారు. రైతులకు నీటిని వృధా చేయకుండ మీ పొలాలను తడుపుకోవాసిందిగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు రైతులకు తెలిపారు. ఇరిగేషన్ సెక్షన్ ఏఈ పి. చిరంజీవి రెడ్డి బుచ్చయ్య పాలెం రైతు పాలడుగు శ్రీధర్, హుసేన్ నగర్ రైతులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేటలో కార్మిక, ప్రజా సంఘాల ర్యాలీ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: చిలకలూరిపేట స్థానిక కార్మిక, కర్షక, ఉద్యోగ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన జరిగింది. పట్టణంలోని ఎన్. ఆర్. టి సెంటర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ, ప్రధాన వీధుల గుండా సాగుతూ కళామందిర్ సెంటర్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. వందలాది మంది కార్మికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ డిమాండ్ల సాధనకై నినదించారు. సిఐటియు (ది।గిగే), ఎఐటియుసి (తి।గిగేది) మరియు ఇతర సంఘాల నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై మండిపడుతూ కార్మికుల హక్కులను హరించేలా ఉన్న కొత్త లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాన్ని రూ. 26,000లకు పెంచాలి. 12 గంటల పని విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం చేకూర్చే 2025 విత్తన చట్టాన్ని రద్దు చేయాలని వారు కోరారు.



## ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 77వ ఆవిర్భావ దినోత్సవం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 77వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఓల్ సబ్ డివిజన్ కార్యాలయం ప్రాంగణంలో ఘనంగా జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎం కోటేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి కె. వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షులు మాట్లాడుతూ 1104 యూనియన్ వేలాది విద్యుత్ కార్మికుల హక్కుల సాధన, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం దశాబ్దాలుగా పోరాడుతూ కార్మికులకు కామధేనువుగా నిలిచిందన్నారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా కార్మికుల శ్రేయస్సు కోసం ఏర్పడిన సంఘమని గుర్తుచేశారు. గత త్యాగాల ఫలితంగానే నేటి హక్కులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్ల కోర్టు విషయమై కూడా సభ్యులకు వివరాలు తెలియజేశారు.



## 'గోపిదేశి'కి మర్రి రాజశేఖర్ నివాళి



చిలకలూరిపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: పట్టణ 8వ వార్డు నివాసి, ప్రజా సేవలో సీనియర్ నాయకులు గోపిదేశి సుబ్బారావు (లైట్లు సుబ్బారావు) మృతిచెందారు. ఈ విషయం తెలుసుకొని వారి స్వగృహం నందు ఉన్న వారి పార్థివ దేహానికి శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట సయ్యద్ హిదాయితుల్లా, ఈశ్వర్ రెడ్డి, శంకర్ , లింగాల విజయ్ యాదవ్ తదితరులున్నారు.

## ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో వితరణ



చిలకలూరిపేట, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలోచైర్మన్ విజిట్ సందర్భం గా నిరుపేద మహిళ కు కుట్టు మెషిన్, ఎన్టీఆర్ స్కూల్ నందు గల గవర్నమెంట్ ప్రైమరీ స్కూకి, సుగాలి కాలనీ నందు గల గవర్నమెంట్ హైస్కూల్ కు 3టేబుల్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో డిస్ట్రిక్ట్ చైర్మన్ . స్వర్ణలత, ప్రెసిడెంట్, సెక్రటరీ, పాస్ట్ ప్రెసిడెంట్స్, మెంబర్స్ పాల్గొన్నారు.

13-2P8exHMNWJQE 8 VJA_13-2P8exHMNWJQE.qxd 12/Feb/26 11:58 PM Page 1



# అమెరికా వాణిజ్య ఒప్పందంతో తెలంగాణ రైతాంగానికి తీవ్రనష్టం

## రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** అమెరికాతో తాజా వాణిజ్య ఒప్పందం ద్వారా భారత మార్కెట్లోకి ద్వారాలు తెరిస్తే ఎక్కువ సబ్సిడీలు పొందుతున్న చౌకగా ఉండే ఆ దేశ వ్యవసాయ ఉత్పత్తులు ఇక్కడి మార్కెట్లను ముంచెత్తి, రైతుల జీవనోపాధిని దెబ్బతీసే ప్రమాదం ఉందని తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వ్యవసాయరంగం దయనీయ స్థితిలో ఉందని, ప్రకటించిన కనీస మద్దతు ధర కన్నా 30 నుంచి 40 శాతం తక్కువ ధరకు రైతులు తమ పంటలను అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశ పంట దిగుబడులను అమెరికాకు ఎగుమతి చేస్తే అనేక కారణాలు చెప్పి తిరస్కరించే ప్రమాదం ఉందన్నారు. కానీ అమెరికా మాత్రం ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా భారత్‌కు వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతిచేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని సమీక్షిం చుకో వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఎస్ రామకృష్ణారావు, జయేషన్‌రంజన్ తదితరులు

# మౌలిక వసతుల బలోపేతానికి చర్యలు

## సైబరాబాద్ కార్పొరేషన్‌లో సిఎస్ సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) తొలి స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గురువారం మాదాపూర్ నాక్ బిల్డింగ్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ కార్పొరేషన్ పరిధిలోని పరిశుభ్రత, ఇంజినీరింగ్ తదితర పౌర సేవలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. సేవల మెరుగుదలకు, పట్టణ మౌలిక వసతుల బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశం చారు. సమావేశంలో సీఎంసీ ప్రత్యేకాధికారి జయేష్ రంజన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, వాటర్ బోర్డు ఎండి కె. అశోక్ రెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

# మేడారంలో విజయవంతంగా మహిళా సంఘాల వ్యాపారం

## 6 కోట్ల పెట్టుబడితో 3 కోట్ల 10 లక్షల లాభం

### ములుగు జిల్లా స్వయంసహాయక సంఘాల మహిళల రికార్డు: మంత్రి సీతక్క హర్షం

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** ఇందిరా మహిళా శక్తి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రోత్సాహంతో మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో మహిళా సంఘాలు విజయవంతంగా పలు వ్యాపార, వాణిజ్య కార్యక్రమాలు నిర్వహించాయని తెలంగాణ గ్రామీణాభివృద్ధిశాఖ ప్రకటించింది. జాతరలో స్వయంసహాయక సంఘాల మహిళలు మొత్తం 565 వ్యాపార కార్య కలాపాలను నిర్వహించారు. మొత్తం రూ.603.30కోట్ల పెట్టుబడి పెట్టారు. ఈ పెట్టుబడితో మొత్తం రూ.9కోట్ల 12లక్షల రూపాయల 68వేల రూపాయల ఆదాయం రాగా అందులో పెట్టుబడిగా పెట్టిన రూ.6కోట్ల 3లక్షల30వేలు పోను మొత్తం రూ.3కోట్ల 9లక్షల 38వేల లాభం సమకూరింది. ములుగు జిల్లాలోని అన్ని మండలాల స్వయం సహాయక సంఘాల మహిళలకు మేడారం జాతరలో ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యాపారం నిర్వహించే అవకాశం కల్పించారు. దీంతో జిలాల్లోని 10 మండలాల ఎస్‌హెచ్‌జీ మహిళలకు వ్యాపార అవకాశాలు జాతరలో లభించాయి. స్వయం సహాయక సంఘాల మహిళలు మేడారం జాతరలో విజయవంతంగా వ్యాపారం చేసి పెద్ద మొత్తంలో లాభం సంపాదించడంపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

# టిజి సెట్-2026 హాల్‌టికెట్లు విడుదల

## 22న ప్రవేశ పరీక్ష.. సెట్ చీఫ్ కన్వీనర్ కృష్ణఆదిత్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయడానికి నిర్వహించే టిజి కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజి సెట్)-2026 హాల్ టికెట్లను విడుదల చేశారు. టిజి సెట్-2026 హాల్ టికెట్లను గురువారం నుంచే అభ్యర్థులకు అందుబాటులో ఉంచినట్టు టిజి సెట్-2026 చీఫ్ కన్వీనర్, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ఎస్ కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది టిజి సెట్‌కి 1.812,061 దరఖాస్తులు వచ్చాయి.

గతేడాది కంటే ఈ ఏడాది దరఖాస్తులు ఎక్కువ వచ్చాయి. టిజి సెట్-2026 ద్వారా టిజిఎస్‌ఆర్‌డబ్ల్యూఆర్, టిజిటిడబ్ల్యూ ఆర్, ఎంజెపిటిబిసిడబ్ల్యూఆర్, టిఆర్‌ఈఐ సొసైటీల్లో 5వ తరగతితోపాటు ఆయా సొసైటీల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్టికెట్లను ఈ నెల 22 వరకు డౌన్లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు నమోదు చేసుకున్న మొబైల్ నంబర్లకు ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

అభ్యర్థులు హాల్ టికెట్లను ముందుగానే డౌన్‌లోడ్ చేసుకొని, ప్రవేశ పరీక్షకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని కృష్ణ ఆదిత్య సూచించారు. ఈ నెల 22న అన్ని జిల్లాల్లో ఉదయం 5వ తరగతిలో ప్రవేశాలకు .. మధ్యాహ్నం 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిపోయిన సీట్లలో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు.

# జీవన ప్రమాణాలు పెంచేలా బడ్జెట్ ప్రతిపాదనలకు చర్యలు

## విజన్-2047 లక్ష్యానికి అనుగుణంగా రవాణా శాఖ, ఆర్‌టిసి కార్యాచరణ: మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** జీవన ప్రమాణాలు పెంచేలా బడ్జెట్‌లో బీసీ సంక్షేమ శాఖ ప్రతిపాదనలు ఉండేలా చర్యలు తీసుకోనున్నామని, విజన్-2047 లక్ష్యానికి అనుగుణంగా రవాణా శాఖ, ఆర్‌టిసి కార్యాచరణ ఉంటుందని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో కేటాయింపులు, విడుదలైన నిధులు, చేసిన ఖర్చులు ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలపై బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం వేరు వేరుగా సమీక్షా సమావేశం నిర్వహించారు.

బీసీ సంక్షేమ శాఖలో 2025-26లో బడ్జెట్ కేటాయింపులు నిధుల విడుదల విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, హాస్టల్ నిర్వహణ, స్టడీ సర్కిల్ ల్లో శిక్షణ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్, కళ్యాణ లక్ష్మి, రజక, నాయి బ్రాహ్మణల ఉచిత విద్యుత్, కాటమయ్య రక్షణ కవచాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పథకాలకు నిధుల విడుదలలో ఇబ్బందులు లేవని సక్రమంగా లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.

2026-27 బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలు, ప్రతిపాదనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. బలహీన వర్గాలకు జీవన ప్రమాణాలు, ఆర్థికవృద్ధి సాధించేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టాలని డిప్యూటీ సీఎం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో జరుగుతున్న బడ్జెట్ సన్నాహక సమావేశంలో ఈ అంశాలపై చర్చించాలని అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రవాణా శాఖ ఆర్టీసీలో విజన్-2047కి అనుగుణంగా చేర్చిన అంశాలపై కార్యచరణ ముందుకు తీసుకోవాలని సూచించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో రవాణా శాఖలో స్థలాలు ఉండి కార్యాలయాలు లేని వాటికి సొంత భవనాలు నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

ఆర్టీసీలో పెండింగ్ అంశాలు, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగ నియామకాలు అంశాలపై చర్చించారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ శ్రీధర్, ఎంజేపి సెక్రటరీ సైదులు, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

# తండ్రి అడుగు జాడల్లో అనన్య

## మున్సిపల్ ఛైర్మన్ పీఠం ఎక్కనున్న స్పీకర్ కూతురు

### తండ్రికి తగ్గ తనయ అంటూ ప్రశంసలు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అనన్య

**వికారాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** మున్సిపల్ చైర్మన్ పీఠం గడ్డం అనన్య అధిరోహించనున్నారు. వాగ్ధాటితో పట్టణ ఓటర్లను అతి తక్కువ కాలంలో ఆక ట్టుకున్నారు. కొత్త వారిని సైతం ఆప్యాయంగా పలుకరిస్తూ ఎన్నికల్లో తనదైన శైలిలో ఆకట్టుకుని ఓటర్ల మనస్సులను చూరగొన్నారు. ఈ అమ్మాయి ఎవరంటూ పలువురు ఓటర్లు ఆరా తీయగా.. మన ప్రసాదన్న కూతురు గడ్డం అనన్య అని తెలుసుకున్నారు. తండ్రికి తగ్గ తనయా..అంటూ ప్రశంసలు కురిపించారు. వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు గడ్డం అనన్య బరిలో దిగారు. గడ్డం ప్రసాద్‌కుమార్ మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ప్రస్తుతం అసెంబ్లీ స్పీకర్ పదవిలో కొనసాగుతున్నారు. దీంతో అనన్య రాజకీయం వారసత్వాన్ని తండ్రి నుంచి పునికిపుచ్చుకున్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో అరంగేట్రం చేశారు. చైర్మన్ అభ్యర్థిగా 17వ వార్డు నుంచి పోటీలో నిలిచారు. గడ్డం అనన్య తీగల కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యను అభ్యసించారు. ఆమె తల్లి గడ్డం శైలజ ఐదేళ్ల క్రితం కన్ను మూయడంతో అన న్య తీవ్ర మనోవేద నకు గురయ్యారు. అనన్యను తండ్రి గడ్డం ప్రసాద్‌కుమార్ తన వెంట తీసుకువెళ్తూ.. రాజకీయంగా ప్రజలకు పరిచయం చేశారు. ప్రజలకు చేరువ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తండ్రి గడ్డం ప్రసాద్‌కుమార్ గెలుపు కోసం ఎన్నికల ప్రచారం నిర్వహించి అహర్నిశలు శ్రమించారు. ప్రసాద్‌కుమార్ గెలుపునకు అనన్య తనదైన శైలిలో కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రశంసలు కురిపించారు.

**గెలుపు బాటలో అనన్య..**

వికారాబాద్ మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా, 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి, 15వ వార్డు బిఆర్‌ఎస్ అభ్యర్థి ఏకగ్రీవం అయ్యారు. నామినేషన్ ఉప సంహరణ అనంతరం ఏకగ్రీవం అయిన బిఆర్‌ఎస్ అభ్యర్థి సైతం కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో కాంగ్రెస్‌కు రెండు స్థానాలు దక్కాయి. 17వ వార్డు నుంచి చైర్మన్ అభ్యర్థిగా గడ్డం అనన్య బరిలో దిగారు. బిఆర్‌ఎస్ అభ్యర్థి సైతం కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో అనన్య గెలుపు ముందుగానే జరిగి పోయిందంటూ కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ఖాతాలో ఇప్పటికే 3 కౌన్సిలర్ స్థానాలను కైవసం చేసుకుంది. మరో 19 స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకోనున్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మెజార్టీ స్థానాల కంటే ఎక్కువగా కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు గెలువనుండటంతో, గడ్డం అనన్య వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ కుర్చీ ఎక్కనుందని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# త్వరలో మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు

## ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు

### టేక్‌హోమ్ రేషన్ విధానంలో సరకులు అందచేసేలా ప్రతిపాదనలు

### అర్హులందరికీ పోషకాహారం అందించాలి : మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ పరిధిలో వలస కార్మికులు అధికంగా నివసించే ప్రాంతాలు, బస్తీలు, మురికివాడల ప్రాంతాల్లో అంగన్‌వాడీ సేవలు అందని అర్హుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు ప్రారంభించింది. భవనాల కొరత, సాంకేతిక సమస్యలు, అలాగే కొత్త అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల నేపథ్యంలో మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు దిశగా తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ కసరత్తు ప్రారంభించింది.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో కలిపి ప్రస్తుతం 2,364 అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. అయితే ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో హెచ్‌ఎండీఏ పరిధిలోని 274 కవర్ కాని బస్తీల్లో 25,310 మంది అర్హులైన చిన్నారులు, గర్భిణీలు, బాలింతలను గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో వీరికి పోషకాహార సేవలు సక్రమంగా అందడం లేదని వెల్లడైంది. అధిక జనసాంద్రత, తరచు వలసలు, నిబంధనల పరిమితులు, బస్తీల్లో భవనాల లభ్యత లేకపోవడం, సాంకేతిక అడ్డంకులు వంటి కారణాల వల్ల కొత్త అంగన్‌వాడీ కేంద్రాల స్థాపనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఏ ఒక్క అర్హుడు కూడా నష్టపోకూడదు, పోషకాహారానికి ఆటంకం కలగకూడదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలలో భాగంగా పోషకలోప రహిత తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.

అర్హులందరికీ అంగన్‌వాడీ సేవలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. టేక్ హోం రేషన్ విధానంలో అర్హుల నివాసాలకే సరుకులు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో బాలమృతం, పాలు, స్నాక్స్, కోడి గుడ్లు, బియ్యం తదితర పోషకాహార పదార్థాలను పంపిణీ చేయనున్నారు.

ఈ ప్రణాళికలో భాగంగా 274 స్లమ్ ప్రాంతాలను కవర్ చేస్తూ 37 వాహనాలను అద్దెకు తీసుకుని మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించేందుకు అధికా రులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.60,000 అద్దె చెల్లించనున్నారు. జిల్లా వారీగా హైదరాబాద్‌లో 7, మేడ్చల్-మల్కాజిగిరిలో 15, సంగారెడ్డిలో 1, రంగారెడ్డిలో 14 వాహనాలను వినియోగించనున్నారు. ఈ మొబైల్ కేంద్రాలను సమీప అంగన్‌వాడీ కేంద్రాలకు అనుబంధంగా నిర్వహిస్తారు. మొబైల్ అంగన్‌వాడీ వాహనాల ద్వారా ఆయా ప్రాంతాల్లోని అర్హులకు పోషకాహారాన్ని అందచేయనున్నారు.

ఈ కార్యక్రమం అమలుకు సంవత్సరానికి సుమారు రూ.4 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. అందుకనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే మొబైల్ అంగన్‌వాడీ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఈ సందర్భంగా పోషకాహార సేవలు అర్హులందరికి అందాలని, సాంకేతిక సమస్యలతో ఏవరూ నష్టపోకూడదన్న లక్షానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.

# ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు చెల్లించాలి

## ఏప్రిల్, మే నెలల్లో సాధారణ బదలీలు పూర్తి చేయాలి

### గెజిటెడ్ అధికారుల సంఘం వినతి

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** ఉద్యోగులకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం(టీజీవోసీఏ) రాష్ట్ర సర్కార్‌కు విజ్ఞప్తి చేసింది. డిమాండ్ చేసింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సాధారణ బదిలీలను ఏప్రిల్, మే నెలల్లో పూర్తి చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు వీటికి సంబంధించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుకు వినతి పత్రం అందజేసినట్లు గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, బి.శ్యామ్ తెలిపారు. రెండో వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదిక గడువు ముగిసి 22 నెలలు దాటిపోయిందని తెలిపారు. అలాగే 42శాతం ఫిట్‌మెంట్, 2024 జనవరి 1 నుంచి 2025 జూలై 1 వరకు బకాయి ఉన్న నాలుగు విడతల డీఏలు విడుదల చేయాలని కోరింది. ఇందుకు గాను 2026-27 బడ్జెట్‌లో పీఆర్సీ అమలుకు నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. గత ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న ఉద్యోగుల కోసం బదిలీల ప్రక్రియను ప్రారంభించాలని, ఏప్రిల్, మే నెలల్లో బదిలీలు పూర్తిచేయాలని కోరారు. గతంలో 40 శాతం పరిమితి విధించడం వల్ల చాలా మంది బదిలీలకు దూరమయ్యారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.





శ్రీలక్ష్మీ నరసింహస్వామి అఖండ జ్యోతి రథయాత్ర వివరాలను వెల్లడిస్తున్న యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, పడాల శ్రీకాంత్ తదితరులు

# 15న లక్ష్మీనరసింహస్వామి అఖండజ్యోతి రథయాత్ర

## యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** శ్రీలక్ష్మీ నరసింహస్వామి 32వ అఖండ జ్యోతి రథయాత్ర ఈ నెల 15న హైదరాబాద్, బర్కత్‌పురలోని యాదాద్రి భవన్ నుంచి ప్రారంభమవుతుందని యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం బర్కత్‌పురలోని యాదాద్రి భవన్‌లో అఖండ జ్యోతి రథయాత్ర కమిటీ సలహాదారులు పడాల శ్రీకాంత్, అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి బొమ్మల సుదీష్‌కుమార్‌తో కలిసి సద్ది వెంకట్‌రెడ్డి యాత్ర ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న ఆదివారం బర్కత్‌పుర యాదాద్రి భవన్ నుండి రథయాత్ర ప్రారంభమై 18న యాదగిరిగుట్టకు చేరుకుని అఖండజ్యోతిని ఆలయంలో అందించడం జరుగు తుందని తెలిపారు. 15న రథయాత్ర ప్రారంభమై బర్కత్‌పుర, చిక్కడపల్లి, విద్యానగర్, అడిక్‌మెట్, తార్నాక, హబ్సిగూడ, ఉప్పల్ వరకు చేరుకొని అక్కడ విడిది చేస్తుందన్నారు. 16న ఉప్పల్, పీర్జాదిగూడ, మేడిపల్లి, నారపల్లి, అన్నోజిగూడ, శివారెడ్డిగూడెం, ఘట్కేసర్ వరకు 17న ఘట్కేసర్, కొండ మడుగు, బీబీనగర్, గూడూరు, పగిడిపల్లి, భువనగిరి వరకు 18న భువనగిరి, రాయగిరి, వడాయిగూడెం మీదుగా యాదగిరి గుట్టకు రథయాత్ర చేరుకుం టుందన్నారు. రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహా మూర్తి, ఆలయ ఇఒ జె.భవానిశంకర్, నగరిగారి ప్రీతమ్‌కుమార్ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భవన్ మేనేజర్ రామ కోటేష్, యాత్ర రథసారధి ఎ.గణపతి, ఎ.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాలెంటైన్స్‌డేను అడ్డుకుంటాం

## ప్రకటించిన భజరంగ్‌దళ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** వాలెంటైన్స్ డే పేరుతో కార్పొరేట్ శక్తులు చేసే వ్యాపారాలను అడ్డుకుంటామని భజరంగ్‌దళ్ హెచ్చరించింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాశ్చాత్య సంస్కృతి అయిన వాలెంటైన్స్ డేను దేశ యువత బహిష్కరించాలని పిలుపునిచ్చారు. పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన జావన్‌లకు శ్రద్ధాంజలిగా ప్రతిఏటా వీరజవాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 13న కోఠిలోని ఆంధ్రాబ్యాంకు చౌరస్తాలో జవాన్లకు నివాళులు అర్పిస్తామన్నారు. యువత సైనికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



ప్రసంగిస్తున్న తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత

### ఉద్యమకారులను పట్టించుకోకపోవడం వల్లే

# కెసిఆర్‌కు ఓటమి

## తెలంగాణ అస్తిత్వం కోసం కచ్చితంగా పార్టీ స్థాపిస్తా

### ఆత్మగౌరవ సభలో కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనాన్ని సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా తండ్రి, మాజీ సీఎం కేసీఆర్‌పై, బిఆర్‌ఎస్ పార్టీపై ఆమె నేరుగా విమర్శలు గుప్పించడం చర్చనీయాంశంగా మారింది. రేవంత్ సర్కార్‌పై కూడా విమర్శలు చేసారు. మరోవైపు త్వరలోనే తెలంగాణ అస్తిత్వం, ఉద్యమ ఆకాంక్షల కోసం కచ్చితంగా రాజకీయ పార్టీని స్థాపిస్తానని కవిత స్పష్టం చేశారు. తమ పార్టీ పేరులో 'తెలంగాణ' ఉంటుందని, ఒక ఉద్యమ శక్తిగా పని చేస్తుందని తెలిపారు. గురువారం బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమ కారుల ఆత్మగౌరవ సభ జరిగింది.

ఈ సభలో కల్వకుంట్ల కవిత మాజీ సీఎం, తన తండ్రి కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు. గత పాలకులు అహంకారంతో వ్యవహరించడం వల్లే ఓడిపోయారని పరోక్షంగా కేసీఆర్‌ను విమర్శించారు. కేసీఆర్ హయాంలో ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం, సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం వంటి చర్యల ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాలరాశారని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు లాగే రోజు వస్తుందని జోస్యం చెప్పారు. తెలంగాణ సంక్షేమ బోర్డును వెంటనే ప్రకటించాలని, ప్రైవేట్ ఉద్యోగాల్లో ఉద్యమ కారుల బిడ్డలకు 25 శాతం కోటా కల్పించాలని డిమాండ్ చేసారు.

# ఎన్నికల సిబ్బంది రెమ్యునరేషన్ పెంచాలి

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సిపిఎస్ యూనియన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:**రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బంది రెమ్యునరేషన్ పెంచాలని తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, సెక్రెటరీ లింగ్యా నాయక్‌కి తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఈ నెల 11న జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో ప్రిసైడింగ్ ఆఫీసర్(పివో) ఓపివోతోపాటు పోలింగ్ సిబ్బందికి 2023లో జారీచేసిన జి.ఓ ప్రకారం రెమ్యునరేషన్ ఇవ్వడం చాలా తక్కువగా ఉన్నాయని, వాటిని సమీక్ష చేసి,రెండు రోజుల శిక్షణ, రెండు రోజుల పోలింగ్ విధులు చేసిన పివోలకు రూ.4,000 అదేవిధంగా ఓ.పి.ఓ లకు రూ. 2,000 రెమ్యునరేషన్ ఇవ్వాలన్నారు. ఇక ముందు జరిగే ఎన్నికల కేంద్రాల్లో మహిళ ఉద్యోగ, ఉపాధ్యాయిలకు సరైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ అధికారులు స్పందించి దానిపై సంబంధిత శాఖకు సమీక్షకు పంపిస్తామని చెప్పారని స్థితప్రజ్ఞ తెలిపారు.

# విభిన్న కళారంగాల కృషీవలుడు కె.వి.రమణాచారి



డా. కె.వి.రమణాచారిని సత్కరిస్తున్న సుఖేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, శంకర్, వెంకటరెడ్డి తదితరులు

## శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఫిబ్రవరి 12 , ప్రభాతవార్త :** తెలుగు రాష్ట్రాల్లో విభిన్న కళా సాహిత్య సాంస్కృతిక రంగాల కళాసేవకుడు, కృషీవలుడు డా. కె.వి.రమణా చారి అని అని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శ్లాఘించారు. ఒక ఐఎఎస్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వాల్లోని వివిధ ముఖ్యమంత్రుల వద్ద సన్నిహితుడుగా ప్రజాసేవలు అందించి విశ్రాంత ఐఎఎస్ అధికారిగా అందరు కళాకారులు, కళలకే జీవితాన్ని అంకితంచేసి విశేషసేవలందిస్తున్న కళామతల్లి ముద్దుబిడ్డ, కళాకారుల కనిపించే దైవంగా నిత్యస్మరణీ యుడుగా నిలిచారన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షోపన్యాసంలో డా. కె.వి.రమణాచారి అందరు కళాకారుల గుండెల్లో స్థానం పొందినది అనితరసాధ్యమన్నారు. రమణాచారి ఉద్యోగి, సాంస్కృతిక కళాప్రియుడుగానే కాకుండా సాహిత్యవేత్తగా పద్యకవిత్వం వస్తువైవిధ్యం అనే పేరుమీద పరిశోధనచేసి డాక్టరేట్ పొందారని గుర్తుచేశారు. పద్యం వ్రాయడం కూడా సులువేనని తద్వారా చెప్పారని, అతనొక అరుదైన సాహిత్య కళాకారుడు, కళాప్రేమికుడు, ఐఎఎస్ అధికారని కొనియాడారు. తన జన్మదినాన్ని బుర్రకథ గానంతో బుర్రకథ వింటూ జరుపుకోవడమూ విశేషమేనని అన్నారు. తెలంగాణ బుఱ్ఱకథ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో గురువారం రాత్రి జరిగిన డా. కె.వి.రమణాచారి 75వ జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన గుత్తా సుఖేందర్‌రెడ్డి గౌరవ అతిథులు డా. ఏనుగు నరసింహారెడ్డి, ఓయు తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు డా. కసిరెడ్డి వెంకటరెడ్డి, సంఘం అధ్యక్షుడు బండిరాజుల శంకర్, ప్రధాన కార్యదర్శి సాలం కృష్ణయ్య, పొరెడ్డి రంగయ్య తదితరులతో కలిసి డా. కె.వి.రమణాచారి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కసిరెడ్డి వెంకటరెడ్డి, బండిరాజుల శంకర్ తదితరులు మాట్లాడారు.

# రంగంలోకి కొత్త 'రాఫెల్' విమానాలు!

## రూ.3.25 లక్షల కోట్లతో 114 జెట్ ఫైటర్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

## 17న ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ రాక

### 8 డోర్నియర్ విమానాల కోసం హెచ్ఎఎల్‌తో ఎంఒయు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత వైమానిక దళం కోసం ఫ్రాన్స్ నుంచి 114 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలనే రూ.3.25 లక్షల కోట్ల ప్రతిపాదనకు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన రక్షణ సముపార్జన మండలి (డిఎసి) రాఫెల్ జెట్ విమానాల కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ రాబోయే ఢిల్లీ అధికారిక పర్యటనకు ముందు ఈ అనుమతి లభించింది. మెక్రాన్ ఈ నెల 17న భారత పర్యటనకు వస్తున్న విషయం తెలిసిందే. రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం పొందిన తర్వాత, ఈ ఒప్పందానికి చివరికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ నుండి అనుమతి అవసరం. ప్రతిపాదన ప్రకారం, భారత్, ఫ్రెంచ్ రక్షణ దిగ్గజం డసాల్ట్ ఏవియేషన్ నుండి 18 ఆఫ్‌దిషెల్ఫ్ రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తుంది. మిగిలిన 96 యుద్ధ విమానాలు భారతదేశంలో తయారు చేయబడతాయి. ఇంకా, ఈ జెట్‌లలో కొన్ని శిక్షణ కోసం ఉపయోగించబడే జంటసీట్ల విమానాలు. ఈ ఒప్పందంలో అత్యాధునిక యుద్ధ జెట్ సాంకేతికతను బదిలీ చేయడం, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పూరకంగా వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంటుంది. భారత వైమానిక దళం ఇప్పటికే రెండు స్క్వాడ్రన్‌లను కలిగి ఉన్న 36 రాఫెల్‌లను కలిగి ఉంది, 'సి' వేరియంట్ చివరి డెలివరీ డిసెంబర్ 2024లో జరిగింది. అయితే, 'ఎం' వెర్షన్ మరో 26 రాఫెల్ జెట్‌లను కూడా భారత నౌకాదళం కోసం రూ. 63,000 కోట్ల విలువైన ఒప్పందంలో ఆర్డర్ చేశారు. నావికా వేరియంట్‌లను విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రాంత్. ఐఎన్ఎస్ విక్రమాదిత్య నుండి నిర్వహిస్తారు. ఆ ఒప్పందంలో ఎంఆర్ఓ (నిర్వహణ, మరమ్మత్తు, సమగ్ర పరిశీలన) ఒప్పందం కింద విమానాల నిర్వహణ, లాజిస్టిక్స్ మద్దతు, సిబ్బంది శిక్షణను సులభతరం చేయనుంది.

**ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌ల వినియోగం**

మే 2025లో పహల్గామ్ ఉగ్రవాద దాడికి భారత్ సైనికచర్యలో భాగంగా పాకిస్తాన్‌లోని ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించడానికి ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌లను విజయవంతంగా ఉపయోగించారు. 250 కి.మీ కంటే ఎక్కువ దూరంలోని నిర్దేశిత లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించగల ఎస్‌సిఎఎల్‌పి అనే వాయుప్రయోగ క్రూయిజ్ క్షి పణిని ప్రయోగించడానికి వీటిని ఉపయోగించారు. అత్యాధునిక యుద్ధ విమానం, రాఫెల్, మెటియోర్ లాంగ్‌రేంజ్ గగనతలం నుంచి గగనతలం క్షి పణులు, స్టాండ్‌ఆఫ్ స్ట్రైక్ ఆయుధం హామర్, అధునాతన ఇవార్‌ఫేర్ సూట్ అయిన స్పెక్ట్రా, అలాగే అధునాతన రాడార్, లక్ష్య వ్యవస్థలను కూడా మోసుకెళ్లగలదు.

**8 డోర్నియర్ 228 విమానాల కోసం కేంద్రం హెచ్ఎఎల్‌తో ఒప్పందం**

ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) కోసం ఎనిమిది డోర్నియర్ 228 విమానాలను, ఆపరేషనల్ రోల్ పరికరాలను రూ.2,312 కోట్లకు కొనుగోలు చేయడానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్)తో ఒప్పందంపై సంతకం చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ఈ ఆర్డర్ హెచ్ఎఎల్ ఉత్పత్తి పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం, ఎంఎస్ఎంఇలు, అనుబంధ పరిశ్రమల విస్తృత నెట్‌వర్క్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా గణనీయమైన ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఇది నిర్వహణ, మరమ్మత్తు, ఓవర్‌హాల్, లైఫ్ సైకిల్ సాంకేతిక మద్దతులో స్థిరమైన అవకాశాలను కూడా సృష్టిస్తుందని అధికారిక ప్రకటన తెలిపింది. రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో బై (ఇండియన్) కేటగిరీ కింద ఒప్పందంపై సంతకం చేశారు.



## బంగ్లా ఎన్నికల్లో బిఎన్పీ కూటమి క్లీన్‌స్వీప్!

# ప్రధాని రేసులో తారిక్ రెహమాన్

**ఢాకా, ఫిబ్రవరి 12:** బంగ్లాదేశ్‌లో అత్యంత కీలక ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ దేశ దశ దిశను మార్చే ఎన్నికలుగా ఇవి ఉండబోతున్నాయి. షేక్ హసీనా 2024లో జరిగిన హింసాత్మక ఘర్షణల తర్వాత, తన ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు, తాత్కాలిక పాలకుడిగా వచ్చిన మహ్మద్ యూనస్ పచ్చి భారత వ్యతిరేక వైఖరిని అవలంభించాడు. భారత్‌ను వ్యతిరేకిస్తూ, పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకున్నాడు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బంగ్లా వ్యాప్తంగా ఇస్లామిస్టులు రాజ్యమేలుతున్నారు. మతోన్మాద దాడులు, హిందువులపై అకృత్యాలు నిత్యకృత్యంగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో జరుగుతున్న ఈ ఎన్నికలకు చాలా ప్రధాన్యత ఏర్పడింది. ఈసారి ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ), జమాతే ఇస్లామీ కూటమికి మధ్య తీవ్ర పోటీ ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. ఇక షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్‌ను యూనస్ సర్కార్ నిషేధించింది. జమాత్ నేతృత్వంలో 11 పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. 17 ఏళ్ల ప్రవాసం తర్వాత బంగ్లాదేశ్ వచ్చిన మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధాని రేసులో ముందు వరసలో ఉన్నాడు. ఈసారి డబుల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగనున్నాయి. దీంట్లో ఒక ఓటు ఎంపీకి, మరో ఓటు జులై చార్టర్ రిఫరెండం కోసం. ఈ రిఫరెండం ద్వారా ప్రధాని అధికారాలపై ఆంక్షలు, జ్యూడీషియరీ స్వంతంత్రంపై ప్రజాభిప్రాయాన్ని కోరుతారు. బంగ్లాదేశ్‌లో 350 సీట్లు ఉండగా, ఇందులో 299 స్థానాలకు పోలింగ్ జరిగింది. 50 స్థానాలు మహిళలకు కేటాయించారు. వీటికి పరోక్షంగా ఎన్నికలు జరుగుతాయి. ఢాకా ట్రిబ్యూన్ రిపోర్ట్ ప్రకారం బీఎన్‌పీ అలయన్స్ 208 సీట్లు సాధించి, క్లీన్ స్వీప్ చేస్తుందని చెబుతోంది. జమాత్ అలయన్స్‌కు 46 సీట్లు, జాతియా పార్టీకి 3 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఓట్ షేర్ ప్రకారం చూస్తే బీఎన్‌పీకి 66.3 శాతం, జమాత్‌కు 11.9 శాతం ఓట్లు సాధించే ఛాన్స్ ఉందని చెప్పింది. ఎన్ఆర్‌సీ సర్వే ప్రకారం బీఎన్‌పీ 77 శాతం ఓట్ షేర్‌తో 220 సీట్లు గెలుస్తుందని, జమాత్ 57 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని వెల్లడించింది. ప్రోథోం ఆలో రిపోర్ట్ మాత్రం బీఎన్‌పీ, జమాత్ మధ్య తీవ్రమైన పోటీ ఉంటుందని చెప్పింది. జమాత్ అలయన్స్ 105 సీట్లు, బీఎన్‌పీ అలయన్స్ 101 సీట్లు గెలుస్తుందని చెప్పింది. ఓట్ షేర్ బీఎన్‌పీకి 44.1 శాతం, జమాత్ అలయన్స్ 43.9 శాతం వస్తుందని అంచనా వేసింది. 77 సీట్లలో ఇద్దరి మధ్య టఫ్ ఫైట్ ఉంటుందని చెప్పింది.



## టర్కీ పార్లమెంట్‌లో ఫైటింగ్..

# కొట్టుకున్న అధికార-విపక్ష ఎంపిలు

**అంకారా, ఫిబ్రవరి 12:** టర్కీ పార్లమెంట్ రణరంగంగా మారింది. ప్రజాప్రతినిధులు వీధి రౌడీల్లా కొట్టుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకుంటూ.. తన్నుకుంటూ నానా రభస చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విడియో వైరల్ అవుతోంది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్ అకిన్ గుర్లెక్ పార్లమెంట్‌లో న్యాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతుండగా ప్రతిపక్ష ఎంపీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అధికార-ప్రతిపక్ష ఎంపీలు ఒకరినొకరు కొట్టుకోవడం.. తన్నుకుంటూ కనిపించారు. చాలాసేపు ముష్టి యుద్ధం జరిగింది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా గుర్లెక్.. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన రిపబ్లికన్ పీపుల్స్ పార్టీకి చెందిన అనేకమంది సభ్యులపై ఉన్నతస్థాయి విచారణలకు అధ్యక్షు వహించారు. ప్రతిపక్షం చాలాకాలంగా ఈ విచారణలను రాజకీయంగా ప్రేరేపించబడ్డాయని విమర్శిస్తోంది. ఇప్పుడు టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్.. అకిన్ గుర్లెక్‌ను న్యాయమంత్రిగా నియమించింది. బుధవారం ఆయన ప్రమాణస్వీకారం చేస్తుండగా ప్రతిపక్షాలకు ఆగ్రహం తెప్పించింది. ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ నియంత్రణలో ఉన్న మునిసిపాలిటీలకు చెందిన వందలాది మంది అధికారులను అవినీతి దర్యాప్తులో అరెస్టు చేశారు. వీరిలో ఇస్తాంబులక్ష మేయర్ ఎక్రెమ్ ఇమామోగ్లు కూడా ఉన్నారు. ఆయనను గత సంవత్సరం అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలకు కోపం తెప్పించింది.

# ట్రంప్-నెతన్యాహు కీలక భేటీ

## ఇరాన్ అణు ఒప్పందంపై రహస్య చర్చలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అగ్రరాజ్యంలో పర్యటన ఆసక్తి రేపుతోంది. బుధవారం వైట్‌హౌస్‌లో మూడు గంటలపాటు ట్రంప్- నెతన్యాహు రహస్యంగా సమావేశం అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. ఇక ఇద్దరి సమావేశం తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో కీలక వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్‌తో చర్చలు జరుగు తున్నాయని.. దౌత్యం అనిశ్చితంగానే ఉందని తెలిపారు. చర్చలు విఫలమైతే సమన్వయం కొనసాగుతుందని సంకేతాలు ఇచ్చారు. ఇరాన్‌తో నిరంతర చర్చలకు ఒత్తిడి తెచ్చానని.. ఇప్పటికీ చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తానికి వార్నింగ్‌ల దగ్గర నుంచి చర్చలకు ట్రంప్ తెరలేపారు. డిసెంబరు 28 నుంచి ఇరాన్‌లో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖమేనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఇక భద్రతా దళాల కాల్పుల్లో 30 వేల మంది చనిపోయారు. దీంతో ట్రంప్ రంగంలోకి దిగి.. నిరసన కారులను చంపితే సైనిక చర్యకు దిగుతామని హెచ్చరించారు. అన్నట్టుగానే యుఎస్ఎస్ అబ్రహం లింకన్ నౌక అరేబియా సముద్రానికి వచ్చి మోహరించింది. తక్షణమే అణు ఒప్పందం చేసుకోవాలని ఇరాన్‌పై ట్రంప్ తీవ్ర ఒత్తిడి చేశారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో ట్రంప్-నెతన్యాహు



భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే అమెరికా నేతృత్వంలో ఏర్పడిన బోర్డ్ ఆఫ్ పీస్‌లో ఇజ్రాయెల్ చేరింది. చాలా రోజుల తర్జన భర్జన తర్వాత నెతన్యాహు సంతకం చేశారు. ఈ ఫోరమ్‌లో పాశ్చాత్య భాగస్వాములతో పాటు టర్కీ, ఖతార్ కూడా ఉన్నాయి. గతంలో గాజాలో వారి పాత్రపై ఇజ్రాయెల్ విమర్శలు చేసింది. మొత్తానికి శాంతి మండలిలో ఇజ్రాయెల్ చేరింది.

# రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

## బిజెపి ఎంపి నిశికాంత్ దూబె



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె డిమాండ్ చేశారు. ఈ మేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. ఇంకా ప్రచురితం కాని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎంఎం నరవణె పుస్తకం సహా పలు వివాదాస్పద అంశాలపైనా రాహుల్‌గాంధీ, బిజెపి ఎంపిల మధ్య తీవ్ర వాగ్వాదం నడిచిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు? ఆయన చేతికి ప్రచురితం కాని పుస్తకం ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి ఆ నోటీసులో ప్రస్తావించారు. లోక్‌సభలో రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి అని దూబె అన్నారు. అయితే ఆయనపై సభా హక్కుల తీర్మానం తీసుకురావడం లేదని చెప్పారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రస్తావన తీసుకువచ్చారు. అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పురీ పేర్లను పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికారపక్షం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదాలను తొలగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన చేసిన ఆరోపణలకు ఎలాంటి ధృవీకరణ లేదని పేర్కొన్నాయి.

# సేవాతీర్థ్ కాంప్లెక్స్‌కు మారుతున్న నార్త్,సౌత్ బ్లాక్‌లు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** దేశ రాజధాని ఢిల్లీలోని బ్రిటీష్ కాలం నాటి ఆఫీసు బిల్డింగ్‌లు ఉన్న నార్త్, సౌత్ బ్లాకులను శుక్రవారం పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం కూడా కొత్తగా నిర్మించిన సేవా తీర్థ్ కాంప్లెక్స్‌కు మారనున్నది. ఆఫీసును మార్చడానికి ముందు శుక్రవారం ప్రధాని మోదీ చివరిసారి క్యాబినెట్ భేటీ ఏర్పాటు చేయనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు పాత ఆఫీసులో ఆ భేటీ ఉండనున్నది. ఢిల్లీలోని ల్యూటెన్స్ రైసినా హిల్స్‌లో ఉన్న సౌత్ బ్లాకులో చివరిసారి కేంద్ర క్యాబినెట్ భేటీ జరగనున్నది. నార్త్ బ్లాక్ నుంచి కేంద్ర హోంశాఖ కార్యాలయాన్ని పూర్తిగా షిఫ్ట్ చేశారు. కామన్ సెంట్రల్ సెక్రటేరియేట్‌లోని 347 రూమ్ కాంప్లెక్స్‌కు హోంశాఖను తరలించారు. ఒక్క పీఎంవో మినహా ఆ కాంప్లెక్స్‌లో అన్ని ప్రభుత్వ మంత్రులు, శాఖల ఆఫీసులు ఉన్నాయి. సెంట్రల్ ఢిల్లీలోని ప్రత్యేక కాంప్లెక్స్‌లో పీఎంవోను నిర్మించారు. పీఎంవోను ఇక నుంచి సేవాతీర్థ్ అని పిలవనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 13వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ సేవాతీర్థ్, కర్తవ్యభవన్1,2లను ఆవిష్కరిస్తారని ప్రభుత్వం గురువారం ఓ ప్రకటన రిలీజ్ చేసింది. కొత్త ఆఫీసు బిల్డింగ్‌ను ప్రారంభించడంతో భారతీయ అధికార పరిపాలనా విభాగంలో కొత్త మైలురాయి చేరు కున్నట్లు అవుతుంది. ఆధునిక, పటిష్టమైన, సౌకర్యవంతమైన పరి పాలనా వ్యవస్థను అందిచే ఉద్దేశంతో కొత్త బిల్డింగ్ లను నిర్మించినట్లు అధి కారులు పేర్కొన్నారు. గతంలో దూరం దూరం గా ఉన్న వివిధ శాఖల ఆఫీసులను ఇప్పుడు ఒకే దగ్గరికి తీసుకువచ్చారు. పరిపాలనను మరింత సులభం చేయాలన్న ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సేవా తీర్థ్‌లో ప్రధానమంత్రి కార్యాలయం, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ సెక్రటేరియేట్, క్యాబినెట్ సెక్రటేరియేట్ ఉంటాయి. గతంలో ఇవన్నీ వేర్వేరు ప్రాంతాలను నుంచి ఆపరేట్ అయ్యేవి. ఇక కర్తవ్య భవన్ 1,2లో కీలక మంత్రిత్వశాఖల ఆఫీసులు ఉంటాయి. ఆర్థిక, రక్షణ, ఆరోగ్య, కార్పొరేట్ సర్వీసెస్, విద్య, సంస్కృతి, న్యాయ, సమాచార ప్రసార, వ్యవసాయ, రసాయనిక, గిరిజన శాఖ ఆఫీసులు ఉంటాయి. అన్ని ఆఫీసుల మధ్య డిజిటల్ ఇంటిగ్రేషన్ ఉంటుంది. ప్రస్తుత నార్త్, సౌత్ బ్లాకుల వద్ద ప్రపంచ స్థాయి మ్యూజియంను నిర్మించనున్నారు. యుగే యుగే భారత్ మ్యూజియంలో భారతీయ నాగరికత ప్రయాణాన్ని చిత్రీకరించనున్నారు. అయితే ఇప్పటికే నార్త్ బ్లాక్ వద్ద మ్యూజియం పనులు ప్రారంభమైనట్లు తెలుస్తున్నది.

# సంక్షిప్తంగా..

## 3వ తరగతి నుంచే విద్యార్థులకు ఎఐ యాక్సెస్: కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 :** ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో మాదిరి విద్యారంగంలోను కృత్రిమ మేధ విస్తరిస్తుంది. ఈ కొత్త ఎఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఎఐ కాంక్లేవ్ - 2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎఐ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు.

## తొలితరం న్యూస్ యాంకర్ సరళామహేశ్వరి కన్నుమూత



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత టెలివిజన్ రంగంలో సుపరిచితురాలు, దూరదర్శన్ సీనియర్ న్యూస్ యాంకర్ సరళా మహేశ్వరి (71) కన్నుమూశారు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ నేషనల్ చానల్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె సౌమ్యమైన స్వరం, స్పష్టమైన ఉచ్చారణ, వార్తలను హుందాగా అందించే తీరుతో భారతీయ వార్తా ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని నివాళి అర్పించింది. దూరదర్శన్ కుటుంబం తరఫున సరళా మహేశ్వ రికి హృదయపూర్వక నివాళులు. ఆమె తన సరళత, హుందాతనంతో వీక్షకులలో చెరగని ముద్ర వేశారు" అని డీడీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. సరళాతో కలిసి పనిచేసిన సీనియర్ యాంకర్ షమ్మీ నారంగ్ కూడా ఆమె మృతిపై విచారం వ్యక్తం చేశారు.

## డికె సిఎం కావాలంటున్న 90 మంది ఎమ్మెల్యేలు!



**బెంగళూరు, ఫిబ్రవరి 12:** డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని 80 నుంచి 90 మంది ఎమ్మెల్యేలు కోరుకుంటు న్నారని కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ పునరుద్ఘాటించారు. కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ సాగుతోంది. ఈరోజు ఇక్బాల్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం శివకుమార్ చేసిన కృషికి ఆయన ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని చాలామంది ఎమ్మెల్యేలు ఆశిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. 140 మంది ఎమ్మెల్యేలు మార్పును ఆశిస్తున్నారని, 80 నుంచి 90 వరకు ఎమ్మెల్యేలు ఈ అంశంపై చర్చించుకుంటున్నారని, తామంతా మద్దతిస్తున్నామని అన్నారు.

## ఈ నెల 14న ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం

### ముఖ్య అతిథిగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవల్



మంగళగిరి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: ఏపీ ఎసీఆర్ ఎం యూనివర్సిటీ ప్రత్యేక స్నాతకోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 14న శని వారం మధ్యాహ్నం 2 గంటలకు స్వాతకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడానికి వర్సిటీ యాజమాన్యం ఏర్పాట్లు పూర్తి చేసింది. కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి ఆర్జున్ రామ్ మేగ్వాల్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. స్నాతకోత్సవానికి గౌరవ అతిథిగా డీఆర్ డీవో ఛైర్మన్ డాక్టర్ ఎస్వీ కామత్ విచ్చేయమన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం డీఆర్ డీవో చైర్మన్ డాక్టర్ కామత్ కు గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేయనుంది. కార్యక్రమంలో భాగంగా ఏడుగురు రీసెర్చ్ స్కాలర్లకు పీహెచ్ డిగ్రీలు ప్రధానం చేయనున్నారు. ఈ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని సీఎల్ లహరి, అంచా వినోద్ కుమార్, అలా సురేశ్, మహ్మద్ సాయిద్(మేనేజ్మెంట్), ఎం. భార్గవి, అసఫ్ ఇక్బాల్, మరియు యలమంచిలి నందిని (సీఎస్ఈ)లకు పీహెచ్ డీ డిగ్రీలుప్రధానం చేయనున్నారు. యూనివర్సిటీ ఉప కులపతి సతీష్ కుమార్ యూనివర్సిటీ ప్రగతి, భవిష్యత్ కార్యాచరణ ను ప్రకటించనున్నారు. ఈ ప్రత్యేక స్నాతకోత్సవంలో యూనివర్శిటీ వ్యవస్థాపక కులపతి డాక్టర్ టీ ఆర్ పారి వేందర్, ప్రొ ఛాన్సలర్ డాక్టర్ పి సత్యనారాయణన్, ఉప కులపతి ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్లు పాల్గొంటున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమం సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.

## పెదవడ్లపూడి సాయిబాబా మందిరంలో ఉచిత కంటి వైద్య శిబిరం.

**మంగళగిరి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త** పెదవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరంలో మందడం హాసిని మల్టీ స్పెషాలిటీ కంటి హాస్పటల్ సౌజన్యంతో సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని గ్రామ మాజీ సర్పంచ్ పాతూరి సుధారాణి ప్రారంభించారు. శిబిరంలో రోగులకు అమెరికా కంప్యూటర్ ద్వారా అన్ని రకాలైన కంటి పరీక్షలు నిర్వహించారు. హాస్పటల్ అధినేత డాక్టర్ షేక్ రహీం భాషా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి చుక్కల మందులు పంపిణీ చేశారు. అనంతరం సుధారాణి మాట్లాడారు. 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 40 మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు.

# ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం

## ఐక్యరాజ్యసమితి సంచలన నివేదిక

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై ఐక్యరాజ్యసమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుకు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠాతో సంబంధం ఉందని పేర్కొంది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ జైషే సహ పలు ఉగ్ర ముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలకంగా తమ నేర కార్యకలాపాలు సాగిస్తున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలు ప్రస్తావించింది. ఆంక్షలు ఉన్నప్పటికీ జైషేముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అందులో ఒకటి 2025 నవంబరు 10న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి అని ఐక్య రాజ్యసమితి సభ్య దేశం ఒకటి ఆరోపించింది. ఇక అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గతేడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇలా చాలా ఆందోళనకర పరిణామం అని ఐక్యరాజ్య సమితి తమ నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఘటనను కూడా ఐక్యరాజ్య సమితి తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమై



నట్లు తెలిపింది. జైషే, లష్కరే తోయిబా వంటి ఉగ్ర ముఠాలు ఉనికిలో లేవని గత కొంతకాలంగా పాకిస్తాన్ పదే పదే వాదిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికతో దాయాది పాక్ వక్రబుద్ధి మరోసారి బయటపడినట్లయింది. ఎర్ర కోట వద్ద పేలుడు ఘటనపై ఎన్ఐఎ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులో వచ్చాయి.

# ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు

**గుంటూరు వెస్ట్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానములో గురువారము మహాశివరాత్రి బ్రహ్మోత్సవముల మొదటి రోజు శ్రీ భ్రమరాంబ అమ్మవారు పెండ్లి కుమార్తె అలంకారములో భక్తులు దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవములలో భాగముగా ఆదివారము ఉదయం 5.00 లకు సుప్రభాత సేవ, పంచహారతులు 8.00 లకు స్వామి వారికి మహన్యాసపూరీర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం 4.00 లకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనము, పంచగవ్యప్రాశన, దీక్షధారణ, త్రిశూలపూజ, అంకురారోపణ, వాస్తుపూజ, శైవాగ్ని ప్రతిష్ఠాపన జరుగునని రాత్రి 10.30 లకు ధ్వజారోహణ, ఆలయ బలిహరణ, సంతానముద్దలు పెట్టు కార్యక్రమములు శైవాగమ పద్ధతిన దేవస్థాన స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకస్వామి పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకస్వాములచే నిర్వహించినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ పాలకమండలి ఛైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు తెలిపారు. అంకురారోపణ తదితర పూజలలో పాలకమండలి ఛైర్మన్, సభ్యులు ఆలయ అధికారులు పాల్గొన్నారు.సాంస్కృతిక కార్యక్రమములలో భాగముగా గురువారము సాయంకాలము 6.00 ఓ. రమేష్ బాబు, తెనాలి వారిచే భక్తిరంజని, నటరాజ నృత్య నిలయం, విజయవాడ వారిచే కూచిపూడి నృత్యము, ఉల్లంగుల బ్రహ్మం, పెదకాకాని వారిచే గయోపాఖ్యానం నాటకం నుండి యుద్ధం సీను, యేపసూరి వెంకట్రావు, నిడబ్రోలు వారిచే బాలనాగమ్మ నాటకం నుండి ఫకీరు మరియు సంగు సీను సాంస్కృతిక కార్యక్రమములు భక్తులను రంజింప చేసినవి.

ఆలయ ప్రాంగణములో దాతలచే 5 లక్షలతో నిర్మించిన పి.పి.జి.యల్.షెడ్, గ్రామోత్సవముల సేవలకు దాతలు సమర్పించిన ట్రక్కు ప్రారంభించిన శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పెదకాకాని మండలము తక్కెళ్ళపాడు గ్రామ వాస్తవ్యులు శ్రీ నందిపాటి రామకృష్ణ శివకుమారి కుమారుడు నందిపాటి భరత్‌కుమార్ శోభ, పిల్లలు స్రిమిత, దివిత్, కుమార్తె నందిపాటి పావని భర్త. కందుల సాంబశివరావు, పిల్లలు సువాస్, షెర్వీ కుటుంబ సభ్యులు దేవస్థాన



ప్రాంగణములో తూర్పు భాగమున 5 లక్షలతో పి.పి.జి.యల్. షెడ్‌ను భక్తుల సౌకర్యార్థము నిర్మించినట్లు అలాగా శ్రీ స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవముల సేవకు వినియోగించుటకు తక్కెళ్లపాడు గ్రామ వాస్తవ్యులు కీ.శే.నందిపాటి అప్పారావు, బుజ్జమ్మదేవిల జ్ఞాపకర్థం యూఎస్ఏ నుండి శ్రీమతి గోగినేని వీరాబాయి భర్త.శివరామ్ గార్లచే బహుకరించబడిన రూ.లక్ష విలువ చేయు ట్రక్కును గురువారము శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రారంభించినట్లు ఆలయ ఉపకమీషరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమములో దాత కుటుంబ సభ్యులు, ధర్మకర్తలమండలి ఛైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మహాశివరాత్రి పర్వదినమున తెల్లవారుజామున 3 గంటల నుండి దర్శనమునకు అనుమతి దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశములు ప్రకారము మహాశివరాత్రి పర్వదినమున తెల్లవారుజామున 2:30 గంటలకు అర్చక స్వాములచే శ్రీ మూలవిరాట్ స్వామి వారి ప్రత్యేక అభిషేకము జరిపి అనంతరం3.00 నుండి భక్తులకు దర్శనమునకు అనుమతించుట జరుగునని మరియు భక్తులకు మూలవిరాట్ స్వామి వారి అభిషేకములు పూర్తిగా నిలుపుదల చేసినట్లు, శ్రీ స్వామివారి మూలవిరాట్ దర్శనము, అభిషేక మండపము నందు నిర్వహించు రూ.100/లు అభిషేకములు, రాహుకేతు పూజలు మినహా అన్నీ అర్జిత సేవలు నిలుపుదల చేసినట్లు ఆలయ ఉపకమీషనరు తెలిపారు.బ్రహ్మోత్సవముల 2వ రోజు శుక్రవారము శ్రీ భ్రమరాంబ అమ్మవారు శ్రీ వనదుర్గాదేవి అలంకారముగా దర్శనమిస్తారని, సాయంకాలము గం.6.30 నుండి నరనంది వాహనముపై శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల గ్రామోత్సవము అత్యంత వైభోపేతముగా జరుగునని కావున భక్తులు అధిక సంఖ్యలో శ్రీ స్వామి, అమ్మవార్లను దర్శించుకొనవలసినదిగా ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, ధర్మకర్తలమండలి ఛైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు, సభ్యులు భక్తులకు విజ్ఞప్తి చేసినారు.

# శివరాత్రికి ముస్తాబైన దేవాలయం

**-భక్తుల తాకిడికి తగ్గట్లుగా ఏర్పాట్లు పూర్తి**
**-15న స్వామివారి కాళ్యాణోత్సవం**
**-కార్యనిర్వహణాధికారి నిడమానూరి శ్రీనివాసరావు**

**ములుకుదురు(పొన్నూరు), ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకొన్ని ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి నిడమానూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి త్రయాహ్నికంగా జరుగుతాయన్నారు.



ఉత్సవాలకు సంబంధించి ఏర్పాటుల పూర్తి చేశామన్నారు. భక్తుల తాకిడికి తగ్గట్లుగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. భక్తులకు కూడా క్యూ పద్దతిలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవాలని కోరారు. 14వ తేదీ రాత్రి ధ్వజారోహణము, 15న మహాశివరాత్రి సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. రాత్రికి ప్రభ ఊరేగింపు ఎదురు కోలోత్సవం, కళ్యాణోత్సవం జరుగుతాయన్నారు. వ్యవస్థాపక ధర్మకర్త మల్రాజు వెంకట రామకృష్ణకొండలరావు దేవాలయం మర్యాదలు అందుకొంటారన్నారు. కోటంరాజు వెంకట శేషగిరిరావు, దాసరి దుర్గాప్రసాద్, ముప్వా శ్రీనివాసరావు దంపతులచే కళ్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. 16న ఉదయం గ్రామోత్సవం, సాయంత్రం 6గంటలక రథోత్సవం, అనంతరం ధ్వజావరోహణము జరుగుతాయన్నారు. 17న వసంతసేవ, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలన్నీ యాజ్ఞీకస్వామి, అర్చకస్వాములు రామలింగేశ్వరశర్మ, నండూరు వర వెంకట సుధాకర శర్మ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకోవాలని కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు కోరారు.

# నగరంలో అభివృద్ధి పనులు పూర్తయ్యాక బిల్లుల చెల్లింపు 'నిధి' పోర్టల్‌లో అప్లోడ్ చేయాలి : కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 12, (ప్రభాతవార్త) :** గుంటూరు నగరంలోని కార్పొరేషన్ పరిధిలో అన్ని సివిల్ వర్క్స్ కు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిధి పోర్టల్ లో అప్లోడ్ చేయడం జరుగుతుందని నగర కమిషనర్ కె మయూర్ అశోక్ తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత బిల్లులు చెల్లింపు సమయంలో నిధి పోర్టల్ లో ఆన్లైన్లో అప్లోడ్ చేయడం జరుగుతుందన్నారు.





కాంట్రాక్టర్లకు బిల్లులు ఆన్లైన్ ద్వారానే చెల్లింపులు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం నిధి పోర్టల్ లో వర్క్స్, బిల్లులు అప్లోడ్ పై ఏపీ సి ఎస్ ఎఫ్ ఎఫ్ అధికారుల ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, అకౌంట్స్, ఆడిట్ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పరిపాలనలో, అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులో పారదర్శకతకు రాష్ట్ర ప్రభుత్వం నిధి పోర్టల్ లో డిజిటల్ ఎం బుక్, ఇతర వివరాలు అప్లోడ్ చేయాలని మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. సివిల్ పనులకు సంబంధించి అన్ని దశలు అంటే పరిపాలన అనుమతులు, సాంకేతిక అనుమతులు, ఒప్పందం నిర్వహణ, మెజర్మెంట్ బుక్ నమోదు, బిల్లుల చెల్లింపు ప్రక్రియ పూర్తిగా నిధి మ్యాడుల్ ద్వారానే నిర్వహించబడుతుందన్నారు. ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగం లోని అన్ని క్యాడర్ అధికారులకు నిధి పోర్టల్ పై ప్రాథమిక శిక్షణ ఇచ్చినప్పటికీ పనుల నాణ్యతను మరింత మెరుగుపరచడం, పనుల ప్రక్రియను వేగవంతం చేయటకు ఏపీ సి ఎఫ్ ఎస్ ఎస్ విభాగానికి చెందిన నలుగురు సభ్యులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.

# నాలుగు కోడ్లు రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం

**- సిఐటియు, కార్మిక సంఘాల నాయకులు**

**పొన్నూరు, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసే వరకు ఉద్యమిస్తామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గురువారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ఐలాండ్ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర తెచ్చిన లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మికుల పాలిట శాపంగా మారిందన్నారు. కేంద్రం నిర్ణయం సంపన్నులకు మేలు చేకూర్చేవిధంగా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆమోదీస్తూ నిర్ణయం తీసుకోవడం చాలా బాధాకరమన్నారు. దేశంలో కేరళ మినహా అన్ని రాష్ట్రాలు మోడికి వంత పాడడం విచారకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తాను చేసిన పొరపాటును గుర్తించి రద్దు చేసిన 29కార్మిక చట్టాలను




పునరుద్ధరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పక్కదారి మళ్లించేందుకు మత వివాదాలను రెచ్చగొడుతున్నారన్నారు. ప్రజలు మతోన్మాదం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దండా లక్ష్మీనారాయణ, నిమ్మకూరి రమేష్‌బాబు, రాంబ్రహ్మాచారి, లక్ష్మి, అనూరాధ, పద్మ, స్వప్న, భవాని, పర్వీన్ తదితరులున్నారు.

# సనాతన ధర్మంతో రాజకీయాలు చేయోద్దు, వైకాపా నాయకులు పద్ధతి మార్చుకోవాలి : ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త :** "సనాతన ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని,కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి తో చెలగాటం మంచిది కాదని ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు నారాయణం వేణుగోపాల్,జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి అన్నారు."గురువారం ఒక ప్రకటనలో వైఎస్సార్‌సిపి నాయకుడు కరుణాకర్‌రెడ్డి వ్యాఖ్యలని ఖండించారు.పవిత్ర తిరుమల లడ్డు విషయంలో సిట్ రిపోర్ట్ ఇచ్చిన తర్వాత తిరుమల క్షేత్రంలో కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి వారికి జరిపే నిత్య కైంకర్యాలు,సనాతన సాంప్రదాయాలను పర్యవేక్షణ చేసే శ్రీపెద జీయర్ స్వామి కూటమి ప్రభుత్వానికి,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి అనుకూలంగా మాట్లాడారని లాబీయింగ్,పైరవీలకు పాల్పడ్డారని అనటం హిందూ సమాజాన్ని అవమాన పరచటమే అన్నారు.వారి హాయాంలో టిటిడి లో జరిగిన తప్పిదాలు లడ్డూ ప్రసాదం,క్యూలైన్లో పాలల్లో కల్తీ,అన్నదానం లో పురుగులు పట్టిన బియ్యం వాడటం,తిరుమల కొండ పై అన్యమత ప్రచారాలను నియంత్రించ లేకపోవడం వంటి తప్పిదాలు మరుగున పెట్టి పెద జీయర్ స్వామి మమ్మల్ని విమర్శించారని అనటం హాస్యాస్పదం అని అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా నిత్యం కోట్లాదిమంది సేవలు అందుకుంటున్న శ్రీవెంకటేశ్వరస్వామి వారి సాంప్రదాయాలను పర్యవేక్షించే పెద జీయర్ స్వామివారిని,మఠాలను,పీఠాధిపతులను విమర్శించడం వాళ్ళని రాజకీయాలకు ముడిపెట్టడం హర్షణీయం కాదన్నారు.ఇప్పటికైనా సిట్ నివేదికను గౌరవిస్తూ తాము చేసిన తప్పులను అంగీకరిస్తూ కరుణాకర్‌రెడ్డి స్వామివారికి క్షమాపణలు కోరుకోవాలని సనాతన సాంప్రదాయాలని పీఠాధిపతులు,మఠాధిపతులను రాజకీయాల్లోకి లాగరాదని హితవు పలికారు.



# జాతీయస్థాయిలో మరో మారు అవార్డు అందుకునేలా మెరుగైన పారిశుధ్యం పై దిష్టి సారించాలి : నగర మేయర్,కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ప్రభాతవార్త) :** గుంటూరు నగరంలో మెరుగైన పారిశుధ్యమే లక్ష్యంగా ప్రజారోగ్య విభాగం అధికారులు,సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి మరో మారు జాతీయస్థాయిలో అవార్డు అందుకునేలా కష్టపడాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పిలుపునిచ్చారు. గురు వారం కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం అధికారులతో కమిషనర్ కే మయూర్ అశోక్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. నగరంలో పారిశుధ్య పనులు ప్రజలు సంతృప్తి చెందాల జరగాలన్నారు. చెత్తను నిరక్ష్యంగా రోడ్లు పై వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భారీ స్థాయిలో అపరాధ రుసుము వసూలు చేయాలని సూచించారు. కమిషనర్ కే మయూర్ అశోక్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో నూరు శాతం చెత్త సేకరణ జరగాలని, తడి పొడి చెత్త విభజన పై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.



అవసరమైన ప్రాంతాలలో రాత్రి సమయాలలో కూడా పనులు చేపట్టాలని ఎం హెచ్ ఓ ను ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, ఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, విఏఎస్ డాక్టర్ నాగేశ్వరరావు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# పేదల విద్యాభ్యాసానికి దాతలు ముందుకు రావాలి

**-మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు**

**పొన్నూరు, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు అన్నారు. మానవతా స్వచ్ఛంద



సంస్థ సభ్యులైన నన్నపనేని హరిబాబు, ఆయన సతీమణి అరుణ జ్ఞాపకార్థం శ్రీకరుణ అనే ఇంజనీరింగ్ విద్యార్థినికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్న ప్రతి ఒక్కరూ ధన్యులేనన్నారు. ఇంజనీరింగ్ ద్వితీయసంవత్సరం చదువుతున్న ప్యాపర్రు గ్రామానికి చెందిన శ్రీకరుణకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ఈ సంస్థ రాబోయే రోజుల్లో మరింత మందికి చేయూతనిచ్చేవిధంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి నారాయణ, సభ్యులు నరసింహారావు, సుబ్రహ్మణ్యం, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**-కార్మిక, కర్షక సంఘాల డిమాండ్**

**చేబ్రోలు(పొన్నూరు), ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా చేబ్రోలు మండలంలోని ఉపాధ్యాయ భవన్ నుంచి ముట్లూరు బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటీయూ జిల్లా నాయకులు చింతల శ్రీనివాసరావు,యుటిఎఫ్ జిల్లా కర్యాదర్శి జి.వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ మండల కార్యదర్శి రాధా




మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాన్ని రద్దు చేసి లేబర్ కోడ్లు తీసుకొచి ్చందన్నారు. దీని వల్ల దేశంలోని 50కోట్ల కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ప్రస్తుత చట్టాల ప్రకారం 8గంటలకు మించి పని చేయకూడదని, కొత్త లేబర్ కోడ్లలో 8గంటలకు మించి పని చేయించుకునేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. 2014పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తామని హామీ ఇచ్చి 11సంవత్సరాలు నిండినప్పటికీ అమలు చేయలేదన్నారు. దీంతో వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగి గిట్టుబాటు ధరలు రాక పెద్ద సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ,ఆశ, ఎండిఎ తదితర స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీ చట్టాన్ని యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు,యుటిఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ధర్మకర్తలమండలి ప్రమాణస్వీకారోత్సవము

**గుంటూరు ఈస్ట్ క్రైమ్, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** పెదకాకాని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము నూతన పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవము గురు వారం ఘనంగా జరిగింది. మొత్తం 13 మంది పాలకమండలి సభ్యులతో పాటు ఎక్స్ ఆఫిషియో సభ్యునిగా ఆలయ ఉప ప్రధాన అర్చక పేటేటి ధనమహేశ్వర ప్రసాద్‌లచే ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ ప్రమాణ స్వీకారము చేయించారు. అనంతరతము యమ్.యల్.ఎ నరేంద్ర కుమార్ గారి సమక్షములో సభ్యులు బాధ్యతలు చేపట్టినారు. దేవస్థానము నూతన చైర్మన్‌గా పాలకమండలి సభ్యులైన కోసూరు పూర్ణచంద్రరావును ఏకగ్రీవముగా ఎన్నుకున్నారు. పాలకవర్గసభ్యులైన వరికూటి వీర సుధాకర్ ప్రతిపాదించగా మరో పాలకవర్గ సభ్యుడైన కంభంపాటి వెంకయ్య బలపరచటంతో పూర్ణచంద్రరావును చైర్మన్‌గా ఎన్నికైయారు. ఈ సందర్భముగా పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుచూ పెదకాకాని దేవస్థానము అభివృద్ధికి పాలకమండలి శక్తివంచన లేకుండా కృషిచేయాలన్నారు. రాజధాని



అమరావతి అంతర్‌భాగమైన పెదకాకాని ఆలయాన్నికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని తద్వారా స్వామి వారి అనుగ్రహమును పాలకవర్గ సభ్యులు పొందాలని సూచించారు. దేవస్థానములో జరుగుతున్నటువంటి నిత్య కైంకర్యములు, స్వామి వారి అభిషేకములు ఇతర పూజలలో నిర్విరామముగా నిర్వహించాలని తద్వారా ప్రజలకు సుఖశాంతులు కలగాలని పాడిపంటలు పండాలని అకాక్షించారు.

**దేవస్థాన సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తాం : ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు.**

పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధికి శాసనసభ్యులు నరేంద్రకుమార్ సహకారముతో పాలకమండలి సభ్యుల సమిష్టి భాగస్వామ్యంతో కృషి చేస్తానని దేవస్థాన పాలకమండలి ఛైర్మన్ కోసూరు పూర్ణచంద్రరావు తెలిపారు. పెదకాకాని శివయ్య ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి పనులు జరిపిస్తామన్నారు. ఆలయ సమగ ఆభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయిస్తామని అన్నారు. కాకాని మల్లేశ్వరుడు కల్పించిన ఈ మహాదార్భగానికి జీవితకాలం ఆయన సేవ చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమములో ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్, దేవస్థాన పాలకమండలి ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, చేబ్రోలు వెంకట భాస్కర పున్నారావు, కంభంపాటి వెంకయ్య,కొమ్మూరి మల్లికార్జున రావు, భైరపనేని ధనలక్ష్మీ , కొండలత ,దూపాటి శివ శంకరరావు, వడ్లమూడి సువర్ణలక్ష్మి, పుల్లం రాజేశ్వరి, బండారు మల్లేశ్వరి, వరికూటి వీర సుధాకరరావు, బాణవత్ మంగమ్మ, పాముదుర్తి నాగలక్ష్మి, పేటేటి ధనమహేశ్వర ప్రసాదు యక్స్ అఫిషియో సభ్యులు, జనసేన పొన్నూరు నియోజకవర్గ నాయకులు వడ్రాణం మార్కండేయబాబు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, దేవస్థాన పాలకమండలి మాజీ ఛైర్మన్‌లు, మాజీ సభ్యులు స్థానిక పెద్దలు పాల్నొన్నారు

# ప్రణాళికా బద్దంగా మంచినీటిని సరఫరా చేయాలి

**-మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు**

**పొన్నూరు, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచినీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్దంగా త్రాగునీటి



సరఫరా చేయాలని మునిసిపల్ కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. మునిసిపల్ పరిధిలోని 12వ వార్డులో గురువారం పర్యటించి వార్డులోని సమస్యలను తెలుసుకొన్న ఆయన వందెకరాల చెరువును పరిశీలించారు. వాటర్ ప్లాంట్‌ను, దాని పనితీరును పరిశీలించారు. రాబోయే వేసవిలో నాణ్యమైన శుద్దజలాన్ని క్రమపద్ధతిలో అందించాలన్నారు. త్రాగునీటికి సంబంధించి నీటిని వృధా కాకుండా ఉండేందుకు కూడా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. త్రాగునీటి సరఫరాకు సంబంధించి మరమ్మత్తులు ఏమైనా ఉంటే సకాలంలో పూర్తి చేయాలన్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులపై ఉందన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన వివరాలను మునిసిపల్ ఎఈ హసీనాను అడిగి తెలుసుకొన్నారు. సరఫరాకు సంబంధించి పలు సూచనలు ఎఈకి చేశారు.

# మత సామరస్యాన్ని కాపాడడం అందరి బాధ్యత

**-ఏపి రాష్ట్ర క్రైస్తవ నాయకుడు ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి**

**పొన్నూరు, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఏపి రాష్ట్ర క్రైస్తవ నాయకుడు, ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి అన్నారు. మత సామరస్యం దెబ్బతినకుండా గ్రౌండ్ లెవల్‌లో క్రైస్తవ విద్యార్థులు, విశ్వాసులు, క్రైస్తవ సమాజం యొక్క సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం, నాయకులు, అధికారుల దృష్టికి



తీసుకెళ్ళడానికి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఉదయకాల సమావేశంలో చర్చిస్తామన్నారు. క్రైస్తవులకు ఉన్న రాజ్యాంగబద్దమైన హక్కులు, వారికి ఉన్న ప్రభుత్వ సంస్థలు గురించి, మండల లెవల్ నుంచి నియోజకవర్గ, జిల్లా , రాష్ట్ర, జాతీయస్థాయిలో రాజకీయంగా వారికున్న పదవులు గురించి తదితరాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. లెంట్ డేస్ ప్రారంభమయ్యే భస్మ బుధవారం ఈ నెల 18వ తేదీన పల్నాడు జిల్లా నరసరావుపేటలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 9281506386కి హలో అని వాట్సాప్‌కి మెసేజ్ చేస్తే వివరాలు వస్తాయన్నారు. స్వర్ణాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మోసిగంటి కోరారు.

# దివంగత డాక్టర్ మేరీ గ్లోరీకు అరుదైన గుర్తింపు

**-గుంటూరు కేంద్రంగా పౌరులకు 36ఏళ్ళ నిండైన సేవ -ఆమెకు గౌరవం గుంటూరుకే గర్వకారణం**

గుంటూరు లీగల్,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త : సేవకు ప్రతిరూపంగా నిలిచే గుంటూరు సెయింట్ జోసఫ్ హాస్పటల్ లో 36ఏళ్ళు సుదీర్ఘంగా వేలాదిమంది రోగులకు చికిత్సలుచేసి,తన చేతి స్పర్శతో వారిని ఆరోగ్యవంతులుగా చేసిన దివంగత డాక్టర్ మేరీ గ్లోరీకి అత్యంత అరుదైన గౌరవం దక్కింది.ఆమెను సెయింట్‌గా గుర్తించే క్రమంలో రెండవ దశ అయిన పూజ్యనీయ(వెనేరబుల్) స్థానాన్ని పొందారు.స్థానిక సెయింట్ జోసఫ్స్ పాఠశాల ఆవరణలో డాక్టర్ మేరీ గ్లోరీ కి దక్కిన గౌరవ పురస్కారం సందర్బంగా జె.ఎం.జె.సభ ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవం నిర్వహించారు.జీసస్ మేరీ జోసఫ్‌ల సభ,గుంటూరు విభాగం ప్రొవిన్షియల్ సుపీరియర్ రెవ.సిస్టర్ ఉడుముల విజయమేరీ అధ్యక్షత వహించారు.

**-అమె అందరి మనిషి**

డాక్టర్ మేరీ గ్లోరి 1887, జూన్ 23న ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలో జన్మించారు.కరుణ,సేవాభావంతో ఉన్నత విలువలు కలిగిన ఆదర్శవంతమైన క్యాథలిక్‌గా పెరిగారు.ఎన్నో ప్రత్యేకతలను చాటుకుంటూ, అన్నింటిలో ఉత్తమురాలిగా జీవితంలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించేవారు. బాల్యం నుండే మేరీ తన తల్లిదండ్రులు,తోబుట్టువులతో పాటు ఉపాధ్యాయుల ప్రేమాభిమానాన్ని,అభినందనలను నిత్యం అందుకునేవారు

**-మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయ తొలి మహిళ వైద్య విద్యార్థి**

మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయంలో వైద్య విద్యను అభ్యసించిన మొదటి ముగ్గురు మహిళల్లో ఆమె ఒకరు,న్యూజిల్యాండ్ లో ఉన్న క్రైస్ట్ హాస్పటల్‌లో మొదటి మహిళా డాక్టర్‌గా ఆమె గుర్తింపు పొందారు.మహిళలు,బాల బాలికల అభ్యున్నతి కోసం 1916లోస్థాపించబడిన క్యాథలిక్ విమెన్స్ సోషల్ గిల్డ్ కు ఆమె మొదటి అధ్యక్షురాలిగా పనిచేశారు.

**-గుంటూరుకు చెరిన డాక్టర్ గ్లోరీ ప్రస్థానం**

1920,ఫిబ్రవని 12న డాక్టర్ మేరీ గ్లోరీ గుంటూరులోని సెయింట్ జోసఫ్ కాన్వెంట్‌కు చేరుకోవడం,భారతదేశంలోని సొసైటీ ఆఫ్ జీసస్ మేరీ జోసెఫ్(జెఎంజె) చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది.భారతదేశంలోని జె.ఎం.జె.మఠకన్యగా శిక్షణ తీసుకోవడంలో మొదటి అభ్యాసకురాలిగా నిలిచారు.క్యాథలిక్ అత్యున్నత సభ పోప్ నుండి ప్రత్యేక అనుమతి పొంది,వైద్య,మిషనరీ సేవలను మిళితం చేసిన మొదటి నన్ డాక్టర్ మిషనరీ గా ఆమె మారారు.1943లో క్యాథలిక్ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ను స్థాపించి దానికి తొలి అధ్యక్షురాలిగా వ్యవహరించారు.గుంటూరులో 36ఏళ్ళపాటు డాక్టర్‌గా సేవలు అందించారు.విజయాలతో పాటు ఆమె అంతర్గత సౌందర్యం అందర్ని ఆకర్షించింది.ఆమె స్వదేశమైన ఆస్ట్రేలియాను విడిచిపెట్టి,భారతదేశ ప్రజల కోసం శ్రమించిన తీరు,వినయం,నిరంతర సేవా దృక్పథం ఎందరికో ఆదర్శంగా నిలిచాయి.

**-వెనుదిరిగి చూడని మహోన్నత వ్యక్తిత్వం**

గుంటూరులో వివిధ ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చే రోగుల సేవలకు అంకితమైపోయిన డాక్టర్ మేరీ గ్లోరీ తమ స్వంత దేశమైన ఆస్ట్రేలియా నుంచి వచ్చాక,ఒక్కసారి కూడా తిరిగి వారి దేశం వెళ్ళలేదు.బెంగళూరులో 1957,మే 5న పరమపదించారు.



**-2013లో దైవ సేవకురాలు (సర్వేంట్ ఆఫ్ గాడ్) పురస్కారం**

ఆమె జీవించిన విశ్వాస భరితమైన,పరిపూర్ణ త్యాగ పూరితమైన, అసాధారణ సేవా జీవితాన్ని గుర్తించి వారి విజ్ఞాపన ప్రార్ధనల ద్వారా ఎంతోమంది పొందిన స్వస్థతలను మేలును గుర్తించి రోమన్ క్యాథలిక్ అత్యున్నత సభ,మేరీ గ్లోరీని ఒక పునీతురాలిగ ప్రకటించే 4 దశల్లో మొదటి దశ దైవ సేవకురాలు అనే పురస్కారానికి అర్హురాలిగ 2013,మార్చి 13న గత పోప్ ఫ్రాన్సిస్ ప్రకటించారు.

**-పూజ్యనీయులు గా ...**

2025 నవంబర్ 21న రెండో దశ అయిన పూజ్యనీయులు అనే గౌరవ బిరుదుకు అర్హురాలిని ప్రస్తుత 14వ లియో పోప్ ప్రకటించారు.ఈ గౌరవ పురస్కారంతో డాక్టర్ మేరీ గ్లోరీ సెయింట్ (పునీతపట్టాని)కి చాలా చేరువలో ఉన్నారని తెలుస్తుంది.

బుధవారం ఉదయం నుండి జరిగిన ఈ ఉత్సవ కార్యక్రమలో ఆస్ట్రేలియా నుండి పూజ్యనీయులు మేరీ గ్లోరీ కుటుంబ సభ్యులు,విశాఖపట్నం ఆర్చ్ బిషప్ ఉడుముల బాల,గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య,విజయవాడ బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు,గుంటూరు విశ్రాంత బిషప్ గాలి బాలి,జెఎంజె సభ సుపీరియర్ జనరల్ రెవ.సిస్టర్ మేరీ కారికాకున్నెల్, క్యాథలిక్ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ రెవ.ఫాదర్ డాక్టర్ మాథ్యూ అబ్రహాం,జెఎంజే సభ భారతదేశ నాలుగు విభాగాల ప్రొవిన్షియల్ సుపీరియర్లు,కౌన్సిలర్లు ప్రత్యేక అతిధులు మరియు ఆహ్వానితులు, గుంటూరు పరిసర ప్రాంతాల్లో తమ వైద్య సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులు, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో పట్టణాల్లో మారు మూల గ్రామాల్లో విద్య,వైద్య, సామాజిక సేవ,వేద వ్యాపక సేవా రంగాల్లో తమ అమూల్యమైన సేవలందిస్తున్న జెఎంజె సభ కన్యకామణులు,గుంటూరు మేత్రాసన గురువులు, ఆహ్వానించిన ఇతర గురువులు,వివిధ ఇతర సభల/సంస్థల కన్యకామణులు,బ్రదర్లు గౌరవాతిధులుగా పాల్గొన్నారు.జెఎంజె సంస్థల్లో సేవలందిస్తున్న సిబ్బంది, సహాయక సిబ్బంది, ఉపాధ్యాయులు,విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

**-మేలు పొందిన ఎందరెందరో**

అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్యసేవలతోపాటు,భగవంతుని నిత్యం ఆరాధించే పూజ్యనీయురాలు మేరీ గ్లోరీ విజ్ఞాపన,ప్రార్ధనల ద్వారా స్వస్థతా మేలు పొందిన అనేకమంది ఈ ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ ఉత్సవాల్లో భాగంగా పూజ్యనీయులు మేరీ గ్లోరీ జీవితచరిత్రను,వారి విశ్వాస,అసాధారన సేవా జీవితాన్ని కళ్ళక కట్టినట్లుగా నృత్య మరియు డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించారు.

# ఎన్‌పీటీఈఎల్ ర్యాకింగ్స్‌లో విజ్ఞాన్స్ యూనివర్సిటీకు ఏప గ్రేడ్

**పొన్నూరు, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీకి ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జాతీయస్థాయి స్వయం ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన ఏఏ గ్రేడ్ లభించిందని యూనివర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వయం ఎన్‌పీటీఈఎల్ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ జాతీయస్థాయిలో 29వ ర్యాంక్ సాధించి ఏఏ గ్రేడ్ సొంతం చేసుకుందన్నారు. ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ ఆన్‌లైన్ కోర్సులలో విజ్ఞాన్స్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొత్తం 4,881కోర్సుల సర్టిఫికెట్లు సాధించారని తెలిపారు. వీటిలో 145గోల్డ్ సర్టిఫికెట్లు, 424 సిల్వర్ సర్టిఫికెట్లు, 2,136ఎలైట్ సర్టిఫికెట్లు, 2,176 సాధారణ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ఉన్నాయన్నారు. అంతేకాకుండా యూనివర్సిటీకి 61ఎన్‌పీఈఈఎల్ స్టార్స్ సర్టిఫికెట్లు లభించడంతో పాటు, 106మంది విద్యార్థులు టాపర్స్‌గా నిలిచారని వెల్లడించారు. 2025 సంవత్సరంలో ఎన్‌పీటీఈఎల్ జూలై నుంచి డిసెంబర్ వరకు నిర్వహించిన వివిధ కోర్సుల్లో విద్యార్థులు చూపిన ఉత్తమ ప్రతిభకు గాను విజ్ఞాన్స్ యూనివర్సిటీకి ఈ ప్రతిష్ఠాత్మక ఏఏ గ్రేడ్ దక్కిందన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ వరుసగా తొమ్మిదవ సారి జాతీయస్థాయిలో టాప్-100లో




స్థానం సంపాదించుకోవడం గర్వకారమని చెప్పారు. ఈ విజయం విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శనం, యాజమాన్యం ప్రోత్సాహం వల్లే సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను పరిశోధన, ఆవిష్కరణలు, ఆన్‌లైన్ లెర్నింగ్ వైపు మరింత ప్రోత్సహిస్తామని తెలిపారు. ఏఏ గ్రేడ్ సాధించడానికి కృషి చేసిన టీం సభ్యులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఇంచార్జి వీసి కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు అభినందించారు.

# సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న పలు కార్మిక సంఘాలు

**తెనాలి టౌన్ ఫిబ్రవరి12(ప్రభాతవార్త):** కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలంటూ, సిఐటియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో, దేశవ్యాప్త సార్వత్రికసమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో






గురువారం పట్టణంలో సమ్మె నిర్వహించారు. కార్మిక, కర్షక, ఉద్యోగసంఘాల మద్దతుతో పాటు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ తెనాలి డివిజన్ కూడా సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నిలిచింది. ఈసందర్బంగా పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటుచేశారు. స్థానిక మున్సిపల్ మార్కెట్ పువంవదిక నుంచి గాంధీచౌక్, బోసురోడ్డు మీదుగా చినరావూరు పార్క్ వరకూ నిర్వహించిన ర్యాలీలో పలు కార్మిక సంఘాలతో పాటుగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్తెనాలి డివిజన్ నాయకులు పాల్గొన్నారు. ప్రదర్శనలో పాల్గునడం జరిగింది. చినరావూరు లోని సత్యనారాయణ పార్క్ వద్ద నిర్వహించిన మానవహారం లో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నాలుగు కార్మికచట్టాలు, కార్మికులపట్ల ఉరితాళ్ళు లాంటివని, వాటితో ఎటువంటి ప్రయోజనం లేదని బాబు ప్రసాద్ విమర్శించారు. అంతేకాకుండా, కార్మిక సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు, బ్యాంకు ఉద్యోగులపై పనిభారం, అంగన్వాడీ, ఆశ, ముఠా, విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో సీఐటీయూ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె.బాబూప్రసాద్ మరియు తెనాలి డివిజన్ సిఐటియూ ప్రధాన కార్యదర్శి షేక్.హుస్సేన్ వలి, పలు కార్మికసంఘాల నాయకులు, మున్సిపల్ కార్మికులు, విద్యుత్ కార్మికులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, దాల్ మిల్, వేర్ హౌస్ ముఠా కార్మికులు, ఫెడరేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# గ్లోబల్ ఏఐ సమ్మిట్ 2026లో ఆర్వీఆర్ జెసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు అరుదైన అవకాశం

**గుంటూరు విద్య ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఢిల్లీలో ఫిబ్రవరి 16 నుండి 20 వరకు నిర్వహించబడనున్న ప్రతిష్టాత్మక గ్లోబల్ ఏఐ సమ్మిట్ లో పాల్గొనేందుకు తమ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థినులు పటాన్. రాఫియా, ధూళిపాళ్ల నేహ లకు అధికారిక ఆమోద పత్రాలు అందుకోవడం అభినందనీయమని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా.జగదీష్ కె. మద్దినేని హర్షం వ్యక్తం చేస్తూ, ఈ సదస్సులో పాల్గొనడం ద్వారా ఆధునిక ఏఐ రంగంలోని తాజా అభివృద్ధులను తెలుసుకోవడంతో పాటు, జాతీయఅంతర్జాతీయ నిపుణులతో మమేకమయ్యే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకోవడం కళాశాలకే గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్లోబల్ ఏఐ సమ్మిట్కు వెళ్లనున్న విద్యార్థినులను గురువారం నాడు కళాశాల సిబ్బంది అభినందించారు. ఈ సమ్మిట్లో భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీతో పాటు పలు దేశాల ప్రతినిధులు పాల్గొననున్నారు. అంతర్జాతీయ టెక్ రంగ దిగ్గజాలు బిల్ గేట్స్, బ్రాడ్ స్మిత్, సుందర్ పిచాయ్, టోనీ బ్లెయిర్, ముకేశ్ అంబానీ, అలెగ్జాండర్ వాంగ్, క్రిస్టియానో అమోన్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై చర్చలు, వర్క్షాప్లు, సైన్స్ ఎక్స్పో, ప్యానెల్ డిస్కషన్లు నిర్వహించబడనున్నాయి .భవిష్యత్తు సాంకేతిక ప్రపంచానికి దిశానిర్దేశం చేసే ఏఐ రంగంలో తమ



కళాశాల విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై అడుగుపెట్టడం గర్వకారణమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం సహా అన్ని విధాల సహకారం అందించేందుకు యాజమాన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా. కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, సి.ఎస్.డి విభాగాధిపతి డా.ఎమ్.వి.పి. చంద్రశేఖర రావు, కళాశాల సి.ఎస్.బి.ఎస్ విభాగాధిపతి డా.ఏ. శ్రీనగేష్, తదితరులు కలరు.

# రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలకు ఏర్పాట్లుపూర్తి

**తెనాలి మున్సిపాలిటీ ఫిబ్రవరి 12(ప్రభాతవార్త):** ఫిబ్రవరి 13న రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎలక్షన్స్ సంబంధించి తెనాలి కోర్టు ప్రాంగణంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని ఎలక్షన్ పోలింగ్ ఆఫీసర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్తెలియజేశారు. తెనాలిన్యాయస్థానంలో 406 మంది న్యాయవాదులు ఓటు కలిగి ఉన్నారని, ప్రతి ఒక్కరుకూడా తప్పనిసరిగా తమ ఐడి కార్డులను తెచ్చుకొని ఓటు వేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 146 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని ప్రతి ఒక్క ఓటరు 23 ప్రాధాన్యత ఓట్లు వేయవచ్చుని, అలాగే ఐదు కంపల్సరీ వేయాలని, ఓటు వేసేటప్పుడు ఓఎన్ఈ వన్, టి డబ్ల్యూఓటు అనే విధంగా రాయాలని, టిక్కు గానీ వన్ అనే సింబల్ గానీ వేస్తే చెల్లుబాటుకాదని, ప్రతి ఒక్కరు కూడా ఈ విషయాన్ని గమనించి



ఓటు వేయవలసిందిగా ఆయన న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అన్నవరం రవి, శంషేర్ బాషా, బిఎంఎస్ దుర్గాప్రసాద్, సీనియర్ న్యాయవాది మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడిబోయిన శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, రాతంశెట్టి సుబ్బారావు, ఆంజనేయులు, సంపతి శివనాగేశ్వరరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎం వర్సిటీలో బిజినెస్ ఫెస్ట్ 'అమేయ'

**మంగళగిరి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఆమేయ26 పేరిట బుధవారం ప్రారంభమైన బిజినెస్ ఫెస్ట్ గురువారం సాయంత్రం ముగిసింది. వర్సిటీలోని పారీ స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు ఏటా ఈ తరహా బిజినెస్ ఫెస్ట్ ను నిర్వహిస్తుంటారు. మేనేజ్మెంట్ కోర్సులు



చదివే విద్యార్థుల్లో సృజనాత్మక వ్యాపార ధృక్పథాలను అలవర్చాలన్న ఆలోచనతో అమేయ పేరిట బిజినెస్ ఫెస్ట్ ను నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్ ఈ ఫెస్ట్ ను లాంఛనంగా ప్రారంభించారు. వివిధ యూనివర్సిటీలు, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు విరివిగా పాల్గొన్న బిజినెస్ ఫెస్ట్ సరికొత్త అంకుర సంస్థల స్థాపనకు శ్రీకారం చుట్టింది. వివిధ యూనివర్సిటీల నుంచి వచ్చిన మేనేజ్మెంట్ విద్యార్థులు 29 జట్లుగా ఏర్పడి నూతన వ్యాపార సంస్థల ఏర్పాటుకు ఆలోచనలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ బిజినెస్ స్టాళ్ల ను పరిశీలించిన నిర్వాహకులు ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎన్ పల్లవి, ధీరజ్ లు విన్నర్ టైటిల్ ను దక్కించుకోగా, మానస్, ధనేష్కుమార్లు రన్నర్స్ గా నిలిచారు. ది బెస్ట్ మేనేజర్ టైటిల్ ను లయోలా కాలేజీ విజయవాడ విద్యార్థి శశాంక్ దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమాన్ని పారి స్కూల్ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్ వీ రమణరావు పర్యవేక్షించారు. ప్రారంభ కార్యక్రమంలో కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా, ప్రొఫెసర్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం హాస్టల్లో ఎలుకల దాడిలో 12మందికి గాయాలు

## - ప్రిన్సిపాల్ సిబ్బంది బాధ్యత రాహిత్యంపై విమర్శలు

**ఎ కొండూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ (కెజిబివి) బాలిక విద్యాలయం మాస్టల్లో నిద్రిస్తున్న బాలికలకు స్థానిక ఎంపిహెచ్సి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ కెజిబివి బాలిక విద్యాలయంలో అధికారుల పర్యవేక్షణ మొక్కుబడిగా పర్యవేక్షణలో పేద విద్యార్థినులు ఈ విద్యాలయంలో బాలికలకు దిక్కులేని వారికి దేవుడే దిక్కు అన్న చందంగా ఉంది. ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో ఈ పేద బాలికల విద్య వసతి సౌకర్యాల కోసం ఖర్చు పెడుతుండగా ఈ విద్యాలయంలో



రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడం కొంతమంది సిబ్బంది స్థానికంగా నివాసం ఉండకుండా విసన్నపేట తిరువూరు తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటూ విధి నిర్వహణ అలసత్వం వహిస్తూ వేళలు పాటించడం లేదని స్థానికంగా లేని కొందరు సిబ్బంది సమయపాలన లేకుండా ఉదయం విధులకు రావడం సాయంత్రం 3 గంటలకే ఇళ్ళకు వెళ్లడం చేస్తున్నారని సమయపాలన పాటించని ఈ విద్యాలయ సిబ్బందిపై స్థానిక తహశీల్దార్ ఎంఈవోపై అధికారుల పర్యవేఓణ పూర్తిగా లేకపోవడంతో బాలికలకు సరైన రక్షణ లేదని బాలికలు ఎలుకల దాడికి గురవ్వడం పూర్తిగా ప్రిన్సిపాల్ సిబ్బంది బాధ్యతా రాహిత్యం కొట్టొచ్చినట్లు కనపడుతోందని బాధిత బాలిక తల్లిదండ్రులు ఈ విద్యాలయానికి రెగ్యులర్ ప్రిన్సిపాల్ స్థానికంగా సిబ్బంది నివాసం ఉండే విధంగా సమయపానలో అలసత్వం లేకుండా చర్యలు తీసుకుని బాలికల భవిష్యత్తు, ఆరోగ్యంకాపాడాలని పేరెంట్స్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ అఫ్రోజ్ను సత్కరించిన డిసిపి

**విజయవాడ కార్పొరేషన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ అఫ్రోజ్ను సైబర్ సురక్షా ఛాంపియన్ మెమెంటోతో డిసిపి కృష్ణప్రసన్న సత్కరించారు. సిపి రాజశేఖరబాబు జీరో టాలరెన్స్ టు సైబర్ క్రైం అనే నినాదంతో సైబర్ నేరాలను అరికట్టడానికి పలు విన్నూత్న కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అన్ని బ్యాంకుల వారికి అవగాహన కల్పించడంతో పాటు



బ్యాంకుకు వచ్చిన కస్టమర్లతో ఒక అకౌంట్ నుండి మరో అకౌంట్కి డబ్బులు ట్రాన్స్ఫర్ చేయాలంటే పోలీసు వారు ఇచ్చిన ప్రశ్నావళిని, పోలీస్ వెబ్సైట్లో ఉన్న డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, ఇతర సైబర్ నేరాల గురించి వెబ్సైట్లో ఉన్న అంశాలు చదవటం ద్వారా స్ఫూర్తి పొందిన ఆయన తన వంతు కృషిగా సదరు ప్రశ్నావళిని బ్యానర్లు చేయించి బ్యాంక్లోని ఆర్టిజిఎస్ పాయింట్లలో వేలాడ తీయించారు. ఎవ్వరైనా అధిక మొత్తంలో సేవింగ్స్ అక్కౌంట్ నుండి కరెంట్ అక్కౌంట్కు డబ్బులు ట్రాన్స్ఫర్ చేయాలనుకునే వారికి తప్పనిసరిగా ఆ ప్రశ్నావళిని చదివించడంతో పాటు సదరు పాంప్లెట్లను వారి అర్జీకి పిన్ చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో గురువారం సిపి ఆదేశాల మేరకు డిసిపి కృష్ణ ప్రసన్న వారి సిబ్బందితో కలిసి మాచవరం ఎస్బిఐ బ్రాంచ్కు వెళ్ళి ఆయనను సైబర్ సురక్షా ఛాంపియన్ అవార్డుతో సత్కరించారు. డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాలు జరగకుండా ప్రతి బ్యాంకుల్లో కూడా అదే విధంగా చేయడం వలన ప్రజలు, వృద్ధులను సైబర్ నేరాల నుండి కాపాడవచ్చని తెలిపారు. అదే విధంగా ఎవరైనా పైన తెలిపిన నేరాల బారిన పడితే వెంటనే 1930కి ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం ఎసిపి రాజశేఖరబాబు, మాచవరం ఇనస్పెక్టర్ డివి రమణ, సైబర్ క్రైం సిఐ దుర్గాప్రసాద్, శ్రీను, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ లక్ష్యానికి అనుగుణంగా బడ్జెట్

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త :** సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ లక్ష్యానికి అనుగుణంగా 2026 బడ్జెట్ ను రూపొందించి, ప్రవేశపెట్టి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారని టుబాకో బోర్డు ఇండియా చైర్మన్ యశ్వంత్ పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామం వద్దనున్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం 2026 బడ్జెట్ పై గెస్ట్ లెక్చర్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా టొబాకో బోర్డు ఇండియా చైర్మన్ చె.యశ్వంత్, భారత వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ, అనిమేష్ బిశ్వాస్, జాతీయ కార్యవర్గ సభ్యులు, భారతీయ జనతా యువ మోర్చా, కాయితి ప్రదీప్తత్త రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ..వరుసగా 9వసారి బడ్జెట్ ప్రవేశపెట్టి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రికార్డ్ సృష్టించారన్నారు. దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ లక్ష్యానికి అనుగుణంగా ఈ బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. కేంద్ర బడ్జెట్ 2026లో వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా ఎగుమతుల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, ఈగవర్నెన్స్ బలోపేతం, ఎగుమతుల ప్రోత్సాహానికి టెక్నాలజీ వినియోగం వంటి చర్యలు భారత వాణిజ్య రంగాన్ని బలపరుస్తాయని తెలిపారు. వ్యవసాయ మరియు అనుబంధ రంగాల్లో ఆధునిక సాంకేతికత వినియోగం పెరగడం ద్వారా ఉత్పాదకత మరియు నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించే విధంగా తీసుకున్న సంస్కరణలు దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయని వివరించారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాల మీద భారీ మొత్తంలో 9 శాతం ఖర్చు చేసేందుకు సిద్ధమైందని, కొత్తగా ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు, పెద్ద నగరాలు రూ.1,000 కోట్ల పైగా మున్సిపల్ బాండ్లు జారీ చేసినట్లయితే రూ. 100 కోట్ల ఇన్సెంటివ్ కల్పిస్తారని పేర్కొన్నారు. చిన్న నగరాలకు అమృత్ స్కీమ్ కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారని, ప్రాంతీయ మెడికల్ హబ్లు ప్రైవేట్ సెక్టార్తో కలిసి ఏర్పాటు చేయనున్నారని వెల్లడించారు. ఈ




హబ్లలో హాస్పిటల్స్, విద్యా సంస్థలు, పరిశోధన కేంద్రాలు, ఆయుష్ సెంటర్లు, డయాగ్నస్టిక్స్, పోస్ట్ కేర్, రిహాబిలిటేషన్ వంటివి ఉంటాయని తెలిపారు. రాష్ట్రాలకు విడుదల చేసే వాటా 41శాతంగానే కొనసాగిస్తూడేటా సెంటర్లు, క్లౌడ్ సర్వీసెస్లో పెట్టుబడులు పెరిగేలా కీలక నిర్ణయం తీసుకున్నారని, దేశంలో డేటా సెంటర్ సర్వీసెస్ ఉపయోగించి ప్రపంచ వ్యాప్తంగా క్లౌడ్ సర్వీసెస్ అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు టాక్స్ హాలిడే ప్రకటించారని చెప్పారు. అనిమేష్ బిశ్వాస్ మాట్లాడుతూ స్టార్టప్లు, ఇన్నోవేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ టెక్నాలజీ వంటి రంగాలకు ప్రోత్సాహం ఇవ్వడం యువతకు విశేష అవకాశాలు కల్పిస్తుంద న్నారు. దేశంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం సృష్టించడం ద్వారా ఉద్యోగావకాశాలు పెరుగుతాయని తెలిపారు. టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి మరియు పెట్టుబడుల వృద్ధి ద్వారా వికసిత భారత్ లక్ష్య సాధన వేగవంతమవుతుందని, మధ్య తరగతి ప్రజలకు పన్ను సడలింపులు, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు ఆర్థిక మద్దతు దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలపరుస్తాయని తెలిపారు. వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో ఈ బడ్జెట్ కీలక పాత్ర పోషిస్తుందనే విశ్వాసం వ్యక్తంచేశారు. అనంతరం అతిధులను శాలువా, మెమొండోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, కళాశాల ప్రిన్సిపల్ డా.పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్సాహభరితంగా ఎస్ఈఆర్పి ప్రాజెక్ట్ డైరెక్టర్ల సమావేశం

**పెనమలూరు ఫిబ్రవరి12, ప్రభాతవార్త :** ఎస్ఈఆర్పి ప్రాజెక్ట్ డైరెక్టర్ల రెండురోజుల సమావేశం గురువారం పోరంకి మురళీరిసార్ట్స్ లో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి సోషల్ ఎలిమినేషన్ రూరల్ పోవర్టీకు చెందిన అధికారులు పాల్గొని విజయవంతం చేసారు. ఈ సమావేశానికి ఎస్ఈఆర్పి సీఈవో, డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, అన్ని జిల్లాల నుంచి జిల్లాప్రాజెక్ట్ మేనేజర్లు




డిపియంఎస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఈఆర్పి ఎన్ఆర్ఐ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్ఈఆర్పి ద్వారా అమలవుతున్న ఐబి, ఎంఎన్ఏఆర్ఐ, సిఐఎఫ్, మన డబ్బులు - మన లెక్కలు, జీవనోపాదులు, పియంఈజిపి సియంఏజెఏవై తదితర ప్రధాన అభివృద్ధి కార్యక్రమాలపై లోతైన చర్చలు నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత దిశగా వారు చూపుతున్న నిబద్ధతను అభినందించారు. మార్చి8వ తేదీ అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఎస్ఈఆర్పి 25సంవత్సరాల వేడుకలలో ముఖ్య ప్రకటనలు ఉంటాయని తెలియజేసారు.

# సిఎంఏ ఫలితాలలో ఆల్ఇండియా స్థాయిలో ప్రభంజనం సృష్టించిన మాస్టర్ మైండ్స్ విద్యార్థులు

**గుంటూరు విద్య ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా" వారు ప్రకటించిన సీఎంఏ ఫలితాలలో ప్రముఖ విద్యాసంస్థ మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అఖిలభారత స్థాయిలో 25 ఆల్ఇండియా ర్యాంకులు సాధించారనీ, సి.ఎం.ఏ ఫైనల్ లో మొదటి 50 ర్యాంకులలో ఆల్ ఇండియా 16వ ర్యాంకు, 17వ ర్యాంకు, 30వ ర్యాంకు, 31వ ర్యాంకు, 40వ ర్యాంకు సాధించినట్లు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ సి.ఏ . మట్టుపల్లి మోహన్ తెలిపారు. సి.ఎం.ఏ ఇంటర్ లో మొదటి 50 ర్యాంకులలో ఆల్ ఇండియా 5వ ర్యాంకు, 13వ ర్యాంకు, 21వ ర్యాంకు, 22వ ర్యాంకు, 25వ ర్యాంకు, 27వ ర్యాంకు, 28వ ర్యాంకు, 32వ ర్యాంకు, 35వ ర్యాంకు, 37వ ర్యాంకు, 37వ ర్యాంకు (ఇద్దరు విద్యార్థులు), 39వ ర్యాంకు, 41వ ర్యాంకు, 42వ ర్యాంకు, 46వ ర్యాంకు, 47వ ర్యాంకు, 47వ ర్యాంకు (ఇద్దరు విద్యార్థులు), 48వ ర్యాంకు, 49వ ర్యాంకు, 49వ ర్యాంకు (ఇద్దరు విద్యార్థులు) సాధించినట్లు మోహన్ తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగినటువంటి ఈ పరీక్షలలో గుంటూరు ఎగ్జామ్ సెంటర్ నుండి 23 మంది విద్యార్థులకు ఆల్ఇండియా ర్యాంకులు వచ్చాయని తెలిపారు. కలకత్తా, ముంబాయ్, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై లాంటి మెట్రో సిటీస్ ను కూడా అధిగమించి ఆల్ ఇండియా లెవెల్ లో ఎక్కువ ర్యాంకులు వచ్చినటువంటి ఎగ్జామ్ సెంటర్గా గుంటూరు ప్రథమ స్థానం సాధించిందని మోహన్ పేర్కొన్నారు.



# మహా శివరాత్రికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి12, ప్రభాతవార్త :** రానున్న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దేవాలయములో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అధికారులను, అర్చకులను సమన్వయం చేసుకుంటూ పరిపాలన సాగించాలని పెదకాకాని శ్రీ గంగా భ్రమరాంబిక మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమితులైన వారికి ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకట రత్తయ్య సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమింపబడిన శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి ధర్మకర్తల మండలి సభ్యులు కు అభినందనలు



తెలియజేశారు. వెంకట రత్తయ్య మాట్లాడుతూ పెదకాకాని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమితులై నేడు ప్రమాణ స్వీకారం చేసిన పొన్నూరుకు చెందిన చేబ్రోలు వెంకట భాస్కర్ పున్నారావు, పెదకాకానికి చెందిన బండారు మల్లేశ్వరి, గుంటూరుకు చెందిన వరికూటి వీరసుధాకర్ లను ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టి ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య దుశ్శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఎల్లప్పుడూ భక్తులకు అన్ని రకాల సేవలను అందుబాటులో వుండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలియజేశారు. దేవస్థానాన్ని అభివృద్ధి చేసి పాలక మండలికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు యర్రగోపుల జయదీప్, మైలా బుజ్జి, హరి, సుబ్బారావు, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# 21న అవార్డుల ప్రధానోత్సవం

**విజయవాడ, ఫిబ్రవరి12, ప్రభాతవార్త:** 2024 సంవత్సరంలో విడుదలైన చిత్రాల కోసం మలయాళం, కన్నడ, తమిళం మరియు తెలుగు సినిమాల్లో అత్యుత్తమ ప్రతిభను మరియు సినిమా నైపుణ్యాన్ని గౌరవిస్తూ, కేరళ టూరిజంతో 70వ ఫిల్మ్ఫేర్ అవార్డ్స్ సౌత్ కోసం నామినేషన్లను ప్రకటించింది. ఈ సందర్భంగా కేరళ ప్రభుత్వ టూరిజం విభాగ పబ్లిక్ వర్క్స్ ప్రతినిధి పి.ఎ. మొహమ్మద్ రియాస్, టైమ్స్ టెలివిజన్ నెట్వర్క్ డిజిటల్, టైమ్స్ స్ట్రాటజిక్ సొల్యూషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ రోహిత్ గోపకుమార్, మాట్లాడుతూ ఈ సౌత్ ఫిలింఫేర్ అవార్డుల ప్రధానోత్సవం కొచ్చి ఫిబ్రవరి 21 న అడ్లక్స్ ఇంటర్నేషనల్ కాన్వెంట్ సెంటర్లో జరుగుతాయని తెలిపారు. మలయాళం, తమిళ్, కన్నడ, తెలుగు సినిమాల నామినేషన్లు ప్రకటించబడ్డాయన్నారు. దక్షిణ భారత సినిమా అంతటా శ్రేష్ఠతను గుర్తించే ల్యాండ్మార్క్ 70వ ఫిల్మ్ఫేర్ అవార్డ్స్ సౌత్ వేడుకను నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రం చాలా కాలంగా చిత్రనిర్మాతలకు ఇష్టమైన కాన్వాస్గా ఉంది, ఉత్కంఠభరితమైన ప్రకృతి దృశ్యాలు, గొప్ప సాంస్కృతిక వారసత్వం మరియు కథా కథనాలకు లోతైన అనుబంధాన్ని అందిస్తోందన్నారు. ఫిల్మ్ టూరిజం మరియు క్రియేటివ్ ఎక్స్ఛేంజ్ కోసం ఒక శక్తివంతమైన కేంద్రం అని. "మొట్టమొదటిసారిగా మా మార్క్యూ ఫిల్మ్ఫేర్ అవార్డ్స్ సౌత్లో కేరళ రాష్ట్రంలో నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. కేరళ సౌత్ ఇండియా యొక్క సహజత్వం మరియు కంటెంట్ను రూపొందించడానికి ఒక భారీ సహకారం అందించిందని, మలయాళ చలనచిత్ర పరిశ్రమలో ఈ సంఘటన జరగడం పట్ల ఉల్లాసంగా ఉన్న దక్షిణ భారత చలనచిత్రం ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ కథల యొక్క శక్తివంతమైన పునరుద్ధరణకు దారితీసింది ఐకమత్యం, వారసత్వం మరియు సినిమా భవిష్యత్తు కోసం మేము దీన్ని సాధ్యం చేసినందుకు మా భాగస్వాములకు, కేరళ టూరిజం మరియు కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీకి ధన్యవాదాలు తెలిపారు. కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీ వ్యవస్థాపకుడు కమర్ డి మాట్లాడుతూ, "కమర్ ఫిల్మ్ ఫ్యాక్టరీలో, సినిమా ఎల్లప్పుడూ మా ప్రయాణానికి గుండెకాయగా ఉంటుంది మరియు 70వ ఫిల్మ్ఫేర్ అవార్డ్స్ సౌత్ కోసం ఫిల్మ్ఫేర్తో భాగస్వామ్యం అనేది భాగస్వామ్య విలువల యొక్క సహజమైన అమరిక అన్నారు.

# రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత యోగశిక్షణా తరగతులు ప్రారంభం

**తెనాలి మున్సిపాలిటీ ఫిబ్రవరి 12(ప్రభాతవార్త):** రోటరీక్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో, గురువారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఈ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో ఉచిత యోగ శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ శిక్షణా క్లాసులు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు జరుగునని, కావున ఆసక్తికలిగిన వారు ఈ యోగ శిక్షణలో పాల్గొనవలసిందిగా క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నల్లూరు వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ, యోగా గురువు మేడూరి ఉదయ్ భాస్కర్, రోటరీ డిస్ట్రిక్ట్ 3150 అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్, జాయింట్ సెక్రటరీ గుత్తా వెంకటరత్నం, గుమ్మడి ప్రసాద్, మల్లాది అర్జున, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బాలుడు ఆదృశ్యం పై కేసు నమోదు

**గుంటూరు ఈస్ట్ క్రైమ్, ఫిబ్రవరి12, ప్రభాతవార్త:** బాలుడు ఆదృశ్యంపై కేసు నమోదు అయిన సంఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. గుంటూరు నగరంలోని రైలుపేటకు చెందిన 13 సంవత్సరాల అంబవరపు సుమంత్ అనే బాలుడు ఫిబ్రవరి 5వ తేదిన ఇంటి నుండి అలిగి వెళ్లిపోయ్యాడు. సాయంత్రం అయిన ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు చుట్టుపక్కల వారిని విచారించిన ప్రయోజనం లేకపోవడంతో కొత్తపేట పోలీస్ స్టేషన్ ను. ఆశ్రయించారు. బాతుని ఫిర్యాదు మేరకు కొత్తపల్లి సీఐ వీరయ్య కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు కొత్తపేట పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ కు కొత్తపేట ఎస్ ఐ. శ్రీనివాసరావు కు 8688831320. తెలియపరచగలరు

# నిరుద్యోగులకు ఉద్యోగాన్ని కల్పించడమే జాబ్మేళా ముఖ్య ఉద్దేశం

**విజయవాడ కార్పొరేషన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** నిరుద్యోగులకు ఉద్యోగాన్ని కల్పించడమే జాబ్మేళా ముఖ్యోద్దేశ్యమని నగరపాలక సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్(యుసిడి) ఎం.విజయలక్ష్మి పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో మెప్మా అధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జాబ్మేళాను నిర్వహించారు. ఈ మేళాలో 700 మంది అభ్యర్థులు రాగా 340 ధరఖాస్తులు చేసుకున్నారని, 62 మంది అభ్యర్థులు ఉద్యోగం పొందరని ఆమె పేర్కొన్నారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్లో భాగంగా నిరుద్యోగులకు ఉద్యోగాన్ని కల్పిస్తూ వారిని



ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని, నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ ఇటువంటి విషయాలపై కృషి చేస్తుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఎక్స్పర్ట్ సుజాత, యుసిడి సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధులైన సేవకులకు ఆర్థిక సహాయం

**కొల్లిపర, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త:** స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో రెవ.కె.జాకోబ్ ఆధ్వర్యంలో జరిగిన కొల్లిపర మండల సేవకుల సమావేశంలో వృద్ధులైన సేవకులకు ఆర్థిక సహాయం అందజేశారు. సేవకులకు నమ్మకమైన సేవ చేయాలనే దేవుని వాక్యం గురించి ఫాస్టర్స్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రెవ.బి.ఇస్సాకు, రెవ.షేక్.ఇశ్రాయేలు, సిహెచ్.లూదర్పాల్, రెవ. యోహాన్, రెవ.జయపాల్, రెవ.పి.శ్యాంసన్ , సేవకులు పాల్గొన్నారు.



13-2pg12 VJA_13-2pg10exC.qxd 12/Feb/26 10:05 PM Page 1






# టి20 వరల్డ్ కప్‌లో శ్రీలంక జోరు

## ఒమెన్‌పై 105 రన్స్ తేడాతో సూపర్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో శ్రీలంక జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. గ్రూప్ బీ లో భాగంగా పల్లెకెలె వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 105 పరుగుల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక పూర్తి ఆధిపత్యం చెలాయించగా, ఒమన్ తేలిపోయి కనీస పోటీనివ్వలేకపోయింది. ఈ విజయంతో గ్రూప్ బీ నుంచి సూపర్ 8 అవకాశాలను మెరుగుపర్చుకోగా, ఒమన్ ఇంటిబాట పట్టేందుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 225 పరుగులు చేసింది. కుశాల్ మెండీస్(45 బంతుల్లో 7 ఫోర్లతో 61), పవన్ రత్నాయక(28 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 60), దసన్ షనక(20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఒమన్ బౌలర్లలో జితెన్ రమణంది(2/41) రెండు వికెట్లు తీయగా, జయ్ ఒడెద్రా, సుఫ్యాన్ మెహ్మూద్ చెరో వికెట్ తీసారు. అనంతరం ఒమన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 120 పరుగులు చేయగలిగింది. మహమ్మద్ నదీమ్(56 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 53 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో దుష్మంత్ చమీరా(2/19), మహీష్ తీక్షణ(2/11) రెండేసి వికెట్లు తీయగా, దునిత్ వెల్లలేగే, దుషన్ హేమంత, కామిందు మెండీస్ తలో వికెట్ తీసారు. ఈ గెలుపుతో శ్రీలంక గ్రూప్‌బీలో టాపర్‌గా కొనసాగుతోంది.




# వరల్డ్‌కప్ అరంగేట్రంలో సంచలనం..

## అనామక ఇటలీ చేతిలో చిత్తైన నేపాల్

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో పసికూన ఇటలీ సంచలనం సృష్టించింది. ముంబయి వేదికగా గురువారం నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చిన్న జట్టు ఇటలీ అరంగేట్రంలోనే మాతో జాగ్రత్త అనే హెచ్చరికలు పంపుతూ బోణీ కొట్టింది. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను వణికించిన నేపాల్‌ను గడగడ వణికిస్తూ జయభేరి మోగించింది. ఓపెనర్ల విధ్వంసంతో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్‌మని ఊదేసి. మేము చెలరేగితే ఇలా ఉంటది అని చాటింది. ఊహించని ఓటమితో నేపాల్ షాక్‌లో కూరుకుపోయింది. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఇటలీ 12.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు జస్టిన్ మోస్కా (60 పరుగులు), ఆంథని మోస్కా (62 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దీంతో 44 బంతులు మిగిలుండగానే ఇటలీ విజయం సాధించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆరిఫ్ షేక్ (27 పరుగులు), రోహిత్ పౌడెల్ (23 పరుగులు), ఆసిఫ్ షేక్ (20 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ 2, అలీ హసన్, జస్ప్రీత్ సింగ్, సమ్స్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఇదే టోర్నీలో రీసెంట్‌గా తొలి మ్యాచ్‌లో పటిష్ఠమైన ఇంగ్లాండ్‌ను ఓడించినంతపని చేసిన నేపాల్ ఈ మ్యాచ్‌లో కనీసం పోటీ ఇవ్వకపోవడం గమనార్హం. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇటలీ రెండో మ్యాచ్‌తో టోర్నీలో బోణీ కొట్టింది.

### షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# ఐశ్వరీ ప్రపంచ రికార్డు




**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ 2026లో భారత్‌కు చెందిన షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ ప్రపంచ రికార్డు సాధించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పి ఈవెంట్‌లో స్వర్ణం గెలుచుకున్నాడు. గురువారం ఢిల్లీలో జరిగిన షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో ఐశ్వర్య అద్భుత ప్రదర్శన కనపరిచాడు. రెండుసార్లు ఒలింపియన్ అయిన తోమర్, నీరజ్ కుమార్‌ను కేవలం 0.2 పాయింట్ల తేడాతో ఓడించి ఆసియా ఛాంపియన్‌గా నిలిచాడు. పోటీలో చివరి షాట్ కంటే 0.2 పాయింట్లు వెనుకబడి, తోమర్ అద్భుతమైన 10.7 పాయింట్లు సాధించి తన మొత్తం 362 పాయింట్లను ప్రపంచ రికార్డుగా నమోదు చేశాడు. నీరజ్ తన చివరి షాట్‌లో 10.3 పాయింట్లు మాత్రమే సాధించి రజతంతో సరిపెట్టుకున్నాడు. అనుభవజ్ఞుడైన అఖిల్ షెరాన్ కాంస్య పతకం కోసం మూడవ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో అతను 343.5 స్కోరుతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అంతకుముందు నీరాజ్ 593 స్కోరుతో క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత స్వాప్నిల్ కుసాలే ఈ ఖండాంతర పోటీలో పాల్గొనలేదు.

### ఆసియా ఫుట్‌బాల్ కప్‌లో

# భారత్ మహిళల, పురుషుల జట్లు డ్రా

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి అండర్17 ఆసియాకప్-2026లో భారత ఫుట్‌బాల్ జట్లు కఠినమైన పోటీలో మ్యాచ్‌లను డ్రా గా ముగించాయి. కౌలాలంపూర్‌లో గురువారం జరిగిన ఫైనల్ డ్రాలో ఎఎఫ్‌సి అండర్ 17 మహిళల ఆసియా కప్ గ్రూప్ బి లో జపాన్, ఆస్ట్రేలియా, లెబనాన్‌లతో కలిసి భారత్ జట్టు డ్రాగా ముగించింది. ఇదే సమయంలో ఎఫ్‌సి అండర్ 17 పురుషుల ఆసియా కప్ గ్రూప్ డి లో ఉజ్బెకిస్తాన్, ఆస్ట్రేలియా మరియు డిపిఆర్ కొరియాతో కలిసి ఉంది. క్వాలిఫయర్స్‌లో ఇరాన్, లెబనాన్, పాలస్తీనా, చైనీస్ తైపీలను అధిగమించి భారత్ చరిత్రలో 10వ సారి ఎఎఫ్‌సి అండర్17 ఆసియా కప్‌కు అర్హత సాధించింది. బ్లూ కోల్ట్స్ జట్టు ఆస్ట్రేలియాతో తమ ప్రచారాన్ని ప్రారంభించి, ఆ తర్వాత ఉజ్బెకిస్తాన్ మరియు డిపిఆర్ కొరియాతో తలపడుతుంది. ఉజ్బెకిస్తాన్ డిఫెండింగ్ ఛాంపియన్ కావడంతో ఈ టోర్నమెంట్‌కు స్వయంచాలకంగా అర్హత సాధించింది. గత 2025 ఎడిషన్‌లో ఆస్ట్రేలియా గ్రూప్ దశలోనే ఓడిపోయింది మరియు జోర్డాన్, భూటాన్, ఫిలిప్పీన్స్‌పై విజయాల తర్వాత 2026 టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. రెండుసార్లు మాజీ ఛాంపియన్లు అయిన డిపిఆర్ కొరియా 2025లో సెమీఫైనలిస్టులుగా నిలిచింది. తద్వారా ప్రస్తుత ఎడిషన్‌కు ఇప్పటికే అర్హత సాధించింది. గ్రూప్ ఎ లో ఆతిథ్య సౌదీ అరేబియా తజికిస్తాన్, థాయిలాండ్, మయన్మార్‌లతో డ్రా చేసుకుంది.

### టి20 వరల్డ్ కప్‌లో..

# గ్రూప్ ఆఫ్ డెత్‌లో అఫ్ఘానిస్థాన్

## సూపర్ 8 నుండి ఒమెన్, ఐర్లాండ్ ఔట్



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్-2026లో ఆఫ్ఘనిస్తాన్ వరుసగా రెండు పరాజయాలను చవిచూసింది. దీంతో వారు సూపర్ 8 దశకు అర్హత సాధించే విషయం కష్టక్లిష్టంగా మారింది. ఇక రెండు మ్యాచ్‌లకు రెండు ఓడిన ఐర్లాండ్, ఒమన్ సూపర్ 8 రేసు నుంచి తప్పుకున్నాయి. కాగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో సూపర్ ఓవర్‌లో ఉత్కంఠభరితమైన ఓటమి తర్వాత ఆఫ్ఘనిస్తాన్ ప్రపంచ కప్‌కు వెళ్లే మార్గం మరింత కష్టతరంగా మారింది. కానీ సూపర్ 8 రౌండ్‌కు చేరుకోవాలనే వారి ఆశలు ఇంకా పూర్తిగా ముగియలేదు. దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయిన తర్వాత ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడవలసి ఉంటుంది. ఆఫ్ఘన్ ఇప్పుడు వారి నికర రన్ రేట్‌ను మెరుగుపరచుకోవడానికి యుఎఇ, కెనడాతో జరిగే మిగిలిన రెండు గ్రూప్ మ్యాచ్‌లను పెద్ద తేడాతో గెలవాల్సి న పరిస్థితి తప్పనిసరి అయింది. ఆఫ్ఘనిస్తాన్ జట్టు సూపర్ 8 కి అర్హత సాధించడానికి రెండు కీలక పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మొదటి సందర్భంలో, న్యూజిలాండ్ దక్షిణాఫ్రికాను ఓడిస్తే, యుఎఇ దక్షిణాఫ్రికాను ఓడించి, కెనడా యుఎఇని ఓడిస్తే ఆఫ్ఘనిస్తాన్‌కు ఒకింత సూపర్ 8కి అవకాశాలు ఉంటాయి. ఈ సందర్భంలో న్యూజిలాండ్ గ్రూప్ డిలో అగ్రస్థానంలో ఉంటుంది. అయితే ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా 4 పాయింట్లతో సమానంగా ఉంటాయి. ఇక్కడ నిర్ణయం నికర రన్ రేట్ ఆధారంగా ఉంటుంది. దీంతో పెద్ద తేడాతో గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ తదుపరి రౌండ్‌కు టికెట్ పొందవచ్చు. రెండవ సమీకరణం న్యూజిలాండ్‌ను ఓడిస్తే, దక్షిణాఫ్రికా 8 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంటుంది. ఈ సందర్భంలో, కెనడా న్యూజిలాండ్‌ను ఓడించి, ఆపై యుఎఇ కెనడాపై గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ మరియు న్యూజిలాండ్ రెండూ చెరో 4 పాయింట్లు కలిగి ఉంటాయి.

మరోసారి, సూపర్ 8కి చేరుకున్న రెండవ జట్టు నికర రన్ రేట్ ద్వారా నిర్ణయించబడుతుంది. దీనిలో ఆఫ్ఘనిస్తాన్ న్యూజిలాండ్ కంటే మెరుగైన స్థితిలో ఉండాలి. ఇక ఈ టోర్నమెంట్‌లో మూడు బలమైన జట్లను కలపడంతో దీన్ని గ్రూప్ ఆఫ్ డెత్ గా పరిగణించారు. ఈ గ్రూప్‌లో బలమైన ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ మరియు దక్షిణాఫ్రికా ఒకదానిపై ఒకటి పోటీపడుతున్నాయి. గత టీ20 ప్రపంచ కప్‌లో సెమీ ఫైనలిస్ట్ అయిన ఆఫ్ఘనిస్తాన్ ప్రస్తుతం కీలకమైన క్లిష్టపరిస్థితిని ఎదుర్కొంటోంది. రషీద్ ఖాన్, అతని బృందం తదుపరి ఈ నె 16న యుఎఇతో మరియు ఫిబ్రవరి 19న కెనడాతో తలపడనుంది.




### పురుషుల ప్రో లీగ్..

# భారత్ ఓటమి

## 3-1తో బెల్జియం విక్టరీ


**న్యూఢిల్లీ:** పురుషుల ప్రో లీగ్ 2025-26లో బెల్జియం చేతిలో భారత్ ఓటమిపాలయింది. పురుషుల ప్రో లీగ్ రూర్కెలా లెగ్‌లో బెల్జియం భారత్‌ను 3-1 తేడాతో చిత్తు చేసింది. బెల్జియం తరపున నెల్సన్ ఓనానా (23వ నిముషం), థామస్ క్రోల్స్ (53), ఆర్నో వాన్ డెస్సెల్ (57) గోల్స్ సాధించగా, భారత్ తరపున శిలానంద్ లక్రా (29) గోల్స్ చేశాడు. బెల్జియంకు 4వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ లభించింది, అయితే, అలెగ్జాండర్ హెండ్రిక్స్ డ్రాగ్‌ఫ్లిక్‌ను భారత తొలి రషర్ వివేక్ సాగర్ ప్రసాద్ ఆపాడు. బెల్జియం (14) మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ ఈసారి టామ్ బూన్ అడ్డుకోవడంతో లక్ష్యం నుండి తృటిలో దూరమైంది. రెండవ క్వార్టర్‌లో (21) బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించినా భారత గోల్ కీపర్ పవన్ అలెగ్జాండర్ హెండ్రిక్స్ గోల్ చేయకుండా నిరోధించాడు. బెల్జియంకు చెందిన థామస్ క్రోల్స్ గోల్ సాధించాడు. కానీ పవన్ తన గోల్‌ను కాపాడుకోవడానికి మరో కీలకమైన సేవ్ చేశాడు. ఈ సమయంలో థామస్ బంతిని నెల్సన్ ఓనానా (23)కి పాస్ చేయడంతో అతను గోల్ చేశాడు. ఆతిథ్య జట్టు (29) మరో అద్భుతమైన దాడి చేసి పెనాల్టీ కార్నర్‌ను గెలుచు కుంది. మూడవ క్వార్టర్‌లో (38) బెల్జియం మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. జర్మన్‌ప్రీత్ సింగ్ గోల్ లైన్‌లో సేవ్ చేసి స్కోర్‌లను సమంగా ఉంచాడు. నీలకంఠ శర్మ (53) కార్తీ సెల్వమ్‌కు అద్భుతమైన పాస్ అందించినా ఫార్వర్డ్ గోల్‌పై షాట్ తీసుకోలేకపోయాడు. లూకాస్ బాల్తాజార్ బేస్‌లైన్ నుండి సర్కిల్‌లోకి సరైన పాస్‌ను ఆడాగా, థామస్ క్రోల్స్ (53) ఆధిక్యాన్ని అందించాడు. థామస్ మళ్లీ (57) బంతిని సెట్ చేసి బెల్జియంకు విజయాన్ని అందించాడు.

# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## నిఫ్టీ, ఐటి సూచీల్లోనే 1.62 లక్షలకోట్లు ఆవిరి




**ముంబయి, ఫిబ్రవరి 12:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. ప్రధానంగా ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగింది. కొన్ని బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు కనిపించినా, టెక్నాలజీ రంగంలో బలహీన సెంటిమెంట్‌ను అధిగమించలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్‌ఈ సెన్సెక్స్ 558.72 పాయింట్లు నష్టపోయి 83,674.92 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 146.65 పాయింట్లు క్షీణించి 25,807.2 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 5.51 శాతం కుప్పకూలింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురై నష్టాలు చవిచూసిన కంపెనీలుగా నిలిచాయి. ఆటో దిగ్గజం మహీంద్రా మహీంద్రా కూడా నష్టాల్లోనే ముగిసింది. మరోవైపు, మార్కెట్ బలహీనంగా ఉన్నప్పటికీ బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), ట్రెంట్ వంటివి లాభపడి సూచీలకు కొంత మద్దతు ఇచ్చాయి. నిఫ్టీ 25,840-25,900 స్థాయిని దాటనంత వరకు స్వల్పకాలికంగా మార్కెట్ బలహీనంగానే కొనసాగిందని అంచనావేసారు. ఐటీతో పాటు రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. బ్రాడర్ మార్కెట్లలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలతోనే ముగిశాయి. ప్రత్యేకించి నిఫ్టీలో ఐటి సూచీ 5.51శాతం దిగజారింది. నిఫ్టీ ఐటి కంపెనీ మొత్తం మార్కెట్ విలువలు రూ.27,32,579 కోట్లకు చేరింది. సూరుగా 1.6 లక్షలకోట్లు కంపెనీల షేర్లరూపంలో నష్టం వచ్చినట్లు తెలుస్తోంది. టిసిఎస్ 5.48శాతం 52 వారాల కనిష్టం రూ.2750కి చేరింది. ఇన్ఫోసిస్ 5.48, టెక్‌మహీంద్ర 6.40శాతం, హెచ్‌సిఎల్ టెక్, ఎంఫసిస్, విప్రో కంపెనీలు 4.5 నుంచి ఐదుశాతం చొప్పున దిగజారాయి. మొత్తం ఐటి సూచీని డేంజర్‌జోన్‌లోకి గురువారం నెట్టివేసినట్లయింది. ఒక బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.46శాతం క్షీణించింది. స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.86శాతంమేర దిగజారింది. బిఎస్ఇలో 1676 కంపెనీలు పెరిగితే 2530 కంపెనీలుక్షీణించాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.82గా కొనసాగి రూపాయి క్షీణతను కొనసాగించారు. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్లకుగాను 39 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 69.01 డాలర్లుగా మారాయి.



# వేతన పెంపును ప్రకటించిన 'విప్రో'

**బెంగళూరు, ఫిబ్రవరి 12:** సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ విప్రో తన ఉద్యోగులకు మార్చి ఒకటవ తేదీనుంచి జీతాలను పెంచుతున్నట్లుప్రకటిం చడంతో ఉద్యోగులకు కొండంత ఊరట లభించింది. వేతన పెంపు ఎంతమేర ఉంటుం దన్నది ఇప్పటివరకూ స్పష్టత ఇవ్వలేదు. భారతీయ ఐటి సేవల కంపెనీలు వేతనాల పెంపుపై ఫోకస్ పెంచాయి. అలాగే వేరియబ్ వేతనాలపెంపును కూడా పరిశీలిస్తున్నాయి. అనిశ్చిత వాణిజ్య పరిస్థితుల్లో వేరియబుల్ పే మంచిదన్న భావనతో ఉన్నారు. సుంకాల యుద్ధం, భౌగోళిక ఉద్రిక్తతలు ఇందుకు కీలకంగా భావించాలి. టిసిఎస్ ఏప్రిల్‌ఋంచి పెంచాలని చూసినా గత సెప్టెంబరునుంచే పెంచుతున్నట్లు ప్రకటించింది.

# హిండాల్కో నికరలాభం రూ.2049 కోట్లు

**ముంబయి, ఫిబ్రవరి 12:** హిండాల్కో ఇం డస్ట్రీస్ నికరలాభం మూడో త్రైమాసికంలో రూ.2049 కోట్లు ఆర్జించినట్లు ప్రకటిం చింది. అయితే గత ఏడాది ఇదే కాలంలో 4741 కోట్లు ఆర్జించిన సంస్థ 56.8శాతం నికరలాభాలు క్షీణించినట్లు ప్రకటించింది. రాబడులపరంగా 0.7 శాతం పెరిగాయి. రూ. 66,521గా నమోదయింది. గతత్రైమాసి కంలో 66,058 కోట్లనుంచి స్వల్పంగా పెరిగింది. ఎబిడిటా కూడా 10.8శాతం క్షీణించి రూ.7994 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ. 8996 కోట్లుగా ఉంది.ఎబిడిటా మార్జిన్ 13.6శాతంనుంచి 12శాతానికి తగ్గింది. కంపెనీ న్యూయార్క్ లోని ఓస్వేగో ప్లాం ట్‌లో అగ్నిప్రమాదం కారణంగా రూ. 2610 కోట్లు భారం పడింది. ఇదే త్రైమా సిక ఫలితాలపై ప్రభావంచూపించిందని కంపెనీ చెపుతోంది. ఇక అల్యూమినియం విభాగం త్రైమాసిక ఎబిడిటా రూ.4832 కోట్లుగా ఉంది. 14శాతంపెరిగింది. ఆదిత్య ఎఫ్ఆర్‌పి, బ్యాటరీ ఫాయిల్, ఎసి ఫిన్ కోటింగ్; కాపర్ ట్యూబ్స్ వంటివాటిలో మంచి బిజినెస్ చేసుకోగలిగామని హిం దాల్కో ఎండి సతీష్‌పాయ్ అన్నారు. త్రైమా సిక పలితాలప్రకటనకు ముందు హిం దాల్కో షేర్లు 0.65శాతం దిగువన అంటే రూ.964.40వద్ద ఎన్ఎస్ఇలో కొనసా గాయి. బెంచ్‌మార్క్ నిఫ్టీ 0.57శాతం పత నం అయితే షేహిందాల్కో షేర్లు మరింత క్షీణించాయి.






# జనవరి రిటైల్ ద్రవ్యోల్బణం 2.75%



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** వినియోగదారుల ధరలసూచీ ఆధారంగా నిర్ధారించే ద్రవ్యోల్బణాన్ని జనవరి నెలకుగాను 2.75శాతంగా ఉందని కేంద్ర అర్థగణాంకశాఖ పథక అమలుశాఖ వెల్లడించింది. అఖిలభారత వినియోగదారుల ఆహార ధరల సూచీ ఆధారంగా జనవరిలో 2.13శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ఉత్పత్తులధరలు 1.96శాతంపెరిగాయి. పట్టణప్రాంతాల్లో 2.44శాతంగా ఉన్నట్లు మోస్పీ వెల్లడించింది. ఏటికేడాది హౌసింగ్ ద్రవ్యోల్బణం రేటు జనవరిలో 2.05శాతంగా ఉంది. హౌసింగ్ దరలు కూడా 2.39శాతం గ్రామీణప్రాంతాల్లోను 1.92శాతం పట్టణప్రాంతాల్లోను పెరుగుదలనమోదుచేసాయి. జనవరి సిపిఐ ద్రవ్యోల్బణ డేటాను 2024 బేస్ ఇయర్‌గా చేసుకుని నిర్ధారించారు. గడచిన 12 ఏళ్లగా వ్యయం తీరు ఎలా మార్పులు చెందిందీ కూడా ఈ బేస్ ఇయర్ మార్పువల్ల తెలుస్తుందని మోస్పీ వెల్లడించింది. కొత్త వ్యవస్థలో సేవలరంగానికి కొంత ఒత్తిడిపెరుగుతుంది. ఆహార ఉత్పత్తుల వాటా మాత్రం కొంతమేర తగ్గుతుంది. ఇక గ్రామీణ హౌసింగ్, ఆన్‌లైన్ మీడియా సర్వీస్ ప్రొవైడర్లు లేదా స్ట్రీమింగ్ సేవలసంస్థలు, విలువలు జోడింపు ఉన్న డైయిరీ ఉత్పత్తులు, బార్లే, ఇతర ఉప ఉత్పత్తులు, పెన్‌డ్రైవ్ బాహ్య హార్డ్ డిస్క్, అటెండెంట్, బేబి సిట్టర్, కసరత్తుల సామనరగి వంటి వాటిని కూడా ఈసారి ద్రవ్యోల్బణంలో మదింపుకోసం ఎంచుకున్నారు. విసిఆర్, డివిడి ప్లేయర్లు, రేడియో టేప్‌రికార్డరు, సెకండ్‌హ్యాండ్ దుస్తులు, పీచు లేదా పీచుతో రూపొందించిన తాడు వంటిఉత్పత్తులను మాత్రం మదింపునుంచి మినహాయించారు. 2012 వరకూ వచ్చిన బేస్ ఇయర్‌సాయంతో రిటైల్‌ద్రవ్యోల్బణాన్ని గణించారు. ఈసూచీలో ఆహారం, శీతలపానీయాలకు ఎక్కువ వాటా ఉంది. ఆ తర్వాత హౌసింగ్, ఇంధనం, సేవలరంగం అంటే రవాణా, ఆరోగ్యం, విద్యారంగాలు కూడా నిలిచాయి. ప్రతి కేటగిరికి ఇచ్చిన ప్రాధాన్యం కుటుంబీకుల వ్యయ సర్వేల ఆధారంగా ఉంటుందని సగటు వ్యయం ఆధారంగా మదింపుచేసి నిర్ధారించడం జరుగుతుందని మోస్పీ వెల్లడించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14